ప్రజాశక్తి

Vol. 1, no. 367

(Dec. 15, 1946)

బెజవాడ, 1946

Record no. 683

Prajāśakti

Vol. 1, no. 367

(Dec. 15, 1946)

Bejavāḍa, 1946

Record no. 683

Regd. No 4486 — 20 పేజీలు 3 అణాలు

ప్రజాశక్తి

కమ్యూనిస్టు దిన పత్రిక

సంపుటి 1] బెజవాడ 15-12-46 ఆదివారం [సంచిక 367

బ్రిటన్ కొత్త చిక్కులు తెచ్చిపెడుతోంది

రాజ్యాంగసభలో నెహ్రూ ప్రసంగం

లేబర్ ప్రభుత్వం విభజించిపాలించే విధానమనుసరిస్తోందని టాండన్

న్యూఢిల్లీ, డిసెంబరు 13

ఈరోజు రాజ్యాంగ నిర్మాణసభలో సభ ఆశయాలనుగూర్చిన పండిత నెహ్రూ తీర్మానం చర్చకు వచ్చింది. నెహ్రూ తీర్మానాన్ని ప్రవేశపెడుతూ ఇలా అన్నారు:

"ఈతీర్మానం మనం నిర్మించనున్న శాసనంలో భాగంకాదు. ఇప్పుడిక్కడున్న సభ్యులూ, ఇకరానున్నవారు (లీగు) కలిసి స్వేచ్ఛగా చట్టాన్ని తయారుచేయవచ్చు. ఇది ఇటు మితవాదానికి, అటు అతివాదానికి, మధ్య రాజీతీర్మానం. మన రాజ్యాంగచట్ట ఆశయాన్నిది స్థూలంగా సూచిస్తున్నది. ఇది ఏపార్టీకి అసమ్మతంగా ఉండదని నా భావం. ఇందులోని ప్రధాన సూత్రాలెవ్వరూ కాదని లేదు.

బ్రిటన్ కొత్తచిక్కులు తెచ్చిపెట్టింది

"నేను లండన్‌కు అయిష్టంగానే, ప్రధాని ప్రార్థననుసరించి వెళ్ళాను. నిరుత్సాహంతో ఆశాభంగంతో తిరిగివచ్చాను. కొత్తచిక్కులు బ్రిటిష్‌ప్రకటన తెచ్చిపెట్టింది. అయినా మనం ముందుకు పోవాలి. ఏమైనా బ్రిటిష్ తెచ్చిపెట్టిన ఇబ్బందులు, చిక్కులు నన్ను చాల కష్టపెట్టాయి. కొత్తపద్ధతులన్నీ వారు సూచిస్తున్నారు.

"స్వతంత్రం కోరుతూ మనం ఎన్నాళ్ళో పోరాటంలో పాల్గొన్నాం. అవసరమైతే మరో పోరాటం నడుపుతాం. ఇలాంటి దేశంలో చట్టాలమీద ఆధారపడి వ్యవహరించడం బ్రిటన్‌కు సాధ్యం కాదు. ఏదో సహృదయతంగా పనిచేసే సమయం వచ్చిందని ఆశించాము. ఇలాంటి సమయంలో అడ్డంకులు కల్పించే బ్రిటిష్ అధికారులు మన సంగతిని సరిగా అర్థం చేసుకోలేదు. తొలి మంచీ మన సమస్యను వారు అర్థం చేసుకోలేదు.

"ఇతరులు మనకు సలహాలివ్వాలనుకోవడం పొరపాటు. మనకు వారి సలహాలు, వారి అధికారాలు అక్కరలేదు. ఏమైనా మనం సహకార వాతావరణం కల్పించాలని ప్రయత్నించాం. బ్రిటన్ అలాగే ప్రవర్తించకపోతే ఇబ్బందులు తప్పవు.

దేశీయుల సహకారం

"మన దేశంలోని సోదరుల సహకారం కోసం ప్రయత్నిస్తాం. కాని అందుకని ప్రధానాశయాలకు నీళ్ళు వదులుకోవడం మాత్రం జరగదు.

"ఈ నాడు ఇంగ్లండు సహకారాన్నికూడ మనం కోరుతున్నాము. అదిరాకపోతే వారికే నష్టం. ప్రపంచంలో నేడు జరుగుతున్న సంక్షోభంలో నూతన భారతదేశం జన్మిస్తున్నది. ఇలాంటప్పుడు గ్రూపులు స్వార్థానికై పనిచేయరాదు.

రాచరికంపై నాకు నమ్మకంలేదు

"కొందరు రిపబ్లిక్ అనేమాట సంస్థానాధిపతులకు అయిష్టముగా వున్నారు. నాకు రాచరికంమీద నమ్మకం లేదు. సంస్థానాలగూర్చి ఇప్పటినుండో మనఆశయం స్పష్టీకరించాం. అక్కడి ప్రజలు స్వతంత్రులు కావాలి. స్వతంత్రంలో తేడాలు, విభేదాలు ఉండరాదు.

"బ్రిటిష్ ఇండియాలో భాగాలుగా వున్న సంస్థానాలలో స్వతంత్రం మనకున్నట్టే ఉండాలి. ఇప్పుడు సంస్థానాల ప్రాతినిధ్యం గూర్చి సంస్థానాధిపతులతో కూడ సంప్రతిస్తాము. కాని, ఆఖరున రాజ్యాంగచట్టం నిర్మించేటప్పుడు మాత్రం సంస్థాన ప్రజా ప్రతినిధులే మిగతా ప్రాంతాల ప్రతినిధులతోపాటు సభలో పాల్గొనాలి.

ప్రభుత్వ పద్ధతి మనలాగే సంస్థానాల్లో వుండాలి

"మనప్రాంతంలో వున్నట్టే సంస్థానాల్లోను ప్రభుత్వ పద్ధతి వుండాలి. అయినా అది ఆ ప్రజలే నిర్ణయించుకొంటారు. ఏ సంస్థాన ప్రజలయినా రాచరికం వుండాలనే నిర్ణయించుకొంటే అది వారిష్టం. అలా రాచరికం వుండాలని ప్రజలు నిశ్చయించిన సంస్థానంలోకూడా ప్రజలకు బాధ్యతాయుత ప్రభుత్వము, సంపూర్ణ స్వతంత్రంవుండాలి. రాజా నామమాత్రంగా వుండాలి. అప్పుడలాంటి సంస్థానం భారతదేశ యూనియన్ రిపబ్లిక్‌లో భాగంగా వుండవచ్చును.

"మనం విడిగా రాజ్యాంగచట్టం తయారు చేస్తాము. అంతకుముందు మన ఆశయమేమిటో స్పష్టపరచడం కోసమే ఈ తీర్మానం ప్రవేశపెట్టాను. ఇదిహామీ ఇవ్వడం కాదు. అసలు దీక్ష-ప్రతిజ్ఞ తీసుకోవడమే. భారత ప్రజలందరి ఆశయం ఇందులో ప్రతిబింబిస్తున్నది. ఇందులో ఇప్పుడుపాల్గొనని గ్రూపుకుకూడ విరుద్ధమైందేమీలేదు కొందరు సభలో ఇప్పుడు లేకపోవడం విచారకరం. వారు తప్పకవచ్చిపాల్గొంటారనిఆశిస్తున్నాను.

"ఈలోగా మన కర్తవ్య నిర్వహణలో వైవారిని మరచిపోక, అందరికి ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు మనం పనిచేయాలిగాని, మన పార్టీ దృక్పథాన్ని మాత్రమే చూసుకోరాదు"

ఆదర్శదేశాలు

తర్వాత నెహ్రూ, గాంధీజీ సభలోలేకున్నా మనల నాశీర్వదిస్తారన్నారు. గత చరిత్రను భావి ఉజ్వలతనుచెప్పి యిలా అన్నారు.

"అమెరికా స్వతంత్ర పోరాటం తర్వాత వారెన్నో ఇబ్బందులకు లోనైనా పట్టువిడవక రాజ్యాంగచట్టం నిర్మించారు.

"అలాగే మహా మహత్తర సోవియట్ సోషలిస్టు ప్రభుత్వం, విప్లవంద్వారా ఉద్భవించింది. అది మన పొరుగుననే ఉన్న దేశం. ఆదేశం నేటి ప్రపంచరంగంలో అద్భుతంగా తన పాత్రను నిర్వహిస్తున్నది.

ఈ రెండు దేశాలను మనం ఆదర్శంగా ఉంచుకోవాలి.

రిపబ్లిక్ ఆశయం

"కొందరు రిపబ్లిక్‌తోపాటు ప్రజాతంత్ర రాజ్యాంగం అని ఉండాలంటున్నారు. మనం ప్రజాతంత్రానికి ఎప్పుడూ సిద్ధమే. అది రిపబ్లిక్కులోనే ఉన్నది. వట్టిప్రజాతంత్రమంటే చాలదు. యూరపులో చాల ప్రజాతంత్రదేశాలున్నవి. కాని అవి సంపూర్ణ ప్రజాతంత్ర దేశాలు కావాలంటే ఎంతో మారవలసివుంది. మనం సంపూర్ణ ప్రజాస్వామిక ప్రభుత్వాన్ని ఏర్పరచాలి.

"సోషలిస్టు రిపబ్లిక్ అని కొందరు తీర్మానంలో చేర్చాలన్నారు. నా అభిప్రాయం సోషలిజం కావాలనే. కాని ఈ తీర్మానం వివాదాస్పదంగా ఉండరాదు సోషలిజంవైపు భారతదేశం వెళుతుందని ఆశిస్తున్నాను. ప్రపంచమంతా సోషలిస్టురాజ్యంకావాలి. అందరికి అనుకూలంగా ఉండాలన్న ఉద్దేశంతో సిద్ధాంత సంబంధమైన పదాలను తీర్మానంలో ఉపయోగించలేదు. పదాలలోని విషయాన్ని తెచ్చాము.

"మన రాజ్యాంగచట్ట నిర్మాణంలో అంతర్జాతీయ దృక్పథాన్ని మనసులో వుంచుకోవాలి ప్రపంచరాజ్యాలతో మైత్రిని నెంకొల్పుకోవాలి" అని నెహ్రూ ముగించారు.

టాండన్ ప్రసంగం

"క్రిప్సు నిన్న మన విభేదాలను రెచ్చగొడుతూ మాట్లాడారు. ఈ విభేదాలను బ్రిటిష్ ప్రభుత్వమే సృష్టించింది. బ్రిటిష్ ఎత్తులను మనం ఇప్పుడు అర్థంచేసుకోవాలి.

"లేబర్‌పార్టీ అధికారంలోకివస్తే, పాతకాలపు 'విభజించి పరిపాలించే' సూత్రం వదులుకుంటారనుకున్నాము. కాని నిన్నటి ప్రభుత్వసభ్యుల ఉపన్యాసాలు చూస్తే వారు తిరిగిఆసూత్రాన్నే అవలంబించి,మనలో కలతలు రేపుతున్నారని తెలిసిపోతున్నది.

రాజ్యాంగసభ స్వతంత్ర పంథా అవలంబిస్తుంది

"కాంగ్రెస్, బ్రిటిష్ ప్రణాళికను అంగీకరించి రాజ్యాంగసభలోకి వచ్చినమాట నిజమే. కాని ప్రజాపరిషత్తులు సమావేశమైన తర్వాత పూర్తిగా తమ కిష్టంవచ్చిన పద్ధతిని అవలంబించడానికి వీలున్నది"

సభను అధ్యక్షుడు సోమవారం సాయంత్రానికివాయిదావేశాడు. తీర్మానానికి మొత్తం 40 సవరణలు వచ్చాయన్నారు.

ఇండియానుంచి బ్రిటిష్ సేన వైదొలగాలి

పార్లమెంటులో కమ్యూనిస్టు సభ్యుని ప్రకటన

లండన్, డిసెంబరు 13

నిన్న పార్లమెంటులో భారతదేశ సమస్యపై ప్రారంభమైన చర్చలో, కన్సర్వేటివ్ పార్టీ నాయకుని (చర్చిల్) ఉపన్యాసాన్ని ఖండిస్తూ పలువురు లేబరుపార్టీ సభ్యులు ఉపన్యసించారు. చర్చిల్ మైనారిటీలను వెనకవేసుకుని, భారతదేశ స్వాతంత్ర్యానికి అడ్డుతగులుతున్నాడనివిమర్శించారు సిల్వర్‌మన్‌వంటి మితవాద లేబరుపార్టీసభ్యులు భారత రాజకీయపార్టీల మధ్య సామరస్యం కుదరకపోతే, బ్రిటిష్ ప్రభుత్వం ధైర్యంగా పరిపాలనా యంత్రాన్ని కొనసాగించాలని సూచించారు. వైట్ అనే లేబర్‌పార్టీ సభ్యుడు 12 నెలల్లో బ్రిటిష్ సేనలను ఇండియానుంచి తొలగించాలని కోరాడు.

కమ్యూనిస్టుసభ్యుడు గలాకర్ మాత్రమే యిలా స్పష్టంగా ప్రకటించాడు:

"అనేకమంది సభ్యులు ఇండియాకు స్వాతంత్ర్యం ఉండవలసిందేనని ఉపన్యాసాలిచ్చారు. కాని, ఇండియానుంచి బ్రిటిష్ సేనలు, వెంటనే వైదొలగనిదే, ఇండియాకు స్వాతంత్ర్యం రాదు"


ఈవేళ రెండవరోజు తిరిగి చర్చప్రారంభమైంది. సర్ జాన్ ఆండర్సన్, రాడ్‌క్లిఫ్, కమాండర్ నోబుల్, బట్లర్ మొదలైన కన్సర్వేటివ్ పార్టీ సభ్యులు ప్రభుత్వ పాలసీని విమర్శిస్తూ, క్రింది విధంగా వాదించారు. చర్చిల్ మాటలను బలపరిచారు.

కన్సర్వేటివ్‌ల అభివృద్ధి-రోధక పంథా

1. ఒకమతానికిచెందిన పక్షం (కాంగ్రెసు) మరొక మతానికి చెందిన పక్షాన్ని ఎల్లకాలం అణచియుంచడాన్ని మనం సహించకూడదు.

2. భారత తాత్కాలిక ప్రభుత్వాన్ని ఏర్పరచడంలో లేబర్ ప్రభుత్వం తప్పు మార్గాలవలంబించింది, వైస్రాయి తనఇష్టం వచ్చిన వారిని నియమించకుండా, ఆయా పార్టీల నాయకులకు ఈసమస్యను విడిచి పెట్టాడు.

(మిగతా 19 వ పేజీలో)



ఏక భాష, సంస్కృతి గల రాష్ట్రాలకు స్వయంనిర్ణయ హక్కు వుండాలి

తాత్కాలిక ప్రభుత్వం స్వతంత్రంగా వ్యవహరించాలి

ప్రజా పరిషత్తు సభలో కమ్యూనిస్టు సభ్యుని తీర్మాన పూర్తిపాఠం

భారత రాజ్యాంగనిర్మాణసభలో కామ్రేడ్ సోమనాథ లాహిరి ప్రవేశపెట్టదలచిన తీర్మాన సారాంశం నిన్న 'ప్రజాశక్తి' లో యిచ్చాం. దాని పూర్తిపాఠం క్రింద యిస్తున్నాం.

★

1\. భారతీయులు బ్రిటిష్ సామ్రాజ్యవాదుల సంకెళ్ళను త్రెంచుకొని, సంపూర్ణ స్వాతంత్ర్యం సంపాదించుకోవాలని వాంఛిస్తున్నారు. ఈ ప్రజాపరిషత్తుసభ భారతీయుల వాంఛకు ప్రత్యక్ష స్వరూపం. భారతదేశం సర్వాధికారాలు గల స్వతంత్రదేశమని యీ సభ ప్రకటిస్తోంది. బ్రిటిష్ఇండియాలోగాని, సంస్థానాలలోగాని, ప్రజలకే సర్వాధికారాలు ఉండాలని యీసభ తెలియజేస్తున్నది. ఇకనుంచి దీని అధికారాలన్నీ ప్రజలనుంచే సంక్రమిస్తాయి.

తాత్కాలిక ప్రభుత్వం

2\. తాత్కాలిక ప్రభుత్వంలో ప్రధానమైన రెండురాజకీయ పార్టీల ప్రతినిధులు, అల్ప సంఖ్యాక ప్రతినిధులు సభ్యులుగా ఉన్నారు వీరుభారతీయుల్లో అధిక సంఖ్యాకుల విశ్వాసం చూరగొన్నారు. అందువల్ల ఇకనుంచి వారు సర్వాధికారాలుగల స్వతంత్ర తాత్కాలిక ప్రభుత్వ సభ్యులుగా వ్యవహరించవలసిందని ప్రజాపరిషత్తు హెచ్చరిస్తోంది. ఇదివరకువలె, బ్రిటిష్ చక్రవర్తి పేరుతో కాకుండా, ప్రజల పేరుతో వ్యవహరించవలసిందని కోరుతోంది.

ఇంతవరకు వివిధ రాష్ట్రాలలో గవర్నర్లు, వైస్రాయి, బ్రిటిష్ ప్రభుత్వం చెలాయిస్తూవచ్చిన అధికారాలన్నీ నేటితో రద్దవుతున్నాయి అలాగే, సంస్థానాలలో వైస్రాయి చెలాయిస్తూన్న సార్వభౌమాధికారాలుకూడా నేటితో రద్దవుతున్నాయి.

సర్వాధికారాలు గల సంపూర్ణ స్వాతంత్ర్యం

3\. భారత తాత్కాలిక ప్రభుత్వం, సర్వాధికారాలుగల సంపూర్ణ స్వాతంత్ర్యం, ప్రకటిస్తూ, తక్షణమే క్రింది చర్యలు తీసుకోవలసిందని యీసభ హెచ్చరిస్తోంది:

(అ) బ్రిటిష్ సేనలన్నీ వైదొలగేలా చేయడానికి వెంటనే తగు చర్యలు తీసుకోవాలి. ఎందువల్లనంటే, అవి భారతదేశంలోఉండడం మనస్వతంత్ర ప్రతిపత్తికి భంగకరం. విదేశాలలో ఉన్న భారత సేనలను కూడా వెంటనే వెనుక్కి తీసుకురావాలి. ఎందువల్లనంటే, అన్ని దేశాల శాంతి, స్వతంత్రం ఉండాలనే విధానానికిది విరుద్ధం.

(ఆ) బ్రిటిష్ పెట్టుబడి దారుల క్రిందవున్న-బ్యాంకులు, పారిశ్రామిక సంస్థలు, రవాణా మార్గాలు, గనులు, రబ్బరు-తేయాకు మొదలైనతోటలు-వీటన్నిటినీ స్వాధీనం చేసుకొని ప్రభుత్వపరం చేయాలి.

(ఇ) స్వతంత్రతాత్కాలిక ప్రభుత్వాన్ని యితర దేశాలన్నీ గుర్తించేటట్లు తగుచర్యలు తీసుకోవాలి. ఇతర దేశాలతో సమానహోదాతో రాజకీయ సంబంధా లేర్పరచుకోవాలి.

(ఈ) భారతదేశ స్వాతంత్ర్యం, సమానహోదా, అన్యోన్య సహకారం అనే సూత్రాల ఆధారంమీద బ్రిటన్‌తో ఒడంబడిక చేసుకోవాలి.

తాత్కాలిక ప్రభుత్వం అవలంబించవలసిన కార్యక్రమం

4\. ఆచరణలో సంపూర్ణ స్వాతంత్ర్యం లభించేటందుకు భారత తాత్కాలిక ప్రభుత్వం క్రింది కార్యక్రమాన్ని అమలు జరపవలసిందని ప్రజాపరిషత్తుసభ ఆజ్ఞాపిస్తోంది. ఆ విధంగా, ప్రజాతంత్ర సూత్రాల కను గుణ్యమైన రాజ్యాంగచట్టాన్ని తయారు చేయగల అవకాశాలు కలుగుతాయి.

(అ) ఇప్పుడున్న భారతసైన్యాన్ని, నావికా దళాన్ని నిజమైన జాతీయ సైన్యంగా మార్చాలి. భారతీయులే అందులో అధికారులుగా ఉండాలి. ఈ సైన్యం భారతప్రజలయెడ భక్తితో వ్యవహరించాలి. భారత స్వాతంత్ర్యాన్ని గుర్తించాలి.

(ఆ) ప్రజలకు పూర్తిమైన పౌర సత్వ హక్కులుండాలి. కార్మికుల జీతాల పెంపుదల కొరకు, ఇతర జీవిత సౌకర్యాలకు, సమ్మెచేస్తే పోలీసులుగాని, మిలటరీగాని జోక్యం కలిగించుకోకూడదు. రైతులు జమీందార్లను, నిర్వ్యాపారస్థులను ప్రతిఘటిస్తూంటే, ఆహారాలాలను ఆదుపుచేడానికి పోలీసులను, మిలటరీని ఉపయోగించకూడదు. సామ్రాజ్యవాదుల నిరంకుశ విధానాన్ని ఖండిస్తూ ప్రజలు ప్రదర్శనలుచేస్తే, వాటిని పూర్తిగా బలపరచాలి. స్వదేశ సంస్థానాలలో ప్రజలు స్వాతంత్ర్యంకొరకు, ప్రజాతంత్ర విధానంకొరకు, పోరాటాలు సాగిస్తే, వాటిని బలపరచాలి.

(ఇ) కష్టజీవుల సహాయార్థం వెంటనే తాత్కాలిక ప్రభుత్వం క్రింది చర్యలు తీసుకోవాలి.

● గవర్నమెంటు క్రింద, జమీందార్ల క్రింద, ఉన్న బంజరు భూమిని భూమిలేని రైతులకు, వ్యవసాయ కూలీలకు స్వాధీనంచెయ్యాలి. శిస్తు రేట్లను తగ్గించాలి. ఋణాలకు మారటోరియం ప్రకటించాలి. రైతును భూమినుంచితొలగించకుండా చేయాలి. వ్యవసాయ ఆదాయాన్ని బట్టి పన్ను విధించాలి.

● కార్మికులకు కనీస జీతం, కార్మిక సంఘాలకు రిజిస్ట్రేషన్ ఉండాలి. వ్యతిరేకించే యజమానుల్ని శిక్షించాలి. ఇందుకొక శాసనం తక్షణమే తయారు చేయాలి.

● ప్రజల జీవితావసరాలకు తగినన్ని వస్తువులు తయారు కావడానికి ఇతర దేశాలనుంచి యంత్రసామగ్రిని తెప్పించి, పరిశ్రమల నభివృద్ధి పరచాలి.

● ప్రజా సామాన్యానికి అందుబాటులో వుండేటట్లు చౌక ధరలకు వస్తువులన్నీ సప్లయి చేయడానికి, యజమానుల లాభాలకు హద్దు లేర్పరచాలి.

సైన్యం, పోలీసులు, సివిలియన్ ఉద్యోగులు యికనుంచి భారతీయులకు, భారతదేశ ప్రతినిధులకు, మాత్రమే బాధ్యత వహించవలసివుంటారని ప్రజాపరిషత్తు ఆజ్ఞాపిస్తోంది. పై కార్యక్రమాన్ని అమలు జరిపే తాత్కాలిక ప్రభుత్వపు వుత్తరువులను భక్తితో అమలు జరుపవలసిందని హెచ్చరిస్తోంది.

నిరంకుశోద్యోగులు ఇదివరకుమాదిరిగానే యికమీదకూడా, తమ పాతయజమానుల కనుసన్నలలో మెలగడానికి చేసేవిచ్ఛిన్నకర చర్యలను జాగ్రత్తగా పరిశీలించవలసిందని యీసభ ప్రజల్ని కోరుతూంది. అట్టి నేరస్థుల్ని వెంటవెంటనే బయటపెట్టి, తగిన శిక్షలు విధించడానికిది సహాయకారి అవుతుంది

స్వతంత్ర ప్రజాపరిషత్తుసభ

5\. బ్రిటిష్ పెత్తనాన్ని నిర్మూలించడానికి సన్నద్ధులైవున్న ప్రజల సహకారంతో, భారత తాత్కాలిక ప్రభుత్వం సర్వాధికారాలుగల స్వతంత్ర ప్రజాపరిషత్తు సభను సమావేశ పరుస్తుంది. దానికి ఎన్నికలు వయోజన వోటింగుపద్ధతి ప్రకారం, దామాషా ప్రాతినిధ్య సూత్రాన్నిబట్టి, జాతుల స్వయం నిర్ణయ సూత్రపు ఆధారంమీద, జరుగుతాయి.

పాకిస్తాన్ సమస్య, భారతదేశ ఐక్యతా సమస్య ప్రజాతంత్ర పద్ధతిని పరిష్కరింపబడాలి

6\. పాకిస్తాన్ సమస్యపైన, భారతదేశ సమస్యపైన కాంగ్రెసుకు - ముస్లింలీగ్‌కు మధ్య ప్రస్తుతం అభిప్రాయ భేదాలున్నాయి. ఈ సమస్యను పరిష్కరించేందుకు జాతుల స్వయంనిర్ణయ సూత్రాన్ని గుర్తిస్తూ, ప్రజల వోటింగుకు విడిచిపెట్టాలి. ఈ క్రిందివిధంగా అది జరగాలి:

(అ) వివిధ ప్రాంతాలకు సరిహద్దులు నిర్ణయించే దానికొక ఉపసంఘాన్ని నియమించాలి. ఆ ఉపసంఘంవెంటనే ఇప్పుడున్న రాష్ట్రాలకూ,సంస్థానాలకూ కొత్తసరిహద్దులనుసూచిస్తుంది. అలా కొత్త సరిహద్దులతో ఏర్పడే ప్రాంతాలు, సంస్థాన భాగములతో కలిసి, ఏకభాష, విజ్ఞానంఉన్న వివిధ జాతుల జన్మభూములుగా ఉంటాయి. ఈవిధంగా క్రింది ప్రాంతాలు వివిధ జాతుల జన్మభూములుగా ఉంటాయి. కేరళ, కర్ణాటక, ఆంధ్ర, తమిళనాడ్, మహారాష్ట్రం, గుజరాత్, రాజస్థాన్, హిందుస్థాన్, బీహారు, ఒరిస్సా బెంగాల్, అస్సాం, సింధు, బెలూచిస్థాన్,పంజాబు, పఠాన్ దేశం,కాశ్మీర్.

(మిగతా 3 వ పేజీలో)

నాయకుల అంతరంగిక చర్చలు

మితవాదుల ధోరణి

(మా విలేఖరి)

న్యూఢిల్లీ, డిసెంబరు 13

రాజకీయతీర్మానం చదివి చర్చకు తయారయేటందుకు సభ్యులకు అవకాశం ఇవ్వడానికి రాజ్యాంగసభ రేపటికి వాయిదావేయబడింది. రెండు రోజులపాటు కాంగ్రెస్ పార్టీవారి సభజరిగింది.

పార్టీ సమావేశంలో సభ్యులందరూ కాంగ్రెస్ ఆజ్ఞలను అంగీకరించాలి, అనే విషయంమీద జయకర్, కుంజ్రూలాంటి మితవాదులు వ్యతిరేకించారు. తమ చిత్తానికి తోచినట్లు వ్యవహరించేహక్కు తమకు వుండన్నారు. ఈ మితవాదులు తీర్మానంలో స్వాతంత్ర ప్రకటన భాగం వద్దన్నారు. అలా చేస్తే, బ్రిటిష్‌వాళ్లు బెదరిపోతారు. రిపబ్లిక్ అన్నమాటే ఎత్తుకోవద్దన్నారు. అదుంటే సంస్థానాధీశులు భయపడి దూరమైపోతారు.

"రాష్ట్రాలకు విశిష్టాధికారాలు (కేంద్రకాలిక తప్ప మిగతావి) వున్నవనే భాగం మీద హిందూమహాసభా నాయకుడు శ్యామ ప్రసాద్ ముఖర్జీ వ్యతిరేకించాడు కాని, కాంగ్రెస్ ఇదివరకే ఆ విషయానికి అంగీకరించింది కాంగ్రెసువాదులు ఆయనవాదాన్ని నిరాకరించారు.

"అనుక్రమంగా కేంద్రానికి"వున్న అధికారాలు అనే తీర్మాన భాగాన్ని మితవాదులు వ్యతిరేకించారు. కేంద్రానికిగల అధికారాలు ఏవో బ్రిటిష్ ప్రణాళికలోనే చెప్పారు- ఇంక అనుక్రమంగా వచ్చే అధికారాల ప్రసక్తి లేనేలేదు అన్నారు.

భారతదేశాన్ని విభజించవలసిందే

జిన్నా పాతపాట

లండన్, డిసెంబరు 14

లండన్‌నుండి అమెరికాకు రేడియో వుపన్యాసం ఇస్తూ జనాబ్ జిన్నా ఈ విధంగా చెప్పారు:

"భారతదేశ స్థితి చాలా ప్రమాదంగానే వుంది. హిందూ - ముస్లింలు రెండు జాతులు. ఏ విషయంలోనూ వారిలో పోలిక లేదు. ఈ మధ్యనే అక్కడ కొన్ని రాష్ట్రాలలో జరిగిన దురంతాలు వెంటనే ఆపివెయ్యక, బ్రిటిష్ ప్రభుత్వం కాలహరణంచేస్తే భారతదేశంలో అంతర్యుద్ధం వస్తుంది. దాని వలితాలు ప్రపంచం మొత్తంమీదనే ప్రతిబింబించగలవు.

"దీనినుంచి బయటపడ్డానికి ఒకటేమార్గం ఉంది. దేశం రెండుగా విభజింపబడాలి. ఈపని ఎంత త్వరగా చేస్తే అంత మంచిది.

దయవుంచి నోరుమూసుకో

చర్చిల్‌కు విజయలక్ష్మి జవాబు

లండన్, డిసెంబరు 14

మిత్రరాజ్యసమితికి భారత ప్రతినిధివర్గ నాయకురాలుగావెళ్ళిన శ్రీమతి విజయలక్ష్మి పండిట్ నిన్నరాత్రి ఈవిధంగా ప్రకటించింది.

"చర్చిల్ ఉపన్యాసం చాలా కుత్సితంగా వుంది.

"భారతదేశం పరాధీనతనుండి స్వాతంత్ర్యము సంపాదించడానికై ప్రయత్నిస్తూ వుంది. భారతీయులం అందరం అక్కడి దుస్థితులకు విచారిస్తున్నాం. వాటిని అవదానికి పూర్తి ప్రయత్నాలు చేస్తున్నాం. ఇతరుల సాయం కోరకుండా మాపని మేము చేసుకోవడం నేర్చుకున్నాం. చర్చిల్లూ, చర్చిలులాంటి వాళ్ళు నోరు మూసుక్కూర్చుని భారతదేశ విషయాలను భారతదేశానికే వదలమని కోరుతున్నాం."

బ్రిటిష్ ప్రణాళిక బూటకత్వం బయటపడింది

కాంగ్రెసు, లీగ్‌లు కార్యాచరణకు పూనుకోవాలి

కామ్రేడ్ పి. సి. జోషి



భారతదేశానికి స్వతంత్రమైన రాజ్యాంగ చట్టం తయారుచేసుకోవడంలో పూర్తిస్వేచ్ఛ ఉంటుందని, మొదటినుంచీ బ్రిటిష్‌సామ్రాజ్యవాదులు తమ ప్రణాళికద్వారా బాకాలూదారు. భారతీయులలో అనేకమంది నమ్మారు. కాని, లండన్ సంప్రతింపుల తర్వాత బ్రిటిష్ ప్రభుత్వం చేసిన ప్రకటనచూస్తే, ఆ వాగ్దానం ఎంత బూటకమైనదో స్పష్టపడింది.

రాజ్యాంగనిర్మాణసభ తయారు చేయబోయే భారత రాజ్యాంగచట్టం బ్రిటిష్‌ప్రభుత్వపు ఆమోదం పొందితీరాలని, బ్రిటిష్ ప్రణాళికలో ఉన్నదని ఖచ్చితంగా బ్రిటిషు పాలకులు తెలియజేశారు. అంతేకాదు, భారత రాజకీయపార్టీల మధ్య అభిప్రాయభేదాలు వచ్చినప్పుడల్లా, ఒక్కొక్క నిబంధనను వ్యాఖ్యానించేటందుకు, బ్రిటన్ జోక్యం కలిగించుకొంటూ ఉంటుందని తేటతెల్లం అయింది. ప్రతిసారీ మన నాయకులు లండన్ పరుగెత్తడమో, లేక ఫెడరల్ కోర్టుకు పరుగెత్తడమో, చేస్తూవుండాలి. ఆకోర్టుయొక్క న్యాయాధికారికూడా బ్రిటిష్ ప్రభుత్వంచే నియమింపబడ్డ వాడే.

బ్రిటిష్ ప్రభుత్వపు వ్యాఖ్యానాన్ని అంగీకరించకపోతే, దేశాన్ని రెండుగా, తమ యిష్టం వచ్చినరీతిని, విభజింపుతామనే, బెదిరింపుకూడా ఆ ప్రకటనలో ఉంది. పాకిస్తాన్ ప్రాంతాలలో ఆయా గ్రూపుల ప్రతినిధులు వేర్వేరుగా సమావేశమై, మెజారిటీవోటు ప్రకారం తమ రాజ్యాంగాన్ని తాము తయారుచేసుకొంటారనీ, గ్రూపు ప్రభుత్వాలను ఏర్పరచుకొంటారనీ, కాంగ్రెసు తెలిపింది. ఇప్పుడు ప్రభుత్వ ప్రకటననుబట్టి, వివిధ రాష్ట్రాలు ఆయా గ్రూపులలో చేరడానికిగాని, చేరకపోవడానికిగాని స్వేచ్ఛ ఉండదు. గ్రూపుల రాజ్యాంగ చట్టాలు తయారయి, ఎన్నికలు జరిగిన తర్వాతే, ఏ రాష్ట్రమయినా గ్రూపులనుంచి విడిపోవడానికి హక్కు ఉంటుంది. దీనికి కాంగ్రెసు అంగీకరించకపోతే ముస్లింలీగు రాజ్యాంగసభలో చేరదు. అప్పుడు రాజ్యాంగ సభ తయారు చేయబోయే రాజ్యాంగచట్టం, ఇష్టంలేని ప్రాంతాలపై బలవంతంగా రుద్దడానికి వీలులేదు. ఇదీ ప్రభుత్వ ప్రకటన సారాంశం.

ఈ ప్రకటనలోనే ముస్లింలీగుకు ఒక ఎరకూడ చూపెట్టారు. పాకిస్తాన్ ప్రాంతాల్లో గ్రూపులు వేరువేరుగా రాజ్యాంగ చట్టాలు తయారుచేసుకొనే అవకాశం ఉన్నది కాబట్టి, లీగ్ రాజ్యాంగసభలో చేరవలసిందని విజ్ఞప్తిచేశారు. మరొకవైపు లీగ్ పాల్గొనని రాజ్యాంగ నిర్మాణసభ ఎట్టి రాజ్యాంగ చట్టమైనా తయారుచేస్తే, అది అమలులోకిరాదని బ్రిటిష్ ప్రభుత్వం లీగ్‌కు హామీయిచ్చింది.

బ్రిటిష్ ప్రకటన ముస్లిం ప్రజాసామాన్యానికి ఒక విజయం అంటూ లీగునాయకులు ప్రకటిస్తున్నారు. కాని, ఏ విధంగానూ అది విజయమని చెప్ప వీల్లేదు. భారతదేశంలోని ఇతర ప్రాంతాలవలెనే ముస్లిం మెజారిటీ ప్రాంతాలనుకూడా దాసినత్వంలో ఉంచడానికి వేసిన ఎత్తు యిది. ముస్లిం ప్రజల స్వాతంత్ర్య వాంఛను హిందువులపై పోరాటంగా మార్చడానికి మాత్రమే అది వినియోగపడుతుంది. వివిధ గ్రూపులలో ముస్లింలు హిందువులమీద పోరునల్పడానికి మాత్రమే స్వాతంత్ర్యం లభించింది. అంటే అర్థం హిందువులమీద, ముస్లింలమీద పెత్తనం చెలాయించే సామ్రాజ్యవాదులకు బలం చేకూరుతుందన్నమాట.

ఎలాగైనా ముస్లింలీగును రాజ్యాంగ సభలో పాల్గొనేటట్లు చేయడానికి బ్రిటిష్ ప్రభుత్వం తాలిస్తోంది. అలా చేయగలిగితే రాజ్యాంగ నిర్మాణసభలో కాంగ్రెసు - లీగులమధ్య వచ్చే ఘర్షణలు ప్రతిష్ఠంభనలు తీవ్రరూపం దాల్చకుండా, తాము అప్పుడప్పుడు నిర్ణయాలు ఇస్తూ, పెత్తనం సాగించవచ్చు.

చివరకు, కాంగ్రెసు లీగులు కలిసి పాల్గొనే రాజ్యాంగనిర్మాణసభ భారతదేశానికొక రాజ్యాంగ చట్టం తయారు చేసినా, బలవంతంగా రుద్దబడిన గ్రూపు ప్రభుత్వాలు హిందువులకూ—ముస్లిములకూ మధ్యగల ఘర్షణను ఇంకా తీవ్రతరం చేస్తాయి. ఇక కేంద్రంలోని యూనియన్ ప్రభుత్వం చూదామా అంటే, నిరంకుశులైన సంస్థానాధీశులు కీలకస్థానాలలో ఉంది, కాంగ్రెసు - లీగులమధ్య వచ్చే ఘర్షణల్లో వారు మధ్యవర్తులుగా ఉంటారు: ఈవిధంగా భారతదేశం బ్రిటన్ క్రింద శాశ్వత బానిసత్వంలో ఉంటుంది!

అలాతయారుకాబోయే రాజ్యాంగచట్టాన్ని తాము ఎంతో దయతో ఆమోదిస్తున్నామనీ, భారతీయులు తయారుచేసుకొన్న స్వతంత్ర రాజ్యాంగమనీ, బ్రిటిష్ పాలకులు ప్రపంచాన్ని మోసపుచ్చుతారు.

ఇప్పుడైనా మించిపోయిందిలేదు. కాంగ్రెసు, లీగ్ నాయకులు, ఎవరిమట్టుకు వారు, బ్రిటిష్ ప్రణాళికను తమ కనుకూలంగా మార్చుకొనేటందుకు బ్రిటిష్ పాలకవర్గానికి దాసోహంచేసే పాడువిధానాన్ని ఇప్పుడైనా విడిచిపెట్టవచ్చు. అలాచేయక, ఇప్పటి మాదిరిగానే విచ్ఛిన్నమార్గా లవలంబిస్తే, దేశం అంతర్యుద్ధజ్వాలల్లో తగులబడుతుంది. చివరకు లభించేది స్వాతంత్ర్యం కాదు, బానిసత్వం. ఇతర దేశాలయెదుట భారతదేశం పరాభవం పొందుతుంది.

పరిస్థితులు చాలాతీవ్రరూపం దాల్చాయి. వెంటనే కార్యాచరణ అవసరం.

తక్షణమే కాంగ్రెసు, లీగ్ నాయకులు ఇప్పుడవలంబించే విధానం నాశనకారిఅనీ, మార్చుకోవలసిన అవసరం వచ్చిందనీ, కాంగ్రెసు - లీగ్ ప్రజాసామాన్యం గ్రాంచెత్తి తెలియజేయవలసిన అవసరంవుంది. పాకిస్తాన్ సమస్యను, భారతదేశ ఐక్యతా సమస్యను ప్రజల అభిప్రాయానికి విడిచిపెట్టి, ప్రజాతంత్ర పద్ధతిపై పరిష్కరించడానికి అంగీకరించేటట్లు ఒత్తిడి తీసుకురావాలి. భాష, విజ్ఞానం వేర్వేరుగావుండే ప్రాంతాలను జాతులుగాగుర్తించి, వాటికిస్వయం నిర్ణయాధికారం వుంటుందని ప్రకటించేటట్లు ఆందోళన లేవదీయాలి.

ప్రస్తుత తాత్కాలిక ప్రభుత్వానికి సర్వాధికారాలు వుంటాయని బ్రిటిష్ ప్రభుత్వం ప్రకటించవలసి యుంటుందని కాంగ్రెసు ఖచ్చితంగా తెలియజేయడం అవసరం. లేకపోతే భారతీయులు ప్రతిఘటిస్తారని స్పష్టపరచవలసి యుంది.

కాంగ్రెసుచేసే యీ ప్రకటనను ముస్లింలీగు ఎట్టి షరతులు లేకుండా బలపరచవలసియుంది.

ఇప్పుడు బ్రిటిష్ ప్రభుత్వం అదే నాటకానికి స్వస్తిచెప్పాలంటే, ప్రజల్ని పోరాటం వైపు ఆయత్తం చేయాలంటే ఇదొక్కటే మార్గం. అప్పుడే, వయోజనులందరికీ వోటింగుహక్కు, వేర్వేరు జాతులకు స్వయంనిర్ణయాధికారం, ఉండే నిజమైన రాజ్యాంగ నిర్మాణసభ ఏర్పడుతుంది.

ప్రజల ప్రధాన హక్కులకు హామీ ఇవ్వాలి

(రెండవపేజీ తరువాయి)

(ఆ) సరిహద్దునిర్ణయసంఘం నిర్ణయించిన కొత్తరాష్ట్రాలకు-వివిధజాతుల జన్మభూములకు స్వయం నిర్ణయ హక్కును గుర్తించాలి. అలా ఏర్పడిన (కొత్తగా ఏర్పడిన రాష్ట్రాలలోని) ప్రజలకు సంపూర్ణ స్వయంనిర్ణయ హక్కు ఉంటుంది. ఆహక్కుకు ఎలాంటి షరతులుండవు. తాము ఇండియన్ యూనియన్‌లో చేరాలా లేక ప్రత్యేక ప్రభుత్వంగా ఉండాలా అనే అంశాన్ని ఆ ప్రాంతంలోని వయోజనులందరి ఓటింగుపై నిర్ణయించుకొనే హక్కు ఉంటుంది. యూనియన్ రాజ్యాంగ చట్టం నిర్మింపబడకముందే, ఎక్కడెక్కడ కావాలంటే ఆ రాష్ట్రాలలో 'ప్లెబిసైట్'(ప్రజాఓటు)తీసుకోవాలి.

సర్వస్వతంత్ర ప్రజా పరిషత్తు ఆశయం ఇలా వుండాలి. జాతీయ ప్రజాతంత్ర రిపబ్లిక్కులతో స్వతంత్ర ఇండియన్ యూనియన్‌ను సృజించడం; అందులోని రిపబ్లిక్కులకు సమాన స్వతంత్రం, విడిపోయే హక్కు అంగీకరించడం. ఇందుకే ప్రయత్నించాలి.

భారత సంస్థానాలు

7\. దేశంలో మూడోవంతు భాగాన్ని 584 గురు నిరంకుశ మధ్యయుగ ప్రభువులు రాజ్యం చేస్తుండడం ప్రజాతంత్ర సూత్రాలకే సంపూర్ణంగా విరుద్ధమని యీసభ ప్రకటిస్తున్నది. ఆసంస్థానాలలో వెంటనే తాత్కాలిక ప్రజాప్రభుత్వాలు ఏర్పడాలని కోరుతున్నది. అలాఏర్పడిన ప్రభుత్వాలు వయోజనఓటింగు హక్కు, దామాషా ప్రాతినిధ్యంమీద ప్రజాపరిషత్తులను ఎన్నుకోవాలి. ఆప్రజాపరిషత్తులు ప్రజాతంత్రం రాజ్యాంగచట్టాన్ని నిర్మించాలి. సంస్థానాధిపతుల భవిష్యత్తుకూడా ఆపరిషత్తే నిర్ణయించాలి. ఆపరిషత్తునుండే అఖిలభారత ప్రజాపరిషత్తుకు ప్రతినిధులను ఎన్నుకోవాలి. ఆ సంస్థాన ప్రాంతమంతాగాని, అందులోని ప్రత్యేక భాగంకాని ప్రక్కనున్న రాష్ట్రాలలోని తమజాతి ప్రజలతో చేరిపోవాలను కుంటే ఆ దిశ ప్లెబిసైట్‌ద్వారా సంస్థాన ప్రజలే నిర్ణయించుకోవాలి.

ప్రధాన హక్కులు

8\. పైవిధంగా ఏర్పడిన సర్వస్వతంత్ర ప్రజాపరిషత్తు, యీ క్రింది ప్రధాన హక్కులను గుర్తించడాన్ని పాతిపదికగా చేసుకొని రాజ్యాంగచట్టం తయారుచేయాలి.

(అ) ఆయుధాలు ధరించేహక్కు:

(ఆ) వ్యవసాయం చేసేవారికి భూమి: అన్నిరకాల భూస్వామ్య విధానాన్ని: రైతుకు, ప్రభుత్వానికి మధ్యవున్నదళారీలను రద్దుచెయ్యాలి.

(ఇ) పనిచేసే హక్కు: దేశాన్ని త్వరగా పారిశ్రామికంచేసి, ప్రధాన పరిశ్రమలను, కాఫీ,తేయాకు,రబ్బరు తోటలను, గనులను, రవాణా, వార్తా సంస్థలను ప్రభుత్వపరం చెయ్యాలి. వీటితో పైహక్కును కల్పించాలి.

(ఈ) 8 గంటలు రోజుపని, 40 గంటలు పని వారానికి ఏర్పరచాలి. జీవనానికి తగిన జీతం. నిరుద్యోగం రాకుండా రక్షణ, జబ్బుపడినా, ముసలితనం వచ్చినా రక్షణ: అందరు కార్మికులకు చక్కని గృహవసతి: మిగతా సామాజిక రక్షణలు, అందరికీ వుచితంగా నిర్బంధ విద్య. స్త్రీలకు సమాన హక్కులు.

(ఉ) సభా స్వాతంత్ర్యం, సమ్మె హక్కు, వాక్ పత్రికాస్వాతంత్ర్యం.

(ఊ) మైనారిటీల హక్కులు: నూతన రాష్ట్రాలలో చెదరివున్న అల్ప సంఖ్యాకులందరికి వారి భాష, విద్య, సంస్కృతి హక్కులకు హామీ యివ్వాలి. ఇందుకుతగిన నిబంధనలను ప్రభుత్వంనిర్మించాలి ఆనిబంధనలను ధిక్కరించడం శిక్షాపాత్రంగా చెయ్యాలి.

— అన్నిమతాలకు, అన్ని రాజకీయ పార్టీలకు తగిన ప్రాతినిధ్యం ప్రభుత్వ సంస్థలలో, శాసనసభలలో కల్పించడంకోసం, అన్ని ఎన్నికలూ, వయోజనవోటింగు, సంయుక్తనియోజకవర్గాలు, దామాషా ప్రాతినిధ్యం వీనిమీద జరగాలి.

—ఆర్థిక సౌభాగ్యం, విద్య, సభ్యత, వీనిలో వెనకబడిన జాతులు, కొండజాతులు త్వరగా అభివృద్ధి చేయబడాలి: మిగతా ప్రజలతో సమాన స్థాయికి వారినితేవాలి. ఈకర్తవ్యం అన్నిప్రభుత్వాలకు, అన్నిశాసనసభలకు ప్రధాన విధిగా వుండాలి.

9\. మత, కులవివక్షత లేకుండా భారత ప్రజలందరు, పైకర్తవ్య నిర్వహణలో తాత్కాలిక స్వతంత్ర ప్రభుత్వాన్ని బలపరచాలనీ, ఆ ప్రభుత్వ స్వతంత్రప్రకటనకు వ్యతిరేకంగా సామ్రాజ్యవాదులుచేసే ప్రజాభీష్ట విరుద్ధచర్యలన్నింటినీ సంయుక్తంగా ఎదుర్కోవాలనీ, ప్రజాపరిషత్తు ప్రజలందరికీ విజ్ఞప్తి చేస్తోంది.

నైజాం మిలిటరీదాడికి తెలంగాణా

బురఖా కాంగ్రెసువాదుల మద్దతు

ఈ మధ్యనే కొందరు తెలంగాణా స్టేటు కాంగ్రెసు మితవాదులు నల్లగొండజిల్లా మిలిటరీ కాల్పులను గూర్చి పత్రికలలో కొన్ని ప్రకటనలు చేశారు. వాటిలో మిలిటరీదాడుల ద్వారా నైజాం నిరంకుశ ప్రభుత్వం ప్రజల మీద సాగిస్తున్న మారణ హోమాన్ని తీవ్రంగా ఖండించి ప్రజలయెడ తమ కినిస ధర్మాన్ని నెరవేర్చుకున్నారా? లేదు. పైగా యీ దారుణ పరిస్థితులకు, ప్రభుత్వం, దాని యేజంట్లయిన జమీందారులు, దేశముఖులు, జాగీర్దారులు కారకులు కాదనీ, కమ్యూనిస్టులూ, వీరి "అబద్ధాల మాటలూ" నమ్మి మోసపోయిన ప్రజలే అసలు కారకులనీ, అందుచేత ప్రభుత్వం కాల్పులు కాల్చుట అసమంజసం కాదని వీరి ప్రకటనల, వ్రాతల సారాంశమని వీటిని చదివినవారికందరికీ స్ఫురిస్తుంది.

ప్రజలకు కమ్యూనిస్టులు ఎన్నో అసత్య విషయాలు చెప్పి ప్రజలను రెచ్చగొట్టారనీ, ప్రజలు వీరి మాటలు విశ్వసించి సైనికుల ఆక్రమిత ప్రాంతాలలో చొచ్చుకొనిపోయి అమయులు గోల్పోయారనీ, ప్రజలు చాల దౌర్జన్యాలు చేశారు, చేస్తున్నారని వీరి ప్రచారం. సిపాయీలు పేల్చే తుపాకులలో గుండ్లుండవనీ, అపాయం కలుగదనీ ప్రజలు కమ్యూనిస్టులకు చెప్పారట. ఇట్టివే అనేకం. ఏ మాత్రం ఇంగితజ్ఞానం ఉన్నవారు గూడా ఈ మాటలను నమ్మరు.

ప్రజలే కయ్యానికి కాలుదువ్వారని సైన్యం మీద ప్రజలే ముందుగా దాడి చేశారనీ, ప్రభుత్వం అకారణంగా దాడులు, కాల్పులు, చేయలేదనీ వీరి వ్రాతలను చదివిన వారికి స్ఫురిస్తుంది. 'శాంతిభద్రతలను రక్షించడానికే ప్రభుత్వం ఈచర్యలను తీసుకుంటున్నదనే భావం కలుగజేస్తున్నారు. వీరి వ్రాతలలో, స్టేటుమెంట్లలో జమీందారుల దౌర్జన్యాలను గూర్చి ఒక్క వాక్యంగూడా లేదు. అసలు తప్పు ప్రజలదే కాని ప్రభుత్వానిది కాదని తెల్పివేసి ప్రభుత్వ చర్యలను బలపరుస్తున్నారు. ప్రభుత్వం చెప్పుతున్న మాటలనే వీరు చెప్పుచున్నారు. వీరి తోడ్పాటు లభించినందుకు ప్రభుత్వం చాల సంతసిస్తున్నది. దేశభక్తులు చేయవలసిన పని ఇదేనా? వాస్తవమేమిటి?

దుర్భర పరిస్థితులనుంచి బయటపడుటకే ప్రజలపోరాటాలు

ప్రజలు జాగీర్దారీ, జమీందారీ దోపిడీ విధానంకింద నలిగిపోతున్నారు. లంచగొండులగు నిరంకుశ ప్రభుత్వోద్యోగులవలన ప్రజల జీవితం మరీ దుర్భరమైంది. జమీందారులు, దేశముఖులు రైతుల భూములను అక్రమంగా ఆక్రమించారు. తత్ఫలితంగా అనేక రైతులు కౌలుదార్లుగానో, వ్యవసాయకూలీలుగానో మారిపోయారు. చట్టం ప్రకారం సామాన్య హక్కులుగూడ ప్రజలకు అందరాలేకుండా పోయినవి. ప్రజలు ఎన్నోదరఖాస్తులు పెట్టుకున్నారు. అయినా ప్రభుత్వం వీరి మొరలు వినకపోవడమేగాక జమీందారులను, జాగీర్దారులనే బలపర్చింది. ప్రతిసారి ప్రజలనే అణచివేసింది.

ప్రజలు ఈదోపిడీ బాధలనుండి విముక్తి పొందడానికి ఆంధ్రమహాసభలో చేరి తమ హక్కుల రక్షణకు పూనుకున్నారు ఆంధ్ర మహాసభ కార్యకర్తలు. కమ్యూనిస్టులు చేసినదల్లా ప్రజలను ఐక్యంచేసి వారిన్యాయ సమ్మతమైన హక్కులను అనుభవించునట్లు చేయుటయే. ఐక్యతాశక్తిద్వారా జమీందారులు ప్రభుత్వోద్యోగులు చేసే దోపిడీని, అక్రమాలను, దౌర్జన్యాలను అరికట్టడమే. స్వామీ రామానందతీర్థగారే ఈ విషయాన్ని అంగీకరించారు. ప్రజలు, ఆంధ్రమహాసభ జమీందారులు, అధికారులు చేస్తున్న దౌర్జన్యాలను దోపిడీనిగూర్చి అనేక పర్యాయాలు ప్రభుత్వ దృష్టికి తెచ్చినప్పటికీ ప్రభుత్వం ప్రజలకను కూలమైన చర్యయేదీ తీసుకోలేదు.

ప్రజల ప్రతిఘటనాశక్తిని అణచివేయుటకై ప్రభుత్వ నిర్బంధాలు

ఈ ప్రభుత్వానికి షనామలు, ప్రజలను దోచుకుంటున్న యీ జమీందారులు, జాగీర్దారులు, లంచగొండి ఉద్యోగులే! కాబట్టి తన యీ షనాసులనే బలపరచసాగింది. ఈ షనాదులే విచ్ఛిన్నమై పోతే తన నిరంకుశ జాగీర్దారీ ప్రభుత్వమే నిలువదని వారికి తెలుసు. అందుచే ఆంధ్రమహాసభ ఉద్యమాన్ని ఎట్లాగయినా అణచివేయాలని పన్నాగాలు పన్నింది.

ప్రభుత్వం ఆంధ్రమహాసభను, కమ్యూనిస్టుపార్టీని చైతన్యవంతులైన ప్రజలను అణచివేయడానికి జమీందారులను ఉసిగొల్పింది. వారికి అన్నివిధాల ప్రోత్సాహమిచ్చింది. జమీందార్లు, వారి గూండాలు ప్రజలమీదబడి ఘోర హింసలను పెట్టసాగారు.

జమీందారులకు సహాయంగా కల్పితకేసులు పెట్టి ప్రజలను, ఆంధ్రమహాసభ, కమ్యూనిస్టు పార్టీకార్యకర్తలను ఎందరినో జైళ్ళకో బెట్టించారు. పోలీసు కస్టడీలో ఉన్నప్పుడు పోలీసులు, జమీందారీగూండాలు చిత్రహింసలు పెట్టారు. ఒక్క నల్లగొండజిల్లాలోనే 200 కు పైగా కేసులు పెట్టబడినవి.

ఇంకొకమెట్టు ముందుకుబోయి జమీందారీ గూండాలచేత ఏదోఒక గ్రామంలో ప్రజలపై తుపాకులు కాల్పించి అమాయకులను చంపుకుని పాటపెట్టుకొన్నారు. ప్రభుత్వము ఈ హంతకులను పట్టుకొని శిక్షించలేదు సరిగదా, ప్రజల, కార్యకర్తల మీదనే కేసులు బెట్టించింది. అయినా ప్రజలు చలించలేదు. ధైర్యంగా ఆత్మరక్షణకు పూనుకున్నారు.

ప్రజలను, ప్రజా ఉద్యమాలను అణచడానికి ప్రభుత్వం మొదట్లో తాను నేరుగాగాక దేశంలో ఉండే ప్రజా శత్రువుల ద్వారాను, గూండాల ద్వారాను, అభివృద్ధి నిరోధక శక్తుల ద్వారాను అణచివేయించ ప్రయత్నం చేస్తుందనేది సాధారణంగా అందరు ఎరిగినదే. అది సాధ్యంగానప్పుడు తాను ప్రత్యక్షంగా అణచడానికి పూనుకుంటుంది.

మతకలహాలుగా మార్చటానికి కుట్ర

నైజాం ప్రభుత్వం గూడ ఈ పద్ధతినే అవలంబిస్తున్నది. ఇక్కడి ప్రజాతంత్రఉద్యమాలను అణచివేయడానికి హిందూ ముస్లిం తగవులను కల్పించి మజ్లిసుఇత్తెహాదుల్‌ముస్లిమీన్ సంఘము (జాగీర్దారుల నాయకత్వాన గలది)ద్వారా ముస్లిములను ఉసిగొల్పుతున్నదనేది అందరెరిగినదే.

స్టేటు కాంగ్రెసుకు వ్యతిరేకంగా ముస్లింలను రెచ్చగొట్టి ముస్లిం గూండాలను ఉసిగొల్పుతున్నారు. తత్ఫలితంగా వరంగల్‌లో మొగలయ్యగారు, నాందేడులో బద్రేగారు, నిజామాబాదులో నర్సింహారెడ్డిగారు, అనే స్టేటు కాంగ్రెసు కార్యకర్తలను ముస్లిం గూండాలు చంపారు. ఇంకా అనేక ప్రదేశాలలో ముస్లింగూండాలు చెలరేగి స్టేటు కాంగ్రెసు కార్యక్రమము సాగడమే అసాధ్యమయ్యే పరిస్థితులు కలుగజేస్తున్నారు. వెనుక నుండి ప్రభుత్వం 144 (145) సెక్షన్ ప్రయోగించడం, మొ॥ ఇతర నిర్బంధాలు ప్రారంభిస్తున్నది. ఇటీవలనే వరంగల్ జిల్లానుండి ముగ్గురు కాంగ్రెసు కార్యకర్తలను బయటికి పంపించివేసింది. కమ్యూనిస్టుపార్టీ, ఆంధ్ర మహాసభ హిందూ-ముస్లిం కార్మికులలోను, రైతులలోను పనిచేస్తున్నవి కాబట్టి ముస్లిం గూండాలను వీరిమీదికి ఉసిగొల్పడం అసాధ్యమైపోయింది. అందుచేత ఆంధ్ర మహాసభ, కమ్యూనిస్టుపార్టీలను జమీందార్ల, గుండాల ద్వారా అణచాలని చూసింది. కాని యీ ప్రయత్నం ఫలించలేదు.

రిజర్వుపోలీసులనూ మిలిటరీని ఉసికొల్పింది

ప్రజలు గట్టిగానిలిచి తమ హక్కులను రక్షించుకున్నారు. ఇక ప్రభుత్వం నగ్నంగా బయటికిరాక తప్పలేదు. జమీందారులకు సహాయంగా రిజర్వు పోలీసును దింపింది. రిజర్వుపోలీసు అనేక దురంతాలను చేసింది. బాలెం గ్రామంలో పోలీసులు కాల్చిఇద్దరిని చంపారు. కాని ప్రజలు వెరికితెందలేదు. ప్రభుత్వ తొత్తులైన జమీందారులకు లొంగిపోలేదు. ఆంధ్రమహాసభను విడువలేదు. ఇంకా తమ సంఘాలను గట్టిపరచుకున్నారు. ప్రజలు శాంతియుతంగా దోపిడీలేని స్వతంత్ర జీవనం గడపదలచుకున్నారు. కాని ప్రభుత్వానికి కావలసింది కాదు ప్రభుత్వతొత్తులైన జమీందారుల,దేశముఖ, పటువారీల గుప్పిటిలో ఉండి దాసానుదాసులుగా ప్రజలుపడియుండటం ప్రభుత్వానికి కావలసింది. తద్వారానే తన నిరంకుశప్రభుత్వం నిలవగలుగుతుంది. అందుచేత మిలటరీని పంపి పెద్దయెత్తున గ్రామాలమీద వరుసగా దాడులు చేయించి నానాభీభత్సం చేయిస్తున్నది. దీని ద్వారా ప్రజాఉద్యమాన్ని, స్వాతంత్ర్యం సాధించాలనే రాజకీయ చైతన్యం పొందిన ప్రజలను అణచివేయాలనిచూస్తున్నది. అకారణంగా గ్రామాలమీద రాత్రిళ్ళు బందిపోటు దొంగలులాగా మిలిటరీ దాడులు చేస్తున్నది. నిరాయుధులైన ప్రజలను కాల్చిచంపుతున్నది. కాల్పులుసాగించిన మీదటనే ప్రజలు ఆవేశపూరితులై ఆత్మరక్షణకు పూనుకున్నారు.

స్టేటుకాంగ్రెసు అధ్యక్షులు స్వామిరామానందతీర్థగారు మిలిటరీ దాడులు, కాల్పులు జరిగిన ప్రాంతాలను స్వయంగా చూచివచ్చి చేసిన ప్రకటనలోని ఈ క్రింది భాగాలు పై అంశాలను ఋజువుచేస్తున్నవి.

"ప్రభుత్వాధికారులు, వీరితొత్తులైనగ్రామ దోపిడీవారులు ప్రజలను వరుసగా లూటీ చేశారు. అనేకహింసలు పెట్టారు. గ్రామస్తుల కిస్తీలు పోగొట్టడానికి చట్టసమ్మత అవకాశాలు బొత్తిగా వ్యర్థమైపోయినవి. అధికారులే లెవీ నియమాలనుఉల్లంఘించి ప్రజలకు తినడానికిధాన్యంలేకుండా లాగివేసినాడ్రారు. ఈపరిస్థితులే నేడు ప్రజలను ఎదురుతిరిగి నిలచేటట్లు చేసినవి. ప్రభుత్వం పరిస్థితులను సరిచేయడానికి మారుగా ప్రజలను అణచివేస్తున్నది."

జమీందార్లకూ, దేశముఖులకూ మితవాదనాయకుల ప్రోత్సాహం

స్వామీరామానందతీర్థగారి వాక్యాల సదహరించినతర్వాత తెలంగానా స్టేటుకాంగ్రెసు మితవాదులు చెప్పేదాన్ని గూర్చి ఎక్కువ వ్యాఖ్యానం అనవసరం. వీరు మొదటినుండి జమీందారులను ప్రోత్సహిస్తున్నారు. నల్లగొండజిల్లా ప్రజలను, అక్కడి ఉద్యమాన్ని అణచివేయాలని ఈ మితవాద నాయకులు బహిరంగంగా పత్రికలలో వ్రాశారు. ఉపన్యాసా లిచ్చారు. నల్లగొండజిల్లాలోని వీరి సహచరులు జమీందారుల నాయకత్వం వహించారు. సూర్యాపేట తాలూకా స్టేటు కాంగ్రెసు కమిటీలో ముఖ్యులైన వేములపల్లి వెంకటకిష్టయ్య మిలిటరీ కాల్పుల సమయంలో అధికారులతోకూడ కలిసివెళ్ళి ప్రజలు ఆంధ్రమహాసభతో సంబంధం వదులుకోవాలని, లేకుంటే, మిలిటరీ కాల్చి చంపుతుందనీ ప్రజలకు హితబోధ చేశారు. ఇతను జమీందారుల ఏజెంటని ప్రజలకు తెలుసు. ఇక్కడి జమీందారులు స్టేట్ కాంగ్రెసు బురఖా ధరించుకున్నారు.

స్టేటు కాంగ్రెస్సు,ఆంధ్ర ప్రాంతీయ సంఘం ఇట్టివారి చేతులలో ఉన్నవి. నిజమైన జాతీయవాదులు దానిలో చాల తక్కువ. ఈ మధ్య స్టేటు కాంగ్రెసు పోరాటం ఆరంభించ తీర్మానించినప్పుడు పోరాట పరిస్థితులు లేవని వీరంతా తీవ్రంగా వ్యతిరేకించారు. పోరాట తీర్మానాన్ని ఉపసంహరించుకునేలాగు ఒత్తిడి తెచ్చారు. వారిలోముఖ్యులు స్వయంగా జమీందారులు దేశముఖులుప్రభుత్వంతో ఏకో రాజీ చేసుకొని, కొద్ది నామమాత్రపు మార్పులతో అధ్వాన్నమైన రాజ్యాంగ సంస్కరణలలో పాల్గొనాలని ప్రభుత్వంతో రాజీబేరాలు సాగించారు. తీవ్రవాదుల వ్యతిరేకతవలన ఇది సాధ్యంకాలేదు. మితవాదులు, జమీందార్లు వారి ఏజంట్లచే నిండిన తెలంగాణా స్టేటు కాంగ్రెసు కమిటీ ఉద్యమానికి ఒక గుదిబంతగా వుందని అందరూ అంగీకరించిందే.

ప్రభుత్వం మిలిటరీని పంపించి కాల్పులు చేయిస్తుంటే, వీరు సంతోషించారు. అందుచేత 8 వారాలవరకు పల్లెత్తుమాట అనలేదు. స్టేటు కాంగ్రెసు అధ్యక్షుడు ఆ ప్రాంతాలకు వెళ్ళివచ్చి ప్రభుత్వ చర్యలను తీవ్రంగా ఖండించేటప్పటికి వీరిలో అలజడి బయల్దేరింది. వెంటనే యీ మితవాదులు కమ్యూనిస్టులు, ప్రజలు దౌర్జన్యాలు చేస్తున్నారనీ, అంతా వీరిదే తప్పనీ హైదరాబాదు పత్రికలలో వ్రాయటం మొదలుపెట్టారు. సూర్యాపేట తాలూకా స్టేటుకాంగ్రెసుకమిటీవారు స్వామిజీ మీద అవిశ్వాసాన్ని వెల్లడించేవరకు పోయారు. వెంటనే యీ మితవాద నాయకులు, (జమీందారులు) కొండా వెంకటరంగారెడ్డి, మందుముల నర్సింగరావు మున్నగువారు గూడ ఆ ప్రాంతాలలో జమీందారులతో మంతనాలాడారు. కమ్యూనిస్టులు, ప్రజలే దౌర్జన్యాలుచేస్తున్నారని స్టేటుకాంగ్రెసుకు రిపోర్టు సమర్పించుకున్నారు. అన్నిచోట్ల ఈ విషప్రచారం సాగిస్తున్నారు. కోదాటి నారాయణరావుగారు కూడా కొన్ని గ్రామాలు తిరిగి ఈమధ్యనే బ్రిటిషాంధ్ర పత్రికలకొక ప్రకటన యిచ్చారు. వీరు జమీందారుల, వారి యేజంట్ల ఇండ్లలోనే దిగారు. ప్రజలను కలుసుకోనేలేదు.

మహారాష్ట్ర ప్రాంతీయ స్టేట్ కాంగ్రెసు కమిటీ ప్రభుత్వ కాల్పులను మిలిటరీదాడిని నిరసిస్తూ ప్రజలకు సానుభూతి తెల్పుతూ తీర్మానించింది. కాని తెలంగాణా కమిటీ అట్టిదేదీ చేయకపోగా దాని నాయకులు ప్రజలదే తప్పని తేలుస్తున్నారు.

ప్రజల ధైర్య సాహసాలను మెచ్చుకొనడానికి బదులు రకరకాల వింతవాదనలతో తిరస్కారం తెలుపుతున్నారు. ప్రజలపై వచ్చిఅబద్ధాలు కల్పించి నీచమైన ఆరోపణలు చేస్తున్నారు. ఈ విధంగా నిరంకుశ నైజాం జాగీర్దారీ పరిపాలన స్థిరంగా నిలచియుండడానికి తోడ్పడుతున్నారు. తెలంగాణాఆంధ్రులకు తీరని ద్రోహం చేస్తున్నారు.

—మా హైద్రాబాద్ రాజకీయ విలేఖరి.

సహకార క్రయ విక్రయ సంఘాల స్కీము

ప్రభుత్వ గ్యారంటీ లేనిదే, ప్రజల భయాలు తీరవు

ధాన్యం, బట్టలు, ఎరువులు, వ్యవసాయ పనిముట్లు, తదితర జీవితావసర వస్తువులు అన్నీ సహకార సంస్థలద్వారా ప్రజల కందించాలనీ, అవిధంగా వీటిపై దొంగవ్యాపారుల కంట్రోలు తొలగించాలనీ ఆంధ్రరాష్ట్ర రైతుసంఘం చాలాకాలంనుండీ ఆందోళన చేస్తూవున్నది. ఇంతకాలానికి మద్రాసు మంత్రివర్గం ఇట్టి పద్ధతికి పూనుకొని ఉత్పత్తిదారుల, కొనుగోలుదారుల సహకార క్రయవిక్రయసంఘాలను ఏర్పర్చ పూనుకొన్నందుకు సంతోషిస్తున్నాము.

కృష్ణా, గోదావరీ జిల్లా ప్రాంతాలలో షేరు 1కి రు. 25 ల చొప్పున 10 కోట్ల రూపాయీల మూలధనంతో ఇట్టి సహకార సంఘాలు ఏర్పాటు గావింపబడుననీ, మూలధనం పోగుచేసి సంఘాల నిర్మాణంకూడా డిసెంబరు నెలాఖరులోగానే పూర్తి గావించాలనీ ప్రభుత్వం నిశ్చయించినట్లుతెలుస్తున్నది. ఈ సంఘాలు ఎంత త్వరగా ఏర్పడి పని ప్రారంభిస్తే అంత మంచిదే. గాని "అతి సర్వత్ర వర్జయేత్" అన్న సూక్తినికూడా మరువరాదని హెచ్చరిస్తున్నాము. ప్రభుత్వ స్కీమునుగాని, వాటాదార్లను చేర్పించే పద్ధతినిగాని చూస్తే. స్కీమునుగూర్చి చాలా అనుమానాలు, భయాలు ప్రజలలో కల్గుచున్నవి.

స్కీములో ప్రభుత్వగ్యారంటీలేదు

స్కీములో ప్రధానమైన లోపాలు రెండు మూడు వున్నవి మొదటిది ఈసంఘాల పెట్టుబడికి, నిర్వహణకుగ్యారంటీ ఏమిటనిప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఏపైనా పెద్దమొత్తంతో పరిశ్రమనుగాని, సంస్థనుగానినిర్వహించబూనుకున్నప్పుడు. ప్రభుత్వంకూడా వాటిల్లో షేర్లు కొనటంద్వారాగాని,సెక్యూరిటీవుండటంద్వారాగాని ఆసంస్థలకు నిలకడను కల్గిస్తుంది, ప్రజలకు కూడా ఆ సంస్థలపై విశ్వాసం ఏర్పడుతుంది. సంస్థల కార్యకలాపంకూడా చురుకుగా జయప్రదంగా సాగుతుంది. ఉదాహరణకు కో ఆపరేటివు స్టోర్సుకు ప్రభుత్వహామీ లేకపోవటంవల్ల, వాటివ్యాపారాన్ని వృద్ధిపొందిస్తానికి వీలుండటంలేదు. పెట్టుబడిని వ్యక్తుంద్వారానేగాని, బ్యాంకులద్వారా వృద్ధిచేసుకుంటానికి వీలుండటంలేదు. అంతేగాక, ప్రభుత్వ హామీలేని సంస్థలను ఆర్ఫన్ నాట్ కంపెనీలక్రింద జమకట్టటము కూడా ప్రజలలో అలవాటు. కాబట్టి 10కోట్ల రూపాయలకు సంబంధించిన ఈస్కీములో ప్రభుత్వ గ్యారంటీ లేదంటే, ప్రజలకు ఆ సంస్థలపై విశ్వాసం కల్గకపోవటంలో ఆశ్చర్యమేమీలేదు.

ముక్కామల నాగభూషణం
నండూరి ప్రసాదరావు
ఆంధ్రరాష్ట్రరైతుసంఘఅధ్యక్ష, కార్యదర్శులు

ఖాదీస్కీముతో ముడిపెట్టడంవల్ల ప్రజల్లో అనుమానాలు

రెండవలోపం, ఈ స్కీముకూ ఖాదీ స్కీముకూ ముడిపెట్టడం. ఖాదీస్కీమును గూర్చి ప్రజలలో అనేకసందేహాలు వ్యాపించి వున్నవి. 7 ఫిర్కాలలో ఖాదీస్కీమును ప్రథమంగాపెట్టి గజం 1కి 0-4-0 సబ్సిడీ యిస్తుంటే, రాష్ట్రమంతటా ఖాదీస్కీమును పెడితే సబ్సిడీ ఇవ్వటం కష్టం. ఇవ్వమని కూడా ప్రభుత్వం చెప్పింది. గజం 1కి 0-4-0 చొప్పున సబ్సిడీ యిస్తేనేగాని కొనసాగని ఖాదీస్కీముకు సహకారసంఘాలకు ముడిపెట్టడమంటే ఎంత ప్రమాదం కల్గుతుందోనని భయాలు కల్గుచున్నవి. ఖాదీ స్కీముమీద వచ్చేనష్టాన్ని అంతటినీ సహకార సంఘాలు భరించవలసి యుంటుంది. అంటే, కొన్ని సంఘాలు దివాలాతీయటం కూడా జరగవచ్చు.

ధరల కంట్రోలులేనిదే, స్కీము జయప్రదం కాదు

మూడవది, ధరల కంట్రోలులేనిదే జీవితావసర వస్తువుల నన్నిటిని సహకార సంఘాలద్వారా పంచటం కష్టం. స్వేచ్ఛా వాణిజ్యాన్ని సాగించటమంటే సంఘాలు ఒక్కొక్కప్పుడు నష్టాన్ని భరించవలసి వుంటుంది. ఈనాడు అనేక వస్తువులపై కంట్రోలులేదు. నేతగుడ్డలు, చాలానూనెలు, కందులు, పెసలు, మినుములు మున్నగు అపరాలు, మిర్చి, చింతపండు మున్నగువాటి ధరలకు కంట్రోలులేదు. వాటినికూడా సహకార సంఘాలద్వారాకొని, అమ్మించటం చాలా అవసరం. అట్లా చేయాలంటే, వాటి ధరలనూ కంట్రోలుచేయాలి. వాటి నష్టాలని సంఘాలకు గ్యారంటీ చేయాలి.

ప్రజాతంత్ర పద్ధతులపై స్కీము నడుపబడుతుందని హామీలేదు

ఇవిగాక సంఘనిర్మాణంలో ఇంకా చాలా లోపాలున్నవి. ఈస్కీము చాలా ప్రధానమైనది. మన ఆర్థిక వ్యవస్థలోనే పెద్దమార్పును తెచ్చేది. పెట్టుబడికూడా సామాన్యంకాదు. 10 కోట్లరూపాయీలు. కాబట్టి ఈస్కీముకు సాధ్యమైనంత ఎక్కువ ప్రజా సహకారాన్ని సంపాదించాలి, ప్రజలు ఈ సంఘంపై పూర్తి విశ్వాసముకల్గి, ఎక్కువమంది వాటాదార్లుగా చేరునట్లు చూడాలి. కాని ఇంతవరకూ ఈస్కీమునుగూర్చి ప్రజలకు పూర్తి వివరాలు తెలియజేయనేలేదు. సంఘాలు ప్రజాతంత్ర పద్ధతులపై స్థాపించబడునన్న హామీలేదు, ఉద్యోగులుమాత్రం నిరంకుశంగా. నిర్బంధంగా వాటాలు కొనిపిస్తున్నారు. వీరు సహకార సంఘంలో షేర్లు వేయిస్తున్నారు. యుద్ధబాండ్లు కొనిపిస్తున్నారు అని ప్రజలు సందేహపడునంత అడ్డగోలుగా ఉద్యోగులు వ్యవహరిస్తున్నారు.

ఇంతేగాక, సంఘాల కేంద్రాలు కేటాయించిన మొత్తాలుచూస్తే. ప్రభుత్వం చాల తొందరపాటుతో ఈ స్కీమును అమలు బరుస్తూన్నట్లు ప్రజలు భావిస్తున్నారు. తణుకులో రెండు సంఘాలను పెట్టటం, ఆ గ్రామంలోగల రెండు మిల్లులవారు వాటిని స్వాధీనపర్చుకుంటానికి అవకాశాన్ని కల్గచేయడానికేనని ప్రజలు భావిస్తున్నారు. చేబ్రోలు గ్రామాలైన దిబ్బనపూడి, పెర్లిపాడు కంద్రిక మున్నగువాటికి గూడా గ్రామాధికారు. 22000/ల చొప్పున షేర్లు కేటాయించబడ్డవంటే, అధికారులెంత గుడ్డిగా పోతున్నారో తెలుస్తుంది.

మరిన్ని, షేరు 1కి రు. 25 నిర్ణయించటంవల్ల పేదరైతులూ, కూలీలు వాటాదార్లుగా చేరలేకపోతున్నారు. వీరికే అసలు ఈ సంఘాలు ఎక్కువగా వుపయోగపడవలసినవి. వీరే ఎక్కువ వాటాదార్లుగా వుండవలసినది. కాని, ఇంత ఎక్కువ మొత్తమును షేరుధనంగా పెట్టుటవల్ల వీరు వాటాదార్లుగా చేరలేకపోవుచున్నారు.

(మిగతా 6 వ పేజీలో)



పశ్చిమ గోదావరిజిల్లా, తణుకు తాలూకా ఏలేటిపాడుగ్రామంలో 28-11-46 న అయితంపూడి, రాపాక, ఓగిడి, గ్రామాల రైతులు, కూలీలు 250 మంది 22 యెకరాల భూమిలో కోతలుకోసి, వచ్చిన సొమ్ము కమ్యూనిస్టుపార్టీ నిధికి ఇచ్చారు.

ప్రభుత్వ స్కీమువల్ల పార్టీ కక్షలు పెరుగవచ్చు

(5 వ పేజీ తరువాయి)

పైగా ఈ సంఘాలలో వాటాదార్లను చేర్పించటం, సంఘాలను నిర్మించటం కూడా డిసెంబరులోనే పూర్తిగావాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలుస్తున్నది. ఎవ్వరి చేతుల లోను డబ్బువుండే రోజులుకావివి. సంక్రాంతికి గాని పంటలు రైతుల యిండ్లకు చేరుకోవు. ఈలోగా పాడిక, పరకవున్నా కోతలకు ఖర్చు అయిపోవునేగాని, షేర్లు కొనుటకు చాలవు. ఇక కూలీలు గత 3, 4 నెలలుగా ఏ పనులూలేక, ఏ భూస్వామివద్దనో నాముకు గింజలు తెచ్చుకొని తింటూ కాలక్షేపం చేస్తూ వుంటారు. కోతలై తేనేగాని 4 రూపాయలు వాళ్ళ చేతులలోనికి రావు. కాబట్టి డిసెంబరు నెలాఖరులోగానే వాటాదార్లను చేర్పించి సంఘాలను స్థాపించాలంటే ఒక్క పేద రైతుగాని, వ్యవసాయ కూలిగాని వాటాదారుగా చేరలేరు.

బట్టల అమ్మకపు విధానంలో లోపం

బట్టల అమ్మకం విషయంలో ప్రభుత్వ దృక్పథం కూడా చాల లోపభూయిష్టంగా వున్నది. బట్టల మిల్లులకూ, చిల్లరవ్యాపారికి మధ్య హోల్‌సేలరూ, సబ్ హోల్‌సేలరూ, కన్సైనీ, కోటా హోల్డరూ — ఈవిధంగా అనేకమంది దళారులున్నారు. దొంగవ్యాపారమంతా మిల్లుగేట్లవద్దనే జరుగుతోంది. లోటస్ మిల్లు పై తేను దీనినే రుజువుచేస్తోంది. కాని ప్రభుత్వ స్కీములో ఈ దొంగవ్యాపారు లందరూ ఇట్లాగే వుంటారు. వారి దొంగ వ్యాపార పద్ధతులన్నీ అట్లాగే వుంటాయి. సహకార సంఘాలు చేయగల్గిన పని అంతా తమ వద్దకు వచ్చిన గుడ్డను మాత్రం పంచి పెట్టించడమే. పైగా, చిల్లర వ్యాపారాలను తీసివేయటం ద్వారా, వారి వృత్తికి భంగం కల్గటం మినహా, దొంగవ్యాపారం అరికట్టటం జరగదు.

ప్రజల్లో భయాలు

ఈ పై లోపాలన్నింటివల్లనూ, ఉద్యోగులు చేసే హంగామా వల్లను రైతులలోనూ కూలీలలోనూ అనేక సందేహాలు వ్యాపించినవి. ఉద్యోగులు వచ్చి వత్తిడి చేసినప్పుడు మొక్కు తీర్చుకుంటానికి అన్నట్లుగా 'మా వార్ బాండ్లు పేరుధనం క్రింద జమకట్టుకొంది (బాకీ రావలసిన బోనస్‌ను షేర్లు క్రింద జమకట్టుకొంది' అంటున్నారు. అంటే వార్‌బాండ్లు రావు; వాయిదా దాటినందున బోనసురాదు' ఈ షేరుధనమూరాదు అందుచే వాటికి వీటికి ముడిపెడుదామని చూస్తున్నారన్నమాట. పైగా, తమవద్ద డబ్బులేనప్పుడే వాటాలను కొని పించటం, షేరుధనాన్ని హెచ్చుగా పెట్టడం వల్లకూడా ఈ సహకార సంఘాలను షాహుకార్లూ, మిల్లుయజమానులూ, భూస్వాములూ మున్నగువారికి కట్టబెట్టబడునని భయపడుచున్నారు.

మలబారు అనుభవాన్ని తీసుకుంటే ఈ భయాలకు కారణం లేకపోలేదని తెలుస్తోంది. అక్కడ సంఘాలు ఎక్కువభాగం జమీందార్లు హోలుసేల్ వ్యాపారుల చేతులలోనికి పోయినవి. హెచ్చుమంది డైరెక్టర్లుగా వారేవచ్చారు. అమ్మకంధరలుకూడా ఇంతవరకూ తగ్గలేదు. అందుచేత ఈ సంఘాలు ప్రజాతంత్ర పద్ధతులపై ఎన్నుకోబడునా లేదాయని కూడా చాలా సందేహిస్తున్నారు.

పార్టీ కక్షలు పెరుగవచ్చు

గ్రామ కమిటీల నిర్మాణంలో జరిగిన రసాభాస ఇంకా ప్రజల అనుభవంలోనే వుంది. వాటి నిర్మాణంలో ప్రజాతంత్ర పద్ధతులు, నియమాలు గాలికెగిరిపోయినవి. అధికారంలోవున్న కాంగ్రెసువారు ల యిష్టం ప్రకారం అవి ఏర్పాటుగాబడినవి ఎక్కడైనా ఏ అధికారియైనా కాస్త స్వతంత్రంగా వ్యవహరిస్తే మంత్రులు పార్లమెంటరీ కార్యదర్శులు స్వయంగా జోక్యం కలిగించుకొని, కమిటీలనుతారుమారు చేశారు. రైతుసంఘాలు, వ్యవసాయకూలీసంఘాలు, ఇతర పార్టీల ప్రతినిధులెవ్వరైనా వుంటే లీని పారవేసి. జమీందార్లకు, దొంగవ్యాపారులకు కూడా స్థానం కల్పించబడింది. ఇంత నిరంకుశంగా ఏర్పాటు గాబడినందున, వీటిలో దూరిన కొందరు పెద్దమనుష్యులే దొంగ వ్యాపారాన్ని సాగిస్తున్నారు. ఇదంతా ప్రజలు గమనిస్తూనే వున్నారు. కాబట్టి ఇప్పుడు సహకారసంఘాల నిర్మాణంలోగూడా జరిగే తొందరపాటు, స్కీములోగల లోపాలు చూస్తే ఇవి ప్రజాతంత్ర పద్ధతుల ప్రకారం ఏర్పాటు కాబడుననే విశ్వాసం ప్రజలలో కల్గటంలేదు. తిరిగి ఈ సంఘాలుకూడా పార్టీకక్షలకు లోనై యుద్ధ రంగాలుగా మారుననే భయం కల్గుచున్నది.

అందుచే ప్రభుత్వం ప్రజలలోగల ఈ అనుమానాలను భయాలను పోగొట్టుటకు పూనుకోవాలి. అందుకై ఈ స్కీములోనే కొన్ని ప్రధానమైన మార్పులు గావించాలి. పైన చూపిన లోపాలను సరిదిద్దుటకై ఈ క్రింది మార్పులు చేయాలని సూచిస్తున్నాము.

స్కీములో జరుగవలసిన మార్పులు

(1) ఈ స్కీముయొక్క పూర్తి వివరములను విరివిగా ప్రకటించాలి. అసంపూర్ణమైన ఒకటి, రెండు పత్రికా ప్రకటనలు చాలవు.

(2) వాటా ధనమును రు 5 లకు తగ్గించి పేదరైతులు, కూలీలు ఎక్కువమంది వాటాదార్లుగా చేరుటకు అవకాశాన్ని కల్గించాలి.

(3) ప్రభుత్వం ఈ సహకారసంఘాల పెట్టుబడికి గ్యారంటీ వుండాలి. సహకార పరపతి సంఘాలకు గ్యారంటీ వుండటం ద్వారా 1000 రూపాయిల మూలధనంపై మరొక రు. 90000 లకు బ్యాంకులు అప్పు లీయ గల్గుచున్నవి. అట్టి గ్యారంటీనే ఈ క్రయవిక్రయసంఘాలకు కూడా ఇచ్చి పరపతిని వృద్ధిచేయాలి. ఇందువల్ల ప్రజలలో విశ్వాసంకూడా హెచ్చవుతుంది.

(4) వాటాదార్లను చేర్పించు గడువును మార్చి ఆఖరువరకూ పొడిగించాలి. డబ్బు చేతిలోనికి వచ్చినవిదప రైతులూ, కూలీలు వాటాదార్లుగా చేరుటకు వీలౌతుంది. ఈ సంఘాల నిర్మాణం పూర్తియగువరకూ గ్రామ కమిటీల సహకారంతో సప్లయి డిపార్టుమెంటు ఆహార పదార్థాలను సేకరించాలి. మిల్లుయజమానులను మాత్రం ఏజంట్లుగా పెట్టరాదు. బుక్ ఎంట్రీస్ మినహా ప్రభుత్వానికి అయ్యేఖర్చుగాని కావలసిన పెద్ద పెట్టుబడిగాని ఏమీ వుండదు.

(5) ఖాదీస్కీముకూ, సహకార సంఘాలకూ ముడిపెట్టరాదు.

(6) కంట్రోలు చేయని ఇతర జీవితావసర వస్తువుల ధరలను కూడా కంట్రోలు చేసి, వాటి సప్లయి సంఘాలకు గ్యారంటీ చేయాలి.

(7) సంఘముల డైరెక్టర్ల ఎన్నికను సింగిల్ ట్రాన్సువరబుల్ ఓటింగుపద్ధతి ప్రకారం జరుపవలెను. ఇందువల్ల న్యాయమగు ప్రాతినిధ్యం లభించటమేగాక, అందరికీ సంతృప్తికరమైన రీతిగా ఎన్నికలు జరుగగలవు. అ. భా. కాంగ్రెసు కమిటీ ఎన్నికలలో గాని, రాజ్యాంగ పరిషత్తు ఎన్నికలలోగాని అవలంబించబడ్డ ఎన్నికపద్ధతినే సహకార సంఘాలకు, తోటి ప్రజాసంస్థలకు కూడా వర్తింపచేయాలి.

(8) వస్త్రవ్యాపారస్కీములో మార్పులు గావించాలి. చిల్లరవ్యాపారిని గాక, టోకు వ్యాపారులనే తొలగించాలి. మిల్లులనుండి సరాసరి జిల్లా కో-ఆపరేటివ్ స్టోర్సుకు తెప్పించి, అక్కడనుండి క్రయవిక్రయ సంఘాల అజమాయిషీ క్రింద చిల్లరవ్యాపారులకు బట్టలను అందచేయాలి.

పైవిధంగా సహకార క్రయవిక్రయ సంఘాల స్కీములో మార్పులు జరుగకపోతే అస్కీము అంతా వ్యర్థమైపోగలదని భావిస్తున్నాము. సహకారపద్ధతులపైననే ప్రజలకు అవిశ్వాసం కల్గుతుంది. ఇప్పటి బ్యాంకులు, స్టోర్సులవలెనే ఈ క్రయవిక్రయ సంఘాలుకూడా పార్టీకక్షలకులోనై కొంది మంది స్వంత సంస్థలుగా మారగలవు.

ఈ సహకార క్రయవిక్రయసంఘాల విషయమై ఆంధ్రరాష్ట్ర రైతుసంఘ సలహాలను కోరుతూ చాలామందిరైతులు వ్రాసారు. వారికి మా సలహా ఇదే; సహకార క్రయవిక్రయసంఘాలు స్థాపించటం చాలా అవసరం. వీటికొరకు గత 3 ఏండ్లుగా ఆంధ్రరాష్ట్ర రైతుసంఘం ఆందోళనచేస్తూవుంది. కాని ఇప్పటి స్కీములోగల లోపాలను పైన చూపాము. సంఘాలు ప్రజాతంత్ర పద్ధతులపై ఏర్పాటు అగుటకు మార్పులనుగూడా సూచించాము. అట్టి మార్పులు జరుగనిదే, ఈ సంఘాలు ప్రజలకు వినియోగపడుననే విశ్వాసం కల్గటం లేదు. కాబట్టి స్కీములో పై మార్పులు జరుగునంతవరకూ వాటాదార్లుగా చేరమని సలహా ఈయలేము. ఇవి బయ్రవదంగా, ప్రజామకూలంగా, ప్రజాతంత్ర పద్ధతులపై నడుపబడునని నమ్మకం చెప్పలేము. అందుచేత, స్కీములో ప్రధానమగు పై మార్పులు జరుగునట్లుగా తీవ్రాందోళన జేయవలసినదిగా కోరుచున్నాము.



తూర్పు గోదావరిజిల్లా మండపేటలో 20—11—46 న కమ్యూనిస్టుపార్టీ పిలిచిన 420 మంది స్త్రీ పురుషుల వరికోత కోపిసు. 191 [illegible]

చిన్న కథ

★ అతిథి ★

మాచినేని వెంకటేశ్వరరావు

మా పూరిమధ్య వేపచెట్టుక్రింద జనం గుంపుగా పోగయ్యారు. అంతమంది పోగయినా ఒక్కరిమాటే వినబడుతోంది ఏంటో నని నేనుగూడా అక్కడికి వెళ్ళా. అతన్ని జూచేసరికి నా కాశ్చర్యం వేసింది. ఆ మనిషి కాషాయవస్త్రాలు ధరించివున్నాడు. చేతిలో కమండలం వుంది. భుజానికి ఏదో మూట గూడా తగిలించాడు. వేషభాషల్లో మార్పొచ్చిందిగాని మొహంలో మాత్రం మార్పురాల. చాలా నవనీతంగా కనిపించాడు. తల కొంచెం నెరిసున్నా జుట్టు ఇంగ్లీషు నాగరికత పొందింది. మనిషి మంచివాడిలాగానే కనిపిస్తున్నాడు. అదే పనిగా ఎగాదిగా చూచా, ఎందుకోగాని అతనంటే నాకు చాలా అసహ్యం కలిగింది. అతనిమాటలు అతని వేషాన్ని మించుతున్నాయి. దేశంలో జరిగే సంగతులన్నీ చెపుతున్నాడు—

"హిందుల్కి సాయిబుల్ సంపీహేస్తుండారు."

మొదట హిందుల్ సాయిబుల్కి సంపీహేస్తే సాయిబుల్ హిందుల్కి సంపీహేస్తన్నార్" అన్నాడు నా ప్రక్కనే వున్న ఒక సాయిబు.

"సాయిబుల్కి హసల్ జారీ తల్వా గూడ"దన్నాడు సన్యాసి.

నా ప్రక్కనేఉన్న సాయిబుమీద నాకోపంవచ్చింది. వచ్చి ఏమిటిచేసేది?........ వాళ్ళుమాత్రం తక్కువున్నారా? నగండిలు వాళ్ళేనాయె. పైగా మానైజాం నవాబుకూడా సాయిబేనాయె. ఇక నేజేసేదేంటి? పేదవానికోపం పెదవికి చేటేగా? అయినా, నాకొచ్చినంతకోపం అక్కడున్న హిందువులకొచ్చినట్లు కనుపించలా. ఇంతలో ఒకమునలాయన "మనిషి ఎంతకాలం బతుకుతాడయా?" అన్నాడు.

అతను ఆలోచించి, ఆలోచించి "సవాల్కి హేమీ హుస్కుంధాహుంచే, హెంథోకాలం బతుక్తాడ్" అన్నాడు.

వెంటనే ఒక కుర్రాడు అందుకొని నవాబుకూడా సాయుబేకాదోయ్. ఇప్పుడేగా నీవు సాయుబుల్ని జాలితలవగూడదన్నావ్?" అన్నాడు.

వెంటనే కొంతమందికి ఆశ్చర్యం కలిగింది, కొంతమందికి కోపంవచ్చింది, కొంత మంది గేలిచేస్తూ నవ్వుతున్నారు. వీళ్ల చేష్టలన్నీ చూచేసరికి నాకూ చాల అసహ్యం వేసింది. అతనిమీద జాలివేసింది. అతను గూడా బెదిరిపోతున్నాడు. వారగంట చూపులు చూస్తున్నాడు—

ఎక్కడనుంచొచ్చాడో, లేక అక్కడే వున్నాడోగాని నా మేనల్లుడు ప్రసాద్ పెద్దాచిన్నా, గురువూ దైవమని లేకుండా "వార్ క్వాలిటీ సన్యాసిలాగున్నాడురా" అన్నాడు.

నా కసలు వీడంటే అరికాలమంట నెత్తికెక్కుతుంది. ఎందుకంటే.... ఆ విషయం చెప్పదగిందిగాదులే. వీడంటే పోలీసులకు గూడా మంటే....

ఆ సన్యాసిగూడా మావాడివైపు మిరిమిరి చూచాడు. నాకు చాలా సంతోషం కలిగింది. మావాడు నవ్వాడు. అందరూ నవ్వారు. నాకు చాలా చిన్నతనం కలిగింది.

"పకీర్‌వాడ్కి హెందూ బాబా హెక్లీ జేస్తార్" అన్నాడు సన్యాసి.

నా హృదయం కరిగిపోయింది. వీళ్ళకు తగిన ప్రాయశ్చిత్తం జేయాలనుకున్నాను. ఇంతలో మావాడు జనాన్ని నెట్టుకొని, ఆ సన్యాసి మీదొచ్చి పడ్డాడు. కొడతాడనుకున్నా, అంత పనిమాత్రం జరగలా. అతని భుజాన మూట మావాడు లాగేస్తున్నాడు. అతనూ గట్టిగనే పట్టాడు. చెయ్యి జారనివ్వటల్లా.

"నాది దాన్తో నీకేహేంటి పనివయా?" అన్నాడు ఆ సన్యాసి.

"పనేవుందిలే వదలవోయ్" అన్నాడు మావాడు. న్యాయానికి అతనిమాటే నిజం. వీడు వట్టి పోకిరివెధవని నాకుముందేతెల్సు నేనా సన్యాసికి అండగా పోదామనుకునే సరికి ఆమూట లాగనే లాగేశాడు మావాడు. ఇంకేలా పొయ్యేదీ? ఇక మావాడితో పోట్లాటలి. ఎందుకోగానీ మావాడంటే నాక్కూడా కొద్దిగా భయంవేస్తుంది. వాణ్ణి ఏదైనా అన్నా, ఎవటపడి అనేవాణ్ణిగాదు. అక్కడున్న ప్రజలూ నోరెత్తలా. పెద్ద మనుషులూనోరెత్తలా. అన్యాయం జరుగుతూంటే వింతగా చూస్తున్నారు. నాకూ ధైర్యంచాల్లా. మావాడు ఆ మూట విప్పుతూంటే అతను విప్పనివ్వటల్లా. మరొక కుర్రకొంకవచ్చి, అతన్నిపట్టి యివతలకులాగాడు. అతనిచూపులన్నీ ఆ మూటమీదే వున్నాయి. మావాడు గబగబా మూట విప్పాడు. తెల్లని లాగు బయటపడింది. తర్వాత ఆకుపచ్చటి రెండు జేబుల చొక్కా బయటపడింది. ఇక దాని వెంట సాయిబులకుచ్చుటోపీ, తమలపాకులు, సున్నం డబ్బా, వక్కలు, అగ్గిపెట్టె, నాలుగు చార్మినార్ సిగరెట్ పెట్టెలూ, ఒక విల్లు పెట్టె, ఒక కత్తి బయటపడ్డాయి.

"సన్యాసికి యివన్నీ యెందుకురోయ్" అన్నారు కొందరు.

"సన్యాసిగాదూ పాడుగాదు, సి. ఐ. డి. ముండాకొడుకు" అన్నారు కొందరు.

నేనుమాత్రం నమ్మలా. నమ్మడానికి ప్రాణంవొప్పలా. సన్యాసైతే సిగరెట్లుత్రాగ గూడదని ఎక్కడుంది? తెల్లబట్టలు కట్టుకోగూడదని ఎక్కడుంది?

"ఏవూరబ్బాయ్?" అన్నాడు మావాడు.

"కన్ననూర్" అన్నాడతను.

"ఎక్కడిది?"

"కలకత్తాదగ్గర" అన్నాడతను

"కలకత్తాదగ్గర కన్ననూరుందా?"అన్నాడు మావాడు.

"కలకత్తాకీ, కాశ్మీర్‌కీ నడీమధ్దె హుంది" అన్నాడతను

"తూర్పున కలకత్తా, ఉత్తరాన కాశ్మీరు, ఆ హ హ ఏమి సంబంధమయా" అన్నాడు మావాడు.

వీడిమొఖం వీడికి తెలిసినట్టే దిశలు గూడా చెప్తున్నాడు. అతనేమో దేశంఅంతా తిరిగొచ్చిన రకమయ్యే!

"మెడమీద తెం దెయ్యండిరా సరిగ్గా చెప్తాడు" అన్నాడొక కుర్రకుంక.

"ఛా కొట్టొద్దూ యేమొద్దూ. ఊరి బయటదాకా పంపించిరాండి. వెధవను పూళ్ళో వుండనివ్వొద్దు" అని ఆ మూట ఇచ్చి అతని వెంటముగ్గురుకుర్రాళ్ళనుపంపాడు మావాడు. అతను వెళ్తూంటే మరెప్పుడూ రావద్దు, వచ్చావంటే యీతడవ వీపు చెడిందే" అన్నాడు మావాడు ఊరంతా వీధినెట్టు—

అతన్ని ఊరి బైటదాకా పంపించారు కుర్రాళ్ళు. నేవెళ్ళి అతన్ని తీసుకొచ్చి, నాయింట్లో భోజనంపెట్టా. అతనుభోంచేస్తూ మహాత్మాగాంధీ ఫొటోవంకా, నెహ్రూఫొటోవంకా, టోన్ క్యాలెండర్ వంకా చూస్తున్నాడు. ఏంటేంటో ఆలోచించి.

"వో దేవకూస్ కోన్ బాబా" అన్నాడు.

"మావాడే ప్రసాదని వట్టిపోకిరీ వెధవ మంచీమర్యాదా యేమీ తెలీదు".

నేను 'ప్రసాద్' అని ఎప్పుడైతేఅన్నానో "ప్రసాద్" అని పెదిం కొరుక్కున్నాడు ఆశ్చర్యంగా

"ఎందుకండీ పెదిం కొరుక్కుంటారు?"

"ఎందూ్కలేదు"

"హాయనిహిల్లా హెక్దా"

"ఇదుగో మాయింటిపక్కనే ఆ కనపడే యిల్లే" అన్నాను.

అటూఇటూ చాలా సేపుచూచాడు. భోజనమైనతర్వాత ఊరిబైటదాకా నేనేవెళ్ళి పంపించొచ్చా. మొత్తంమీద యీ సంగతి ఊళ్ళో ఎవరికీ తెలీదు. అతిథి ఊళ్ళో కొస్తేఏం? ఇంటికొస్తేఏం?........

✱

పూరంతా మాటు మనగింది. నేను పొరుగూరు ఏదోపనుండి వెళ్ళి, వస్తున్నా. నాకు ఊరిబయటే ఊళ్ళో యేడుపులు గోలంతా వినవచ్చింది.

అది మాయింటికి దిన్నగానే, పరుగెత్తుకుంటూ వెళ్ళా. అలా పరుగెత్తుకుంటూ వచ్చినా, మనుషులెవరూ కనిపించలా—

నా యిల్లు నాకంట బడింది. నాలుగు మూలలా పోలీసులున్నారు. లోపలమాత్రం మా ఆవిడ కేకవేస్తోంది. నా పొట్ట జలదరించింది. గబగబా లోనికి పరుగెత్తబోయా. పోలీసులు పట్టుకొని ఇవతలికి లాగారు. ఇక నా అవస్థ చెప్పనలవిగాదు. అంతా అయోమయంగా వుంది. చుట్టూ యెవరూ కనిపించలా. అసలు వీళ్ళు నా యింటికెందుకొచ్చారో నాకర్థంగాలా. పెద్దగా కేక వేయబోయా. నానోటిమీద చెయ్యవేసి క్రిందపడవేసి, నోట్లో గుడ్డలుకుక్కారు. పందిరిగుంజకు కట్టేశారు పోలీసులు. మా ఆవిడ "వామ్మో" అని అరిచింది.

నా కళ్ళవెంట గిర్రున నీళ్ళు తిరిగాయి. ఇంతలో అమీన్ సాహెబ్ "అరె బాబా మర్‌గయారె" అంటూ బయటకు పరుగెత్తుకు రాబోయి, గుమ్మానికికొట్టుకున్నాడు. వెంటనే పోలీసులు అతని దగ్గరకు చేరుకున్నారు. ఇంకేముందీ వాళ్ళ మొఖాలకొచ్చి కొట్టుకుంటున్నాయి చిన్న చిన్న రాళ్ళు మొట్టమొదటకుండకే అందరి కళ్ళూ మూసుకుపోయ్యాయి. క్రింద పడుకొని నేనుగూడా కళ్లుదెరిచి చూస్తున్నానేమో నా కళ్ళల్లోగూడా వచ్చిపడింది కారం. పడితే పడిందిగాని, నాకు భలే సంతోషంగావుంది. మళ్ళీ కళ్ళు తెరిచానోలేదో అమీన్‌సాహెబ్ నెత్తిమీద టోపీ ఎగిరి అవతలపడింది.

"మారో" అన్నాడు అమీన్‌సాహెబ్

పోలీసులు తుపాకులెత్తారు.

నేను కళ్ళుమూశా. ఎంతసేపటికి తుపాకులు మ్రోగకపొయ్యేసరికి మళ్ళీ కళ్లుదెరిచా. ఒక కుర్రాడు నా ఎదుట మొండిగోడమీదుగా ఎక్కి దూకబోతున్నాడు. పోలీసుల్నిచూచా. తుపాకులటే గురిపెట్టున్నాయి.

అరుద్దామనుకున్నా ఎలా?

లేచి పోయి అవతలికి లాగుదామనుకున్నా, ఎలా? నా పందిరి గుంజకు నన్నే గట్టేశారు. తుపాకులు మ్రోగనే మ్రోగాయి. గోడమీద కుర్రాడు మళ్ళీ కనిపించలా.

మళ్ళీ రాళ్ళు పడటం సాగాయి. యీ దఫా "రుయ్యి"మంటూ వస్తున్నాయి రాళ్లు. ఒక్కొక్కరాయి రామబాణంలా వస్తోంది. పోలీసులు చెల్లాచెదరయ్యారు. ఒకడు అవచ్చిపోయిన కుర్రాణ్ణి (మిగతా 10వ పేజీలో)

నిజాంయిత్రికి నిదర్శనం ★

అయ్యాపు వెంకటకృష్ణయ్య

ప్రజా ప్రభుత్వపు నిజాయితీకొక
నిదర్శనంబిది యనరాదా? అను
కొనరాదా?? నిజ
మది కాదా? ఏదో చెప్పరాద?.... ॥ప్రజా॥

అదిగదిగో! గోల్డెన్ రాకదిగో!
అవైపున జూడిమల్నేరిదే!
కోయంబత్తూర్ నరకకూపమదె!
కళ్ళెంవిడిచిన ఘాతుకమృగముల్
ప్రజాజీవితం బలిగొంటూంటే—
మరతుపాకి గుండ్లెరగొంటూంటే —
మృతవీర శవంమీద తాండవం,
పిశాచత్వం పెంచుతోంటే—
శాసనసభలో కార్మికచట్టం,
శ్రామికజాతికి విశ్లేషపుఘట్టం.... ॥ప్రజా॥

అసహ్యమంతా ధరించి పట్టణ
వసతి రక్షించువారి హక్కుపై —
డొక్క పూడుటకు గుక్కెడు గంజీ
నెక్కువ కోరిన నేరమ్మునకై —
బండలు పగిలే బూతులతోటి —
తుపాకి మడమల తాపులతోటి —
పోలీస్ లాఠీ చూపే ధాటి —
ప్రజారాజ్యమున ప్రజలతో పోటీ.... ॥ప్రజా॥

వరార్థటుక్ మీర్జా యిస్మాయిల్ —
దురంతకపు హైద్రాబాదునన్ —
తిరువాన్కూర్ దయ్యర్ సర్ సి. పి.
నరాంతకుని ముష్కర పాలనలో —
ఖరాసురుడు కాక్ తన ముత్తాతల
మిరాసియను కాశ్మీరు నరకమున —
నిరంకుశపు విషకరాళమదిగో!
నరకంకాళపు గుట్టలలో — దు
ర్మరణబాధితుల మూల్గులలో — దు
స్తరావేదనార్తారావములలో —
కరకు కత్తులూ — మరతుపాకులూ —
పెరేడులూ — మిల్‌టరీకాల్పులూ —
విరామమెరుగని బరాబరులలో —
అరాజకపు వికటాట్టహాసముల —
నిరంకుశుని విషకరాళ మదిగో! —
దురుద్యోగులూ — మిరాసిదార్లూ —
నరాశనుల బంజరు జాగీర్లూ —
పురోగమించే ప్రజాశక్తులన్
నిరోధించుటకు నిలచాయవిగో!....
"సంస్థానమ్ముల రక్షణచట్టం"
ప్రజలకు సహాయం నిరాకరిస్తూ
ప్రజా ప్రభుత్వపు శాసనసభలో
పెరేడు చేస్తూ టిల్లాతోందోయ్!... ॥ప్రజా॥

ప్రజా ప్రభుత్వం — పోలీసు రాజ్యం —
ప్రజా ప్రతినిధుల భేషజు రంగం
ఉపకారమునకు పూలక్కి శక్తీ
అపకారమ్మున అంతా తమదే
ధనికవర్గముల కనికరమ్మతో
మనుచున్నామను కొనుచున్నారోయ్....
ప్రజా రాజ్యమున పీడితవర్గం
కరువు కాటకాల్ భరించాలటోయ్
దెబ్బ తగిలినా అబ్బాయనరా
దాకలియైనా నన్నమడుగరా
దేడ్పువచ్చినా యేడువరాదట —
అదేమన్నచో ప్రజారాజ్యమట
ఆ మహాశయం చెడిపోతుందట
ధనికవర్తకుల కనికరమ్మునకు
గనులు, నినుములను, జనుములు కూడా —
తినుబండారపు దినుసులు కూడా —
ప్రజల మానమూ — ప్రాణము కూడా
గుడ్డా, గోచీ కూడా తుదకిటుకూడా
బ్లాక్‌మార్కెట్టుకు బలిచేస్తారట —
తోడుదొంగలా లంచగొండులూ—
దొంగవర్తకులు దేశభక్తులట
సామ్రాజ్యవాద మన జంకుగుండెలో
విరికిరక్తమది కరుడుగట్టినది
ధనికవాద సాధనములలోనే
తను తరించవలె ననుకొంటున్నది ॥ప్రజా॥

శంఖారావం

★

కోగంటి గోపాలకృష్ణయ్య

★

ఓయ్-హోయ్-హోయ్ – నైజాం హోయ్
ఓయ్ హోయ్ హోయ్ – కాశ్మీర్ హోయ్
సంస్థానాల్లో స్వాతంత్ర్యానికి
పొంగుతెగయును ప్రజావెల్లువలు
పొరుచున్నవంహోయ్—

దోపిడి దొంగకు – తొత్తుల నైజాం
కక్కిన కూటిని – మెక్కుచు బ్రతికే
భోగలాలసుడు – జాగీర్దార్
నానా హింసలు – దారుణ హత్యలు
నిలువున దోపిడి – నీచులందరి
అప్పు వచ్చినా దెబ్బకు దెబ్బ
తరిమి తరిమి కొడతాం॥

బందగి రక్తం – చిందిన గంధమై
విసునూరెక్కిన – జనగాంలోను
కరీంనగరము – ఖమ్మంమెట్
సూర్యాపేటలో – ఢీకొని పోరగ
పగతుర గుండెలు – పటాపంచలై
ప్రజావాలికే తీరినదని పలాయనమోయ్

గూడుపుఠాణి – లాఠీకర్ర
తుపాకిగుండు – ఫిరంగిదెబ్బ
నెత్తుటివరదై – రక్తపుటేరై
మరియొక జలియన్ వాలాబాగై
తెలంగాణ ప్రజాస్వతంత్ర శంఖం
పూరించిందంహోయ్॥

కొండల్లో – సింహాల్లా
లోయల్లో – మెరుపుల్లా
వంకరకొంకి – వరలోకత్తి
వండ్లకుగంత – కారపు ముంత
కొడవలిపట్ట – రేవడిసుద్ద
రాళ్ళు, రప్పు – తాళంకప్పు
గవలాడించే – వడిసెల
ఉండేలు, పేషెస్ – బాకు, తల్వార్
వందలు వేల్ – లక్షలకొలది
గుబగుబమూగిన – గడిపిన నైజాం
రే రే – రా రా.

రే రే రేవర రా పోరుకు రావా:
అనుమాసులో – కండవాడుం
దారేముల్లో – వుంకాపూర
జనగాం చేసిన – సింహనాదం
వెల్లేనగరగ – విప్లవఘోషం
ఇంక్విలాబ్ – జిందాబాద్
కామ్రేడ్ కొమరయ్య – జిందాబాద్
అనంతరెడ్డీ: జోహార్లిదిగో:
పటన్‌దార్ – బంజరుదార్
జాగీర్దార్ – మక్తేదార్
దేశముఖుల – గోరీలను కడతాం
నిరంకుశత్వం నిర్మూలించగ నిలచి
పోరుతున్నాం॥

మీర్జా ఇస్మాయిల్ – అక్తరుమీద
రౌడీ గుంపులు – తెచ్చినగాని
పోలీస్ జులుం – సాగినగాని
మిలిటరి దేరాల్ – వేసినగాని
తెల్ల సైనికుల – దింపినగాని
రణరంగంలో గోరీకట్టి – భేరి
మోగిస్తాం ॥జయభేరి॥

లేవా – అద్బున్ – మోహన్ గోపీ
కమల, సీత – హుమాయూన్ బీబి
కమ్మ, రెడ్డి, కాపు, ముస్లిం
పీడిత జనులు – బిగించి పిడికిలి
ముక్కోటాంధ్రుల ప్రజారాజ్యమును
స్థాపించగ రండోయ్

విజ్ఞానం - వికాసం

నీరు - దాని స్వభావం

(2)

"సత్య"

ప్రాణవృత్తికి ముఖ్యావసరాలలో ఒకటైన నీరు ప్రకృతిలో విశేషంగా దొరుకుతుంది. ఏ ఎడారులలోనో తప్పించి, ఖరీదు లేకుండా, ఉచితంగా కావలసినంత దొరుకుతుంది. ప్రకృతిలో అరుదుగా దొరికే ఇంకొకరకం నీరు ఉంది. అది ఒక గాలను కొన్ని వందలరూపాయలు ఖరీదు చేస్తుందంటే చాలామంది ఆశ్చర్యపడతారు. ఆరకం నీటికి బరువునీరు (Heavy Water) అని పేరు. శాస్త్రజ్ఞులు ఈ మధ్యనే ఈ కొత్తరకం నీటిని కనిపెట్టారు.

సాధారణనీరు ఉదజని, ప్రాణవాయువుల సమ్మేళనంవల్ల వచ్చింది. ఈ ఉదజని సాధారణమైనది. విశ్వంలోని పదార్థాలన్నిటిలోనికి తేలికైనది. యూరే అనే శాస్త్రజ్ఞుని కృషివల్ల ఒక అసాధారణ ఉదజని బయల్పడ్డాది. ఈ అసాధారణ ఉదజని పరమాణువులు ఎక్కువ బరువుగా ఉంటాయి. సాధారణ ఉదజని పరమాణువు బరువుకి రెండింతలు ఉంటాయి. కనుక ఈ వాయువుకు బరువు ఉదజని (Heavy Hydrogen) లేక డాయిటీరియం అంటారు. ఇటువంటి బరువు ఉదజని ప్రాణవాయువుతో కలిసినప్పుడు వచ్చిన నీటిని బరువునీరు అంటారు.

ఈ కొత్తరకం బరువునీరు దొరకడం చాలా అరుదు. మామూలుగా దొరికేనీటిలో ఎన్నో వేల పాళ్ళలో ఒకపాలు ఈ రకం ఉంటుంది. మామూలు నీటిని, దీనిని విడదియ్యడానికి క్రమంతో కూడిన రసాయనిక విధానాలు ఉపయోగించాలి. కనుకనే ఈ బరువు నీటికింత ఖరీదు. దీనికి మామూలు నీటికి భౌతికధర్మాలలో అంతభేదంలేదు. దీనికి రుచిలో ప్రత్యేకత్వంలేదు. ఇది జీవాభివృద్ధిని కొంతవరకు నిరోధిస్తుంది. దీనినే తాగితే ప్రమాదంకూడా సంభవిస్తుంది. లేకపోతే డబ్బు ఎలా ఖర్చుపెట్టడమా అని మార్గాలు వెదికే ధనవంతులు మామూలు నీటికి బదులు దీనిని తాగడమే ఫేషనుగా చేసికొందురేమో.

సాధారణ ఉపయోగాలలో బరువునీటికి ప్రత్యేకతలేకపోయినా, విజ్ఞానాభివృద్ధికి ఇది కొంతవరకు తోడ్పడింది. రేడియో ధార్మికత (ప్రకాశయకాంబలో మార్పులకు సంబంధించిన శాస్త్రము) మీద ప్రయోగాలకు బరువు నీరు చాలా తోడ్పడ్డాది. బరువునీటి సహాయంతో ఈ మధ్య పరమాణుశక్తి నుద్భవింపచేసి, ఆశక్తితో ఒక మోటారుకారును నడుపుతున్నాను చూడండంటూ ఇంగ్లీషు శాస్త్రజ్ఞుడొకడీమధ్య కొందరు శాస్త్రజ్ఞులను బ్రిటిషు మంత్రులను పిలిచాడు. కాని తీరావేళకి ఆ కారు నడవకపోతే ఎవరో దుర్మార్గులు దానిని పాడుచేసారని, మళ్ళా త్వరలో నేటలు వంటి పరమాణుయంత్రాన్ని సృష్టించి, అందరికీ చూపెడతానని అన్నాడు. ఈ శాస్త్రజ్ఞుడు తాను చేసానన్నది నిజమైనా కాకపోయినా, కొంతకాలంపోయేక, ఇంకొంత విజ్ఞానాభివృద్ధితో అటువంటిది సాధ్యమవడానికి అవకాశాలు లేకపోలేదు.

ఓ తెలుగన్నా

పూలకుంట సంజీవులు

నాజీలు వత్తురా?
నరపతులు నిల్తురా?
తెల్లదొరలు తిరిగిపోతురా:
ఓ తెలుగన్న
కో బలియని కొడవలెత్తరా॥

ఉష్ణరక్తమెప్పొంగెడి
కృష్ణరాయల సీమవాని
వెనుకముందు ఎందుకింకరా:
వీరుడా॥

నిరులుపొంగు నీ భూమిని
కరువులతో కాల్చినట్టి
ఖలులందరి గాంచిమాడరా
ఓ తెలుగన్న
కో బలియని కొడవలెత్తరా॥

కనెగంటి హనుమంతుని
కన్నభూమి అన్నవాని
కదలిరమ్మ ఎదురులేదురా
వీరుడా॥

దోపిడీ నిరంకుశులను
దుంపనరుక లే లెమ్మిక
అలసినైతె అడుగుతప్పురా
ఓ తెలుగన్నా
కో బలియని కొడవలెత్తరా॥

అల్లూరి రామరాజు
తల్లిభూమి అన్నవాని
ప్రతినచేసి పదరముందుకు:
వీరుడా॥

జమీందార్ల జబర్దస్తి
భూస్వాముల మాతుకాలు
రూపుమాప లేచిరమ్మురా
ఓ తెలుగన్నా
కో బలియని కొడవలెత్తరా॥

ఒక్కతల్లి బిడ్డలము
ముక్కోటికి బలగముంది:
భరతభూమి దాసలుండిరా::
వీరుడా::

వెనుకుముందు విడిచివే
విశాలాంధ్రదేశమున
తెలుగుజెండ వెలుగుజూపరా
ఓ తెలుగన్నా
కో బలియని కొడవలెత్తరా॥

గ్రంథావలోకనం

బలిదాన్

రచన: లియోనిద్ లియోనోవ్.

అనువాదం: మహీధర జగన్‌మోహన్.

132 పుటలు: వెల: 1—0—0

Invasion అనే సుప్రసిద్ధ రష్యన్ నాటకానికి యిది అనువాదం.

నాజీసేనలు అకస్మాత్తుగా సోవియటు యూనియన్‌మీద దాడిచేసినప్పుడు ఎర్ర సైన్యం తాత్కాలికంగా తిరోగమించవలసి వచ్చింది. జర్మను బలాలు మాస్కోపై విరుచుకు పడుతున్నాయి. ఆరోజుల్లో జర్మన్లు చేసిన ఘాతుక కృత్యాలు, గెరిల్లావళాల ప్రతిఘటన యీ నాటకంలో చిత్రింపబడ్డాయి. ఒక డాక్టర్ కుటుంబం గెరిల్లా నాయకులకెలా సహాయం చేసిందో ఇందులో చూపబడింది. అనువాదం సులభశైలిలో చక్కగా నడిచింది.

— సీవియర్.

లెనిన్ ఉపదేశాలు

రచన: పామీదత్తు

అనువాదం: రామమోహన్

వెల: రూపాయి.

సోషలిజం కేవలం ఊహామాత్రం కాదని ప్రపంచంలోని ఆరో వంతు భాగంలో రష్యాలో – మొట్టమొదటిసారి సోషలిస్టు సమాజాన్ని స్థాపించిన యుగపురుషుడు లెనిన్. కార్మిక - కర్షకోద్యమాల విజయానికి అవలంబించవలసిన పద్ధతులు, ఎత్తుగడలు, సిద్ధాంతాలు మార్క్సిస్టు దృక్పథంలో లెనిన్ వివరించాడు. ఆయన ఉపదేశాలను ప్రఖ్యాత మేధావి పామీదత్తు చక్కగా పొదిగి మనకు అందించాడు. ప్రతి స్వతంత్ర ప్రియుడూ చదివి జీర్ణించుకోవలసిన పుస్తకం.

అనువాదం సరళంగా, సుబోధకంగా ఉన్నది.

— విశ్వం

విప్లవ సందేశం

రచయిత: క్రోపాట్కిన్

అనువాదం: జగన్మోహన్

వెల 8 అణాలు.

పై మూడు పుస్తకాలూ విశ్వసాహిత్యమాల (రాజమండ్రి) ప్రచురణలు.

స్వీకారం

ప్రవాసి

ప్రకాశకులు:

ఆంధ్రవిజ్ఞానసమితి, జంషెడ్పూరు

వెల రు. 1-0-0

రాష్ట్రేతరాంధ్రుల నిమిత్తం నడుపబడే పత్రిక. శాస్త్రీయ విషయాలకు సంబంధించిన వ్యాసాలూ, పాటలుకూడా వున్నాయి.

(7 వ పేజీ తరువాయి) ఎత్తుకొని పరుగెత్తుతున్నారు. అతనిముఖాన ప్రత్యేకంగా ఒక రాయి పగిలింది. రెండువైపులనుండి రెండు కత్తులొచ్చాయి. అతని బుర్రమీద నాట్యం చేస్తున్నాయి. పాపం వాడు ఆ కుర్రవాణ్ని అక్కడొదిలి పొలాల్లోకి పారిపోజూసాడు. పోలీసులందరూ అదేపని చేస్తుంటారు—

మా ప్రసాద్ వచ్చి, నా కట్లువిప్పి, నా నోట్లో గుడ్డలు తీసేశాడు. నన్ను నా ఇంట్లోకి తీసికెళ్ళాడు. గాంధీజీ, నెహ్రూ ఫొటోలు పగిలున్నాయి. టాన్ క్యాలెండర్ అసలు కనిపించలా. మా ఆవిడ క్రిందపడుంది. స్పృహలేదు. మా ప్రసాద్ వైపు చూచా. నాకు విపరీతమైన కోపంవచ్చింది.

"మీ లోటి వాళ్లుండబట్టే ఇలాంటిహింసలు జరుగుతున్నాయి" అన్నాను.

"అత్తగారిమీద కూడా చేయి వేస్తూంటే కళ్ళుమూసుకొని కూర్చోమంటావా అహింసా మంత్రాన్ని జపిస్తూ" అన్నాడు ప్రసాద్ కోపంగా.

"వాళ్ళముందు మీరేం చేశారో...."

"వాళ్ళను ముందివరకి దిగితేనే మావరికేం దిగాం"

"ఏమో మీమాటలు నమ్మేదెలా?"

"మా మాటలు నమ్మకుండా సి. ఐ. డి. కి తిండి పెట్టబట్టే యింతపనిజరిగింది." అన్నాడు మావాడు.

"సి. ఐ. డి." అనేమాట వినేటప్పటికి నా మనస్సు కంగారుపడింది. వెనక జరిగిన సంఘటనలన్నీ ఒక్కసారినాబుర్రలో తిరిగాయి.

చెరువు గర్భాల వేలం

ఆహార పంటలకు అరిష్టదాయకం

పిఠాపురం ఎస్టేటు రైతుల ప్రతిఘటన

వేలకొలది యకరాల భూమిని సాగుచేయగల చెరువులను పాడుపెట్టి, చెరువు గర్భాలను మైరుపంటలు వేయడానికి పాటపెట్టి డబ్బుగుంజడం తెలుగు దేశమంతటా జమీందారులకలవాటయింది. నీరుసప్లయి కాక భూములు సాగుకాకపోయినా, మామూలు శిస్తులు నిర్బంధంగా రైతులనుండి వసూలుచేస్తున్నారు. కోర్టుకువెళ్ళి, సొమ్ము ఖర్చుపెట్టి ఈ అక్రమాల నెదుర్కొనే శక్తిలేక, ఉన్నభూమిని జమీందారు పరంచేసి వందలవంటి రైతుకుటుంబాలు పరలపాలవుతున్నాయి.

ఎస్టేటుల్యాండుయాక్టులో చెరువులనునిర్బంధంగా జమీందారుచేమరమ్మతుచేయించే అవకాశమున్నా ఏనాడూ ప్రభుత్వం ఆ అవకాశాన్ని ఆధారంచేసుకొని రైతులకు మేలు చేసిన పాపానపోలేదు.

జమీందార్లు రైతుల భూములకు నీరివ్వకపోవడమేగాక, పశువులకు వేసవిలో త్రాగడానికి గ్రుక్కెడు నీళ్ళుకూడా లేకుండావున్న నీరుకాస్తా తీసివేస్తున్నారు. చెరువు లోతట్టులో పొగాకు మొదలైన మైరు పంటలు వేయించి, టొబాకోసాలు నింపుకొంటున్నారు. రైతులు చేసిన ఆందోళనను ప్రభుత్వమూ పట్టించుకోలేదు.

ఈ దుర్భర పరిస్థితులనుండి బయటపడడానికి తమ ఐక్యతాబలమే సాధనమని రైతులు గ్రహించారు. కార్యాచరణకు పూనుకున్నారు. పిఠాపురం ఎస్టేటు రైతులు ఈ చెరువుల పోరాటంలో ముందు పీఠిని నిలుచున్నారు.

పిఠాపురం తాలూకా రైతుసంఘం పిఠాపురం ఎస్టేటులోని చెరువులను మరమ్మతు చేయించాలని కొన్ని సంవత్సరాలనుండి ఆందోళన చేస్తోంది. మహారాజా రైతుల మొర ఆలకించలేదు. ప్రభుత్వానికి మహజర్లు పెట్టింది. ఎంతోకాలానికి ప్రభుత్వం కదిలినట్లు కనిపించింది. ఎస్టేటులోని చెరువులను మరమ్మతు చేయకపోతే ప్రభుత్వమే చేయించి జమీందారునుండి సొమ్మురాబట్టుకుంటుందని ఒక నోటీసు యిచ్చారు. రైతులు ఆశపడ్డారు. కాని అంతకుమించి ప్రభుత్వం చేసిందిలేదు.

తిరిగి ఈ సంవత్సరం జమీందారు చెరువు గర్భాలు పాటకు పెట్టారు. పాటదారులు జమీందారు హంగుతో నీరు తీసివేయడానికి పూనుకున్నారు.

వర్షాలులేక మొదటిపంట నష్టమయింది. ఈ మధ్య కురిసిన వర్షాలతో చెరువులు నిండాయి. రైతుకు ప్రాణాలు లేచివచ్చాయి. రెండవ పంటైనా పండుతుందని ఆశపడ్డారు. కాని జమీందారు తన దురాశకొద్దీ ఈ రైతుల ఆశలను నిరాశలుచేశాడు.

రైతుసంఘం పిలుపు

జమీందారీ తొత్తులు చెరువుల నీరు బయటకు తీయకుండా ప్రతిఘటించాలని తాలూకా రైతు సంఘం రైతులకు పిలుపు ఇచ్చింది. సభలద్వారా, బుర్రకథలద్వారా రైతు సేవకులు గ్రామ గ్రామాన ప్రచారం చేశారు. జమీందారీ దౌర్జన్యాన్ని ప్రతిఘటించడానికి రైతులంతా రైతుసంఘ నాయకత్వాన, ఎర్రజండా నీడను ఏకమయ్యారు.

కానుచెరువు

ఎస్టేటు చెరువులలో కానుచెరువు ప్రధానమైంది. ఈ చెరువు 215 ఎ. వైశాల్యం కలిగి 3 వేల యకరాలను సాగుచేస్తుంది. ఈ చెరువు లోతట్టును మహారాజా మైరు పంటలకు పాటపెట్టారు. రు 4000 లపైగా సొమ్ము వచ్చింది.

చెరువుక్రింద రైతులు ఈ అక్రమాన్ని ఆపమని జమీందారుకు, కలెక్టరుకు, కాంగ్రెసుమంత్రులకు టెలిగ్రాంలు పంపారు. కాని జవాబులేదు. పాటదారులు చెరువునీరు బయటకు తీసివేయడానికివచ్చారు. ఇకలాభంలేదని రైతులు అడ్డుతగిలారు. పాటదారుల ప్రయత్నాలు సాగలేదు.

తర్వాత జమీందారీ నౌకర్లు నీరు తీసివేయడానికి పూనుకున్నారు. చుట్టుప్రక్కల గ్రామాల రైతులంతా ఐక్యమై నిలిచారు. వందలకొలది రైతుయువకులు ఎర్రజెండా నాయకత్వాన నీరు తీయకుండా జమీందారీ నౌకర్లను ప్రతిఘటించారు. ఈ ఐక్యశక్తి ముందు జమీందారీ నిరంకుశత్వం తలవాల్చింది.

రైతులదే న్యాయమని కలెక్టరు అంగీకారం

గతనెల 29 వ తేదీన సబ్‌కలెక్టరు విచారణకై కానుచెరువువద్దకు వచ్చారు. 300 మంది రైతులు చెరువుపై తమకుగల హక్కును గూర్చి సబ్‌కలెక్టరుకు నచ్చచెప్పారు. రైతులవాదన న్యాయమైనదని కలెక్టరు బహిరంగంగా అంగీకరించారు. అయితే యీ రైతుల వాదనలోగల న్యాయాన్ని, ధర్మాన్ని రక్షించడానికి ప్రభుత్వం స్వయంగా పూనుకొనేదెప్పటికో!

ఇతర చెరువులకు వ్యాపిస్తోంది

దొంగచాటుగా జమీందారీ నౌకర్లు చెరువుకు కన్నం వేయకుండా రైతులు అత్యుత్సాహంతో రాత్రివేళ కాపలా కాస్తున్నారు. ఈ రైతు పోరాటాలు ఎస్టేటులోని యితర చెరువులకుకూడ వ్యాపిస్తోంది. నరసింహరాయుణం చెరువులోని నీరు తీయడానికి వీలులేదని అచ్చటి రైతులు ప్రతిఘటనకు సిద్ధమౌతున్నారు. ధర్మరక్షణకు ప్రజలే నడుము బిగిస్తున్నారు.

పిఠాపురం తాలూకాలో గొల్లప్రోలు, వెంకటగిరి ఎస్టేట్లకు జాయంటుగావున్న బాడవచెరువును జమీందార్లు పాటకుపెట్టారు. రైతుసంఘం వెంటనే రైతులకు పాడవద్దని హెచ్చరిక యిచ్చింది. ఈనెల 3 వ తేదీన చెరువును పాటపెట్టడానికి ఎస్టేటు ఉద్యోగులు చేసిన ప్రయత్నాలు, కుట్రలు అన్నీ విఫలమైనాయి.

ప్రభుత్వ కర్తవ్యం

ఈ రైతు పోరాటాల విజయంపైనే మన ప్రజల ఆహార సమస్యా పరిష్కారం ఆధారపడిఉంది. చెరువులను పాడుపెట్టి పంటభూములను పడ్రబీడులుగా మార్చివేస్తున్న జమీందారీ విధానాన్ని మొదంట తుడిచిపెట్టిననాడే ప్రజలకు కడుపునిండా కూడు దొరుకుతుంది. ప్రభుత్వం వెంటనే ఈ చెరువుల నీరు వృధాచేయడానికి జమీందార్లకు హక్కులేదని ప్రకటించాలి. నీరు రైతులకు కోర్టులకు గెంటకుండా రైతులకు తోడ్పడవలసినదిగా ప్రభుత్వోద్యోగులను ఆజ్ఞాపించాలి.

'వార్లీ' రైతుల నణచడానికి గూండా చట్ట ప్రయోగం!

బొంబాయి ప్రభుత్వ అధికార దుర్వినియోగం

కామ్రేడ్ రంగనేకర్

థానా జిల్లా బొంబాయి రాజధానిలోనిది. అక్కడి రెండు తాలూకాలలో– దహాను, ఉంబర్ గావ్– 'వార్లీ' అనే తెగకుచెందిన రైతులు అడవులలో కూలికి కట్టెలుకొట్టి జీవిస్తారు. షాహుకార్లు వారికి యిచ్చే కూలీరేట్లు బహు స్వల్పం. హెచ్చించమని ఎన్నిసార్లు అడిగినా నిరాకరించారు. చివరకు గత్యంతరం లేక 15,000 మంది 'వార్లీ'లు లోగడ సమ్మె చేశారు. నెలరోజులు శాంతియుతంగా, పట్టుదలతో పోరాడారు. ఆ పోరాటాన్ని నిర్బంధ విధానం వల్లగాని, మాయోపాయాల వల్లగాని, అణచడం సాధ్యంగాక, ప్రభుత్వం ప్రాంతీయ స్పెషల్ ఆఫీసరును పరిష్కార కర్తగా నియమించింది.

"వార్లీ" రైతుల సంఘీభావం షాహుకార్లను లొంగదీసింది. వారుకోరిన కూలీరేట్లకు అంగీకరించవలసివచ్చింది. నవంబరు 10వ తేదీన, స్పెషల్‌ఆఫీసరు సమక్షంలో, ఒడంబడిక పత్రంమీద సంతకాలుజరిగాయి. రైతులపై నిర్బంధవిధానం తొలగిస్తానని స్పెషల్ ఆఫీసరు వాగ్దానంచేశాడు.

కాని, ఒడంబడిక పత్రంమీద సంతకాలు జరిగిన 4 రోజుల తర్వాత, నవంబరు 15వ తేదీని, బొంబాయి ప్రభుత్వం "వార్లీ" రైతుల మీద విరుచుకు పడింది. పైరెండు తాలూకాల్లో అసాధారణ పరిస్థితులేర్పడ్డట్లు ప్రకటించి, "గూండా" చట్టాన్ని అమల్లోపెట్టింది.

నవంబరు 20, 21 తేదీలలో మహారాష్ట్ర రైతుసంఘ కార్యదర్శి ఎస్. వి. పరులేకర్‌ను, రమాకాంతగుప్తే, హరిభావ్ పీర్‌కర్, కమలాకర్ రణదివే, అనేవారిని థానాజిల్లా నుంచి బయటకి పంపివేయబడ్డారు.

ఇదంతా గూండాచట్టం ప్రకారంజరిగింది.

గర్భిణీ స్త్రీలను చెరిచారు

నాయకుల్ని పోలీసులు యీ విధంగా ప్రజలకు దూరంచేసి, 'వార్లీ' రైతులమీద అమానుష కృత్యాలు ప్రారంభించారు. షాహుకార్లు ఎవరిపేరుచెబితే, వారిని పోలీసులు లాకప్‌లో పెట్టారు.

రైతాలీ అనే గ్రామంలో పోలీసులు ఇద్దరు గర్భిణీస్త్రీలను చెరిచారు. రన్‌షేప్‌లో ఇద్దరు పండుముదుసళ్ళని అరెస్టు చేశారు. వారు జబ్బుతో మంచంపట్టి ఉన్నారు. మొల్‌వాడ్‌లో కొందరిని అరెస్టుచేసి, నిర్బంధంలో క్రూరంగా హింసించారు. లడ్కీ సుకార్ అనే 'వార్లీ' యువతి, ఈ నిర్బంధ విధానం ప్రారంభమయాక, ఎక్కడ ఉన్నదీ జాడ తెలియడంలేదు.

ఇదంతా గూండాచట్టం ప్రకారంజరిగింది.

కలెక్టరు రహస్య సర్క్యులరు

జిల్లాకలెక్టరు తహశీల్దారు లందరికీ ఒక రహస్య సర్క్యులరు పంపినట్లు రూఢిగా తెలుస్తోంది. 'వార్లీ' రైతులలో రైతుసంఘానికి వ్యతిరేకంగా ప్రచారంచేయమనీ, కష్టాలేవైనా ఉంటే, అధికారులకు చెప్పుకొనేటట్లు చూడవలసిందనీ, ఆ సర్క్యులర్‌లో ఉంది. తహశీల్దారులు డ్యూటీప్రకారం సభలు జరుపుతున్నారు. కాని, 'వార్లీ'లు హాజరైతేగా?

ఇంతేకాదు, అరెస్టు చేయబడిన 'వార్లీ'లను జామీనుపై విడుదల చేయడానికి పూచీకత్తులకు హెచ్చుమొత్తాలు అడుగుతున్నారు. అందరినీ వరుసగా, ప్రతిరోజూ విచారణచేసి శిక్షలు చెప్పవలసిందని ఉత్తరువులు జారీచేయబడ్డాయి. ముద్దాయిలకు సరియైన డిఫెన్సు అవకాశాలు లభించకుండా చూడ్డమే దీని ఉద్దేశం.

నిర్బంధంలో ఉన్నవారిని విడుదల చేయాలంటే, వారొక హామీపత్రంమీద సంతకం పెట్టాలి. అందులో ఎర్రజండా నాయకత్వం క్రింద ఎట్టి ఆందోళనలోనూ పాల్గొననని వాగ్దానంచేయాలి.

ఇదికూడా గూండా చట్టం ప్రకారమే జరిగింది.

డిసెంబరు 1 వ తేదీని మరో యిద్దరిని ప్రభుత్వం జిల్లానుంచి వెళ్లగొట్టింది. వారిలో ఒక స్త్రీ కూడా ఉంది.

250 మంది పోలీసుల కాపలా

ఈ ప్రాంతంలో డిసెంబరు 1 నుంచి 250 మంది పోలీసులు, 25 గురు సబ్‌ఇన్‌స్పెక్టర్లు కాపలాగా నియమింపబడ్డారు. వీరు ఎల్లప్పుడూ గస్తీ తిరుగుతూ ఉంటారు. ఇంతవరకు మొత్తం 50 మంది 'వార్లీ'లను అరెస్టు చేశారు.

బొంబాయి ప్రభుత్వం షాహుకార్ల ఒత్తిడికి లొంగి ఈ పనులన్నీ చేస్తూన్నవిషయం స్పష్టం. న్యాయసమ్మతమైన ఈ పోరాటాన్ని నిర్బంధవిధానం వల్ల అణచడం అసాధ్యమనే విషయం స్వానుభవం వల్ల తెలుసుకొని కూడా ప్రభుత్వం ప్రజలపై యిలా విరుచుకుపడ్డం ఆశ్చర్యంగా ఉంది. ఆ గుణపాఠాన్ని 70,000 మంది 'వార్లీ' రైతులు మరొకసారి జ్ఞాపకం చేయడానికి సిద్ధమవుతున్నారు. (మిగతా 14 వ పేజీలో)

ఏజన్సీ ప్రాంతంలో సహజ సంపద నభివృద్ధిపర్చాలి

ప్రజలకు విజ్ఞానం కలుగజేయాలి

సత్తిరాజు రామచంద్రరావు

అల్లూరి సీతారామరాజు తిరుగుబాటు విఫలమయిన వెంటనే కాంగ్రెస్ లేవదీసిన ఉద్యమాలలో ఏజన్సీ ప్రజలు పాల్గొంటారను భయంవల్ల ప్రభుత్వం తిరుగుబాటుకు సహాయం చేసిన కోయ నాయకులను అరెస్టు చేయడం, కొత్తశాసనాలు, చట్టాలు ఏజన్సీ ప్రజలపై రుద్దడం చేశారు. అవే ఫారెస్టు చట్టంలని, మాపుల సర్దారని, పుల్లరి అని, అటవీ ఫలసాయం తెచ్చుకొనకుండా పుల్లని ఇంకా యెన్నెన్నో నిర్బంధాలు పెట్టారు. ఈ విధంగా ప్రభుత్వం ఏజన్సీ ప్రజలను దోచుకోవడమే కాకుండా, సామ్రాజ్యవాదుల తొత్తులైన జమీందార్లు, ప్రొప్రయిటర్లు, ఇన్ఫీరియర్ ప్రొప్రయిటర్లు అని అనేక విధాలుగా మనుష్యులను సృష్టించి, కోయ ప్రజలను దోపిడీ చేయించ నిశ్చయించారు.

ప్రొప్రయిటర్ల అక్రమాలు

ఏ కోయమనిషైనా భూమిని కౌలుకు పుచ్చుకోడానికి వస్తే, అతను ప్రొప్రయిటర్‌కు ఒక బానిస అన్నమాట. సంవత్సరానికి కొన్ని కోళ్ళను ఇయ్యాలి. అతని కుటుంబం అంతా ఎనిమిది వెట్టిచేయాలి. పండుగ రోజులలో గాని, షష్టి రోజు గాని, శుభకార్యాల సమయంలోగాని ఏ అడవి పందినో లేడినో కొట్టుకొనివచ్చి, యజమానికి యివ్వాలి. ఇతడు ఒక రాజులా ప్రవర్తిస్తూ యుంటాడు. కౌలుచెల్లించే కాకుండా, ఒకబస్తా విత్తనాలు యిస్తే రెండుబస్తాలుగాని, మూడుబస్తాలుగాని ధాన్యం భూమి పండినా పండకపోయినా భూకామందుకు ఇచ్చుకోవాలి. ఒక్కొక్కప్పుడు ప్రొప్రయిటర్ రైతును తంతూయుండడం మొదలైనవి జరుగుతూ యున్నాయి. ఒక్క నమ్మిడికూడ ఇయ్యకుండానే రైతు తనకు అప్పుగా ఉన్నాడని చెప్పి వేలుముద్రలు వేయించి, సొమ్మును గాని, భూమినిగాని, ఇంటినిగాని లాక్కోవడం జరుగుతుంది. ఈ బాధలే కాకుండా గవర్నమెంటు ఆఫీసర్లు పెట్టే కష్టాలు వారికి లంచాలు అనేకం ఉన్నాయి. మన్నవు కరణాలు వాళ్ళ భూములను కాజేసి, భూకామందులై కూర్చోవడం యిప్పటికి జరుగుతూ యున్న విషయం. యీవిధంగా కోయరైతు బాధపడుతూయున్నాడు.

"గోదావరిప్రాంతపు ఏజన్సీ - విశాఖ ఏజన్సీ - ఒరిస్సాలోని కొంతభాగంలోని ఏజన్సీ కలిసి బియాన్ కూరుకు మూడురెట్లు" అని శ్రీ సొంఠి రామమూర్తి పంతులుగారు ఏజన్సీ అభివృద్ధి గురించి మాట్లాడుతూ ఒకసారి అన్నారు. ఇంతభూభాగం ఒకమూలకు త్రోసివేయబడినప్పుడు, వ్యవసాయానికి పారిశ్రామికాభివృద్ధికి ఉపయోగపడనప్పుడు, ఆంధ్రులకు తగినంత తిండి, బట్ట ఎక్కడ్నుంచి వస్తుంది? ఆంధ్రులు పొట్టకూటికి బర్మా మొదలైన దేశాలకు వెళ్ళుచున్నారంటే, ఆశ్చర్యపడవలసిన అవసరం ఏమున్నది? కాబట్టి, ఏజన్సీ ప్రాంతపు సహజ సంపదను అభివృద్ధిపరచడం, ప్రజలకు జీవనాధారం కలుగజేయడం, ప్రభుత్వ కర్తవ్యం.

యుద్ధకాలంలో

తూర్పుగోదావరిజిల్లాలోని ఏజన్సీ ప్రజలు యుద్ధంరావడం మూలంగాను, మన్యం ప్రాంతాలు కాని దిగువ ప్రాంతాలలో అన్ని వస్తువుల ధరలు పెరిగిపోవడంవల్లను ఒక సరుకు కూడ కొనలేరు. పూర్వపు అడవి మనుష్యుల జీవితం గడపవలసి వచ్చింది. దిగువనుండే వర్తకులు సరుకులను దాచివేయడంవల్ల, ఏజన్సీకి న్యాయంగా రావలసిన సరుకు కూడా అక్కడకు చేరేదికాదు. మందులుగాని, జీవితావసర సరుకులుగాని లేకుండా పోయేవి. అంటురోగాలు కూడా వ్యాపించాయి. వర్తకులకు బియ్యం వారు నిర్ణయించిన తక్కువ ధరలకే అమ్మేవారు. అడిగేదాత లేకపోయారు.

యుద్ధం తరువాత స్థితిగతులు

యుద్ధం అయిపోయింది. కరువు పోతుం దనుకున్నారు ప్రజలు. కాని, యథాప్రకారంగానే సరుకులు అమ్మడం జరుగుతోంది. యుద్ధం అయిపోయిన తరువాత బియ్యం కూడ కొరత వచ్చాయి. దిగువ ప్రాంతాల నుండి రావలసిన బియ్యం రేషనింగ్ ప్రవేశపెట్టిన తరువాత రాజమండ్రి నుండి వచ్చేది కాదు. కో. ఆపరేటివ్ స్టోర్సు వారు డబ్బు చెల్లించనందున కొన్ని గ్రామాలలో 2 నెలల వరకు బియ్యం లేకపోయాయి. ఏ అడవి దుంపలో తిని బ్రతకవలసిన పరిస్థితి ఏర్పడింది కాని, యీ కోయలు, చెంచులు, రెల్లు అడవి పండ్లుగాని, దుంపలుగాని తినాలి అంటే ఫారెస్టు ఆఫీసర్లను అడగాలి. ఆఫీసర్లు లంచం యిస్తేగాని తినడానికి పండ్లు, గుంపలను యివ్వరు. లంచానికి డబ్బులేదు. పని ఉంటేగాని డబ్బురాదు. ఇంకేమిచేస్తారు? తిండిలేక మాడిచస్తూయున్నారు. పంటలు పండని ఏజన్సీప్రాంతంలో ఏజన్సీ ప్రజలకు ఆహారం ఎట్లాదొరుకుతుంది?

రేషన్ ఏజన్సీకిలేనందున రేషన్ కార్డులు లేవు. రేషన్‌కార్డులు లేనందున కోయప్రజలకు తిండి, బట్ట దొరకుటలేదు. ఈ విధంగా కరువు ఏర్పడింది.

ఏజన్సీ అభివృద్ధికి పాటుపడండి

3676 చ॥ మైళ్ళలోని 60,571 మంది (పూర్వం జనాభాప్రకారం) జనాభాకలిగిన 1114 గ్రామాలు నాశనం అవుతోవూ ఉండడము ఆంధ్రులము చూస్తూ ఊరుకొంటామా?

తిండిలేని కోయప్రజలకు తిండి కలుగచెయ్యాలంటే, పారిశ్రామికంగా వ్యవసాయకంగా, రాజకీయంగా యీ ప్రాంతాన్ని అభివృద్ధిచేయాలి. కోయలకు విజ్ఞానం కలుగజేయాలి. వారికష్టాలను తీర్చడానికి ప్రయత్నించాలి. ఎన్నేళ్ళకీ ప్రభుత్వం వీరిని గురించి ఏమీ ఆలోచించలేదు. కాంగ్రెసు మంత్రులు యీ క్రిందికోర్కెలను నెరవేర్చాలని కోరుచున్నాను.

1. జమీందారీ ప్రొప్రయిటర్లను తీసివేయాలి. జమీలను జీవరైతులకు పంచాలి. బాగా లాభాలు గడించిన జమీలను తీసుకోవాలి. శనివారప్పేటరాజా శ్రీ విజయ అప్పారావు జమీందారుని భూమి ఆదాయం 1937 లో రు. 43000 లు. అప్పుడు పేష్కస్ రు 26712 లు. ఇప్పుడు పేష్కస్ అంతేగాని ఆదాయం పెరిగింది. ఆ జమీందారుకు మూడు జమీలు ఉన్నాయి. (1) శనివారప్పేట, (2) పాలవంచ, (3) భద్రాచలం ఎస్టేట్లు. ఎట్టి నష్టపరిహారం లేకుండా ఈ జమీని లాక్కోవాలి. 21 లక్షల ఎకరాలభూమిని పంటభూమిగా చేసే పోలవరం ప్రాజక్టును వెంటనే నిర్మించాలి.

ఖనిజసంపదను అభివృద్ధిపర్చాలి

2. ఏజన్సీ అడవులలో దొరికే ఖనిజ పదార్థాలను పైకి తీయించి కిరలను ప్రచందనం (సిసర్పినా కుకైరా) కాయలు వగైరా పైకితీసి అభివృద్ధిపర్చాలి. ప్రాక్తైల, వజ్రములు (యిప్పుడు గోదావరి నదీ ప్రవాహంలో నుండి బంగారం, రేణువులుగా వచ్చుచుండును.) నేలబొగ్గు, కోవలిన్, మినరల్ వాటర్, కట్టడపురాళ్ళు మొదలైనవి, గాజు పరిశ్రమకు కావలసిన మేలురకం యిసుక, సోడాయాష్, సున్నపురాళ్ళు వగైరా దొరుకును. కాబట్టి వెంటనే ఈ ప్రాంతంలో పరిశ్రమలను అభివృద్ధిపర్చాలి.

ఎరువుల ఫ్యాక్టరీని ఏర్పరచాలి

3. ఏజన్సీ ప్రాంతంలోని అంపాకాలపల్లి భూమిని సారవంతం చేయడమే కాకుండా నత్రజనిని స్వీకరించి ఎరువులను యంత్ర సహాయంతో తయారుచేస్తే, ఆంధ్ర రైతాంగానికి చాలా ఉపయోగం.

కరువుకాటకాలనుండి ప్రజలను రక్షించాలంటే, ఎరువులను అభివృద్ధిచేయాలి. దీనికిగాను ఎరువుల ఫాక్టరీలను నిర్మించాలి.

రహదార్లను అభివృద్ధిపరచాలి

4. పైవిధంగా ఏజన్సీని అభివృద్ధిపర్చాలంటే, రహదార్లను బాగుచేయడం, క్రొత్త రహదార్లను వేయడం అవసరం. రైలురోడ్లు నిర్మిస్తే ఏజన్సీలోని కలపను, పరిశ్రమలను వ్యవసాయాన్ని హెచ్చుచేయవచ్చును. పోలవరంలో రామపాదసాగరం ప్రాజెక్టును నిర్మిస్తే, దానివల్ల విద్యుచ్ఛక్తిని ఉత్పత్తిచేసి యంత్రాలను నడిపి ప్రజలకు కావలసిన జీవితావసర సరుకులను విరివిగా ప్రజలకు అందజేయవచ్చును. ఫారెస్టు చట్టాన్ని మార్చడం, లంచాలు, దోపిడీలేకుండా చేయడం జరిగితే ఏజన్సీ ప్రజలు సుఖపడతారు.

కాంగ్రెసు మంత్రివర్గం యిందుకు కృషి చేయాలని కోరుతున్నాము.

(13 వ పేజీ తరువాయి)

వారిచే బలవంతంగా షాహుకార్లకు ఊడిగం చేయించే ప్రయత్నాలు విఫలమవుతున్నాయి. షాహుకార్లకు కష్టాలు కొట్టడం ఇప్పుడు పూర్తిగా మానివేశారు. రాయతలీ, దాంకోల్ అనే రెండు గ్రామాల్లో పోలీసులు 55 గురిని అరెస్టుచేస్తే, మిగతా గ్రామస్థులంతాచేరి వారి పొలాల్లో ఉచితంగా కోతలు కోసి సహాయం చేశారు. ప్రభుత్వ నిర్బంధ విధానానికి వారు చెప్పిన జవాబు ఇది.

బొంబాయి ప్రభుత్వం ఇప్పుడైనా యదార్థ పరిస్థితిని గుర్తించకపోతే, ఇప్పుడైనా రైతు సంఘ నాయకుల్ని విడుదలచేసి నిర్బంధ విధాన్ని ఆపుచేయకపోతే, 70,000 మంది 'వార్లీ'లు మరొకసారి షాహుకార్లను ఉక్కిరిబిక్కిరి చేయడానికి సిద్ధంగా ఉన్నారు.

— పీపుల్స్ ఏజ్ నుంచి

ఎన్. ఎం. జోషి ఖండన

కేంద్రశాసన సభ్యులైన ఎన్. ఎం. జోషి క్రిందివిధంగా ప్రకటిస్తున్నారు.

"గూండాచట్టం ప్రకారం, ఎక్కడైనా హిందూ–ముస్లిం కొట్లాటలు, దౌర్జన్యాలు జరిగినప్పుడు మాత్రమే, ప్రభుత్వం అసాధారణ పరిస్థితులున్నాయని ప్రకటించడం, చట్టంప్రకారం చర్యతీసుకోవడం, అవసరమవుతుంది. కాని, "వార్లీ" రైతులు షాహుకార్లమీద న్యాయమైన కూలిరేటుకోసం జరిపే యీపోరాటాన్ని గూండాచట్టం క్రింద అణచ పూనుకోవడం అధికార దుర్వినియోగమనిపించుకొంటుంది. ఈచట్టాన్ని రాజకీయపార్టీలపైగాని, సంఘసంస్కర్తలపైగాని ప్రయోగించము అని మొరార్జీదేశాయి (పోలీసు శాఖ మంత్రి) హామీఇచ్చారు. అమాయక ప్రజల్ని చంపడానికి, భయపెట్టడానికి కత్తిని ఉపయోగించే రౌడీలమీద మాత్రమే దీన్ని ప్రయోగిస్తాం అన్నారు. కాని, చట్టం ప్యాసయిన తర్వాత, ప్రజాపోరాటాన్ని అణచడం కోసం, ప్రజానాయకుల్ని నిర్బంధించడం కోసం, ఈచట్టం ఉపయోగింపబడుతూంది. మాజీ ఎం. ఎల్. ఏ. పరులేకర్‌గారిని, ఎం.ఏ. ప్యాసైన శ్రీమతి సుశీలా గోఖలేగారిని, బెమడోర్బి కిష్టపదే "వార్లీ" రైతాంగంగాని, గూండాలని ఎవరైనా చెప్పసాహించ గలరా?"

ఖాదీస్కీముపల్ల వడికేవారికిగాని, నేసేవారికిగాని ధరించేవారికిగాని లాభంలేదు!

గుంటూరుజిల్లా చేనేతపారిశ్రామికుల మహాసభలో ప్రసంగాలు

కొత్తనూలుమిల్లులు స్థాపించాలని 10 వేలమంది ప్రజా వాంఛ

సత్తెనపల్లి పురవీధులలో నవంబరు 29 న "ఖాదీస్కీముపద్దు, దొంగమార్కెట్లు నరికట్టాలి, నూలు మిల్లులను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి, నూలుకోటా హెచ్చించాలి" అంటూ దిక్కులు పిక్కటిల్లేటట్లు నినాదాలు వినపడుతూవున్నాయి. రాష్ట్ర చేనేత నాయకులు పుత్సల సత్యనారాయణ, కస్తూరి కుటుంబరావుగార్లు, గుంటూరు జిల్లా చేనేతసంఘ అధ్యక్షులు దొంతు నాగయ్యగారు, రాష్ట్ర వ్యవసాయకూలీ సంఘ ధ్యక్షులు కాకోతు రామస్వామిగారు, ఆసీనులైవున్న బండి ఊరేగింపులో ఉన్నది. రెండువేలమంది చేనేత కార్మికులు, రెండువందలమంది స్త్రీలు యెర్రజెండాలు రెపరెపలాడుతూంటగా అత్యుత్సాహముతో ఊరేగింపులో పాల్గొన్నారు.

ఊరేగింపు "చేనేత నగరు" సమీపించేటప్పటికి "సింగారువేలు గేటు" కనపించింది. చేనేత కామ్రేడ్ డి. వీరయ్యచే చిత్రింపబడిన కామ్రేడ్ సింగారువేలు మృతశరీరం యొక్క చిత్రము, దానిపైన యెర్రనక్షత్రము అండా చూచేటప్పటికి సింగారువేలు యెర్రజెండా రక్షణకై యెలా ప్రాణం వదిలాడో కంటికి కట్టినట్లయినది. ఊరేగింపులోవున్న చేనేత కార్మికులు వుత్సాహముతో పుప్పొంగిరి.

కామ్రేడ్ బండ్ల గరటయ్యగారు యెర్రజెండా ప్రతిష్ఠాపనచేస్తూ సింగారవేలు జండా రక్షణకొరకు యెలా త్యాగం చేశాడో దానిని ఆదర్శముగా వుంచుకొని చేనేత కార్మికులు యితర కార్మికుల సహకారంతో ఆ జండా క్రింద తమ సమస్యలు పరిష్కరించుకోవాలని ఉపన్యసించారు.

10 వేల మంది ప్రజాసమూహం

మహాసభకై ఏర్పాటుచేసిన సభాస్థలం 10 వేలమంది ప్రజలతో క్రిక్కిరిసిపోయింది. ఆహ్వాన సంఘాధ్యక్షులు తిరుపతి జ్ఞాన సుందరంగారు పెద్దలను, ప్రేక్షకులను ఆహ్వానిస్తూ వుపన్యసించారు.

విచ్ఛిన్నకుల చర్యల నరికట్టాలి

రాష్ట్ర కమ్యూనిస్టు నాయకులు కామ్రేడ్ మాకినేని బసవపున్నయ్యగారు సభను ప్రారంభిస్తూ ఇలా ఉపన్యసించారు.

"బ్రిటిషు ప్రభుత్వం కాంగ్రెసు, లీగుల మధ్య విభేదాలు కలిగిస్తూ తాను స్థిరంగా ఉండే యత్నం చేస్తూన్నది. ఆజాద్ హింద్ ఫౌజ్ విషయంలోను, నావికుల తిరుగుబాటు విషయంలోను, దేశంలో హిందూ-మహమ్మదీయులు ప్రదర్శించిన ఐక్యతను మరచి కాంగ్రెసు, లీగునాయకులు బ్రిటిషు ప్రభుత్వపు యెత్తుగడల్లో పడ్డారు. దేశంఅంత ద్యుద్ధంపాలైంది. కాంగ్రెసు లీగులు రాజకీయ ఒడంబడిక చేసుకుంటేగాని తాత్కాలిక ప్రభుత్వమువల్లగాని, రాజ్యాంగ నిర్మాణసభ వల్లగాని ప్రయోజనము కలుగదు.

"వివిధ ప్రజాపోరాటాలు, సంస్థానప్రజా పోరాటాలు యెలా స్వాతంత్ర్య దీక్షను తెలియజేస్తున్నాయో అంతా గమనించాలి."

ఈ రాజకీయ పరిస్థితులను చేనేత కార్మికులు గమనిస్తూ తాముకూడా దేశ స్వాతంత్ర్యమునకు కృషిచేయాలనీ, విచ్ఛిన్నకుల చర్యలను అరికట్టి, ఐక్యకృషితో తమ సమస్యలను పరిష్కరించుకోవాలనీ అన్నారు.

ఖాదీస్కీమువల్ల యెవరికీ లాభము లేదు

అధ్యక్షులు కామ్రేడ్ పుత్సల సత్యనారాయణగారు ఇలా ఉపన్యసించారు:

"అఖిలభారత చరఖా సంఘంవారు గడచిన సంవత్సరములో లక్షరాటాలకు 34 లక్షల రూపాయలు వడకుకూలి ద్వారా యిచ్చారు. అంటే సంవత్సరానికి ఒక రాటానికి 34 రూపాయలు యిచ్చారు. నెలకు 3 రూపాయలైనా పడలేదు. రాటం వడికేవారి ఆదాయం యిలావుంది!

"యీదేశములోని ఒక్కొక్క వ్యక్తికి మిల్లుగుడ్డ 10 గ. 2 అ. కి అం. యున్నూ చేనేతబట్ట 5 గ. యున్నూ, ఇద్దరు కి అం. మున్నూ పంచితే వస్తుంది. మిల్లునూలుకు రోజుకు చేమగ్గంమీద 6, లేక 7 గజాలు నేస్తే ఇద్దరు 3 గజాలకంటె హెచ్చునేయలేము. అంచేత రాష్ట్రప్రభుత్వముయొక్క ఖాదీస్కీమువల్ల వడికేవారికిగాని, నేసేవారికిగాని, ధరించేవారికిగాని ప్రయోజనంకలగదు. మిల్లుల్లో తయారయ్యే నూలును దొంగ మార్కెట్టులోకి పోకుండా, పంపకంలోనికి తెచ్చేందుకు ప్రభుత్వము పూనుకోవాలి.

"చేనేతకాంగ్రెసు వారు ఖాదీస్కీమును బలపరుస్తూ మరకదుళ్ళను, యంత్రాభివృద్ధిని నిరోధిస్తున్నారు. చేమగ్గమునుండి మరమగ్గంలోనికి మార్పువచ్చినప్పుడు కొందరు అంగీకరించరు వ్యతిరేకించారు. యిప్పుడు మనమగ్గంలోనుండి పవరుమగ్గంలోనికి పోదామంటే ప్రగడకోటయ్య ప్రభృతులు అటంకపెట్టుతున్నారు. ప్రజలు మెత్తనిబట్ట, చౌకబట్ట కావాలంటున్నారు. కాని కోటయ్య హెచ్చు ఖరీదుగల ఖద్దరుకుయిస్తాను గోచీలు పెట్టుకోమంటున్నాడు. చేనేత కార్మికులను పారిశ్రామికంగాను ఆర్థికంగాను యింతకంటె అభివృద్ధి కావద్దంటున్నాడు. రైల్వేలు, యింకా యితరపరిశ్రమలు ప్రజల సౌకర్యం కొరకు యేర్పడ్డాయి. అలాగే నేతపరిశ్రమలోకూడ మనం ప్రజలకొరకే బట్టను తయారుచేయాలి. అలాచేస్తేనే ప్రజలు మనకు నిరుద్యోగం లేకుండా రక్షణ కలిగిస్తారు."

కస్తూరి కుటుంబరావు, కాకోతు రామస్వామి, దొంతునాగయ్య వావిలాల గోపాలకృష్ణయ్యగార్లుకూడా చేనేతవారి వివిధసమస్యలను గురించి వుపన్యసించారు.

జిల్లాలోని యెనిమిది తాలూకాలనుండి 84 మంది ప్రతినిధులు మహాసభకు వచ్చారు. 9 గంటలకాలం ప్రతినిధుల సమావేశం జరిగింది.

కార్యదర్శి రిపోర్టు

బండ్ల గరటయ్యగారు కార్యదర్శి రిపోర్టులో యీక్రింది విషయములు తెలియజేసారు.

6 తాలూకాల్లో తాలూకాసంఘాలు, వందలకొంది గ్రామసంఘాలు, యేర్పడి సుమారు 12 వేలవరకు సభ్యత్వం చేర్చబడింది. జిల్లాసంఘ ఆఫీసు ఉద్యమానికి కేంద్రముగా వుండి నిర్మాణయుతంగా పనిచేస్తూన్నది.

నూలు కరువువారంలో రేపల్లె, బాపట్ల, సత్తెనపల్లి, ఒంగోలుతాలూకాల్లో ప్రచారంబాగా జరిగింది. కలెక్టరు, కంట్రోలు ఆఫీసరు వద్దకు 15 వందల మందితో డిప్యుటేషను వెళ్ళి మెమోరాండం యిచ్చాం.

ప్రతి నెలా కంట్రోలు ఆఫీసరు నూలు కోటాలు పంచగానే ఆలెక్కలను తీసుకొని జిల్లాలోని స్థానిక అర్హులైనవారికి యే వెంబడి కార్డుకు యెంతనూలు యిస్తూన్నది తెలియజేస్తున్నాము. ఈ సంఘపక్షాన అనేకమంది చేనేత పారిశ్రామికులలో పేచీలు పెట్టుతున్న మాస్టరు వీవర్లనుండి కార్డులు, నూలువర్తకులనుండి నూలు, యిప్పించాం.

క్రొత్త మగ్గాలకు కార్డులు యిప్పిస్తానని నరసరావుపేట తాలూకా చేనేత కాంగ్రెసు అధ్యక్షులు గుర్రంటి వెంకటేశ్వర్లు 22 మంది చేనేతవారినుండి డబ్బు తీసుకున్నారు. వేదపాలెం చేనేత కాంగ్రెసు కార్యదర్శి గాత్రం కోటయ్య, వనుమర్తిగ్రామ చేనేతవారు నడుగురికి డీలరుచే నూలు యివ్వకుండాచేసి వారినుండి నలుబదిరూపాయలు లంచం తీసుకున్నారు. తెనాలితాలూకా చేనేత కాంగ్రెసు అధ్యక్షులు శాడివర్తి శివయ్య (మాస్టరు వీవరు) ఒక చేనేత పారిశ్రామికుని కార్డును తనవద్ద వుంచుకొని వచ్చిన నూలుతో 70 లడ్డీలు హరించాడు. దానిని టి. సి. ఓ. కు తెలియజేసి జిల్లాసంఘం పక్షాన ఆనేతవానికి నూలు ఇప్పించాం. రేపల్లెతాలూకా చేనేత కాంగ్రెసు అధ్యక్షుడు అకురాతి లక్ష్మయ్య భట్టిప్రోలు గ్రామసొసైటీకి అధ్యక్షులుగా వుండి రు 7 వేల వరకు నష్టపరచడం చేత ఆ సొసైటీవారు అతనను అస్థానమునుండి

మా విలేఖరి

తొలగించారని, గుంటూరుజిల్లా చేనేత కాంగ్రెసు అధ్యక్షుడు అకురాతి రంగనాయకులు గుంటూరు తాలూకా తాడికొండలో చేనేతవారికి బంజరు భూమి యిప్పిస్తానని 14 వందల రూపాయలు తీసుకొని వారికి భూమి యిప్పించలేదని ఆధారపూర్వకమైన రిపోర్టులు జిల్లాసంఘ ఆఫీసుకు వచ్చాయి.

వీరేగాక నిమ్మకాశి చేనేత సోదరులను మంగళగిరి పరస్తుదాసు, దారా రామస్వామి గంటెల కొరయ్యలుకూడా మోసంచేసిడబ్బు తీసుకున్నట్లురిపోర్టులువచ్చాయని చెప్పినారు.

తీర్మానాలు

1. నైజాం, నావిక, కార్మిక, రైతు మొదలైన వర్గాలలో బ్రిటిషు సామ్రాజ్య వ్యతిరేకత తీవ్రంగా ఏర్పడింది. సంస్థాన ప్రజా వుద్యమాలు తీవ్ర రూపానికి వచ్చాయి. కాంగ్రెస్, లీగులు ఈ ప్రజా చైతన్యాన్ని గమనించాలి. మత కలహాలను రూపుమాపాలి. జాతుల స్వయంనిర్ణయ హక్కును గుర్తిస్తూ ఐక్యతతో బ్రిటిషు సామ్రాజ్య వాదాన్ని యెదిరించాలి. పరిశ్రమలను, వ్యవసాయాన్ని ప్రజా పరంచేసి, నిరుద్యోగం పోగొట్టి, ప్రజలకు తిండి, బట్ట దొరికేట్లు రాజకీయపార్టీలు పనిచేయాలి.

2. కాశ్మీరు, తిరువాన్కూరు, హైదరాబాదు సంస్థానాల్లోని నిరంకుశ నిర్బంధ విధానాన్ని, రాక్షస చర్యలను తీవ్రంగా నిరసిస్తూ ప్రజాపోరాటాలను బలపరచడమైంది.

3. చట్టసమ్మతమైన కార్మికుల హక్కులను మిల్లుయజమానులు భగ్నం చేస్తున్నారు. మిల్లు యజమానులు దొంగవ్యాపారముచేస్తున్నట్లు ప్రధాని అంగీకరించాడు కూడా. అదికోత్పత్తి కొరకు మిల్లుల్లో పక్కమంగా కార్మికులు పనిచేస్తామని వస్తూన్నప్పటికి, యజమానులు మిల్లు గేట్లను మూసివేస్తున్నారు. ఈ అన్యాయంనుండి కార్మికులను కాపాడుటకు బదులు ప్రభుత్వం మిల్లు యజమానులను బలపరుస్తూ కోయంబత్తూరు మొదలైనచోట్ల కార్మికులపై కాల్పులు జరపటాన్ని ఖండించడమైంది.

4. నైజాం ప్రభుత్వం ప్రజోద్యమాన్ని ప్రోత్సహిస్తున్న "ప్రజాశక్తి" "పీపుల్సు ఏజ్" "నయా జమానా" పత్రికలను నిషేధించినందుకు ఆ ప్రభుత్వచర్యను తీవ్రంగా ఖండించడమైంది.

5. రాష్ట్రములోని నూలు మిల్లులలో నెలకు 66 వేల బేళ్ళ నూలు వుత్పత్తి అవుతూయున్నట్లు తెలుస్తున్నది. మిల్లు యజమానులు ప్రభుత్వానికి తప్పుడులెక్కలు చెప్పి దొంగవ్యాపారం సాగిస్తున్నారు. అందుచేత ప్రభుత్వం వెంటనే ఉక్సుపైర్ కార్మికులతో కూడిన ఉత్పత్తి కమిటీలను వెయ్యాలి. ప్రభుత్వం మిల్లులను స్వాధీనము చేసుకోవాలి.

6. ప్రజలు, పత్రికలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్న ఖాదీస్కీమును ప్రభుత్వం విరమించుకోవాలని, మరకదుళ్ళను దిగుమతి చేయించాలని, క్రొత్త నూలుమిల్లులను ఆంధ్రలో పెట్టాలని కోరడమైంది.

7. రాష్ట్రనూలు సలహాకమిటీలో చెన్నరాష్ట్ర చేనేత కాంగ్రెసుకు, కర్నూరు చేనేత కాంగ్రెసుకు నాలుగు స్థానాలుయిచ్చి తమిళనాడు ఫెడరేషనుకు, ఆంధ్రరాష్ట్ర చేనేత సంఘానికి కలిసి ఒక్కటేస్థానం యివ్వడం మిక్కిలి అన్యాయం. ప్రభుత్వం పునరాలోచించి, నాలుగు సంఘాలకూ సమానప్రాతినిధ్యం యేర్పరచాలి.

8. బట్టలమీద నెట్ కమిటీలలో నామినేషన్ విధానం ప్రవేశపెట్టడం కాంగ్రెసు ప్రతిష్ఠకే భంగకరమని, మంత్రివర్గానికి తెలియజేస్తూ ఆ కమిటీల్లో చేనేత సంఘాల ప్రతినిధులను చేర్చుకొనేటట్లు ఉత్తరువు చేయుమని కోరడమైంది.

9. రంగునూలు పంపకములో అనేక టికమకలు కలుగుతూ, సమానపంపకం జరగడంలేదు. కాబట్టి రంగునూలు సప్లయిని ఆపివేసి తెల్లనూలునే యివ్వాలి.

10. తెనాలి చేనేతవారి బిల్డింగుసొసైటికి ప్రావిన్షియల్ రిజిస్ట్రారుద్వారా కోరిన రు 60800 లను ప్రభుత్వం వెంటనే మంజూరుచెయ్యాలి.

11. సత్తెనపల్లి తాలూకాలోని వెయ్యి నవారుమగ్గాలకు నూలు సప్లయిచేయమని, కంట్రోలు ఆఫీసరును కోరటమైంది.

12. జిల్లాలో క్రొత్తగా ఏర్పరచిన 25 సొసైటీలను వెంటనే రిజిష్టరు చేయాలని కోఆపరేటివు డిప్యూటీ రిజిష్ట్రారును కోరడమైంది.

13. యీ జిల్లాలోని సొసైటీలసంఖ్య సుమారు 60 వరకు అభివృద్ధి అయింది. కాబట్టి ప్రత్యేకంగా వీవర్సుసొసైటీలకు ఒక రిజిష్ట్రారును నియమించమని ప్రభుత్వాన్ని కోరడమైంది.

14. ప్రొవిన్షియల్ వీవర్సు కోఆపరేటివ్ సొసైటీకి సంబంధించిన 14 వ నెం. బైలా సవరణ రెండు వ్యాయములు జనరల్ బాడీలో యెక్కువ మెజారిటీతో అంగీకరింపబడినప్పటికి రంగా పక్షంవారి వత్తుబడిలో వున్న మంత్రివర్గం — మిగతా 16 పేజీలో

రైళ్లను వేగంగా నడుపుటలో ఆటంకాలు

రనింగ్ స్టాఫ్‌కు కూడ వారానికి 48 గంటల పని ఉండాలి

ప్రస్తుతం గూడ్సు ట్రైన్ల రాకపోకలలో గంటలతరబడి డిటెన్షన్లు వుంటున్నాయి. ప్యాసింజరు ట్రైన్సులో సహితం స్టేషన్లలో అక్కడక్కడ డిటెన్షన్లు సంభవించటం, ప్రయాణీకులు అమిత యాతన ననుభవించటం చూస్తున్నాం.

ట్రైన్లను నడిపే రనింగుస్టాఫ్ (డ్రైవర్లు, ఫైరుమన్లు, గార్డులు) బిట్రగుంటనుంచి ట్రైన్సును నడుపుకుంటూ యిటు బెజవాడకు గాని, అటు మద్రాసుకుగాని చేరేటప్పటికి 18 గంటలు,20 గంటలకాలం కూడా తీసుకుంటూవుంది. దీనికి ముఖ్యకారణం డిటెన్షన్లే. కోట్లకొలది లాభాలు మూటకట్టుకునేందుకు కార్మికుల చాకిరిని అమితంగా పిండుతునే రైల్వేబోర్డువారు పని గంటల నియామకం (Hours of employment regulation) ను రనింగ్‌స్టాఫ్‌కు వర్తింప చేయటంలేదు. దీని ఫలితంగా రనింగుస్టాఫ్ పనివారాల సంఖ్యను వృద్ధిచేయ తప్పించుకోగల్గుతున్నారు.

పనిచేయుకాలం అధికమగుటవలన అనేక అవస్థలు పడుతున్న రనింగ్‌స్టాఫ్ ట్రైన్ డిటెన్షన్ల నిర్మూలనకై రైల్వే అధికారుల ముందు కొన్ని సూచనలు చేస్తున్నారు. మరొకవైపు రైల్వేమన్స్ ఫెడరేషన్ వారానికి 48 గంటలపనినే రనింగ్ స్టాఫ్‌చేత కూడా చేయించుకోవలసినదని పోరాడుతున్నది.

పని గంటలను గురించి విచారణ సల్పి ఒక నిర్ణయానికి వచ్చుటకుగాను ప్రభుత్వం నియమించిన అడ్జుడికేటరు (పరిష్కారకర్త) ముందు "రైల్వేమన్స్ ఫెడరేషన్ చూపెడుతున్న ఎక్కువ గంటలపని రనింగుస్టాఫ్‌కు లేనేలేదనీ, రోజుకు 9, 10 గంటలకంటె వారు ఎక్కువపని చేయటంలే"దని రుజువు చేసుకునేందుకు ఎం. ఎస్. ఎం. రైల్వే అధికారులు ఒక యుగంధరప్లాను వన్నారు.

రైల్వే అధికారుల రేషనలైజేషన్ స్కీము

ఏమిటా ప్లాను: ఒకటి: బండ్ల స్పీడును హెచ్చుచేయటం. రెండు: గూడ్సు ట్రైన్ల యొక్క వాగెన్లసంఖ్యను 62 నుంచి 50 కి తగ్గించటం. మూడు: ఈ వాగెన్లలో నింపు సరుకుల టన్నేజిని 1800 నుంచి 1300 కు తగ్గించటం.

ఈ ప్లానును అమలు జరపడంద్వారా, రనింగు స్టాఫుకు యెక్కువ గంటలపని లేకుండా చేయవచ్చుననీ, గూడ్సు ట్రైన్ల ట్రాఫిక్ యెక్కువ చేయవచ్చుననీ రైల్వే అధికారుల వాదన. ఇదే, రైల్వేఅధికార్లు ప్రవేశపెట్టిన రేషనలైజేషన్ స్కీము.

కొత్త స్కీమువల్ల రనింగ్‌స్టాఫ్ కార్యభారం ఎక్కువవుతుంది

ఈ రేషనలైజేషన్ స్కీము గూడ్సు బండ్ల సంఖ్యను యిప్పుడున్న దానికంటె కొంచెం యెక్కువ చేయటానికి సహాయపడుతుందేకాని, రనింగుస్టాఫుయొక్క పనిగంటలను, పనివారాన్ని యే మాత్రం తగ్గించనేరదు. ఈ స్కీములో బండ్ల రాకపోకలలో ప్రస్తుతం సంభవిస్తున్న డిటెన్షన్లను పోగొట్టే మార్గమేమీలేదు. డిటెన్షన్లకు కారణమైన పరిస్థితులు అలాగేవున్నందువల్ల బండ్లసంఖ్య యెక్కువ అవుతున్నకొద్దీ, డిటెన్షన్లుకూడా యెక్కువ జరుగుతుంటాయి. ఇప్పుడు జరుగుతున్న డిటెన్షన్లవల్లనే రనింగుస్టాఫ్ 16 గంటలు,18 గంటలుకూడా ఇంజన్‌లోనే వుండవలసివస్తున్నది: పని మోపై నానా అవస్థలకు గురి అవుతున్నారు. బండ్లసంఖ్య యెక్కువై తత్ఫలితంగా డిటెన్షన్లు మరింత యెక్కువగుటవల్ల రనింగ్‌స్టాఫుకుకార్యభారం లోగడకంటె యెక్కువపెరుగుతుంది. పనిచేయవలసిన కాలం యెక్కువవుతుంది. ట్రైన్సు డిటెన్షన్లను నిర్మూలించనంతకాలం, స్పీడుహెచ్చు చేసినంత మాత్రాన బండ్లు గమ్యస్థానానికి త్వరగాచేరి, రనింగ్‌స్టాఫుయొక్క పనిగంటలను తగ్గించుననుకుంటే పిచ్చి బూటకం.

బండ్లసంఖ్యను ఎక్కువ చేయవలసింవే. దీనితోపాటు అధికార్లు డిటెన్షన్లనుకూడా నిర్మూలించి కార్మికులిప్పుడు పడుతున్న అవస్థలను, పనిభారాన్ని తొలగించాలి.

డిటెన్షన్లకు కారణాలు

ఈ డిటెన్షన్లకు కారణాలేమిటి: ప్రధాన స్టేషన్ కేంద్రాలలో విశాలమైన షంటింగు యార్డులు, తగినన్ని వాటర్‌కాలములు (ఇంజన్లకు నీళ్ళువచ్చే నీళ్ళపైపు ప్రదేశాలు) తగినన్ని రైల్వే లైన్లు లేకపోవటమే. చిన్న చిన్న స్టేషన్లలో రెండులైన్లకంటె యెక్కువ లేవు. దీనిఫలితంగా, వచ్చేపోయే బండ్లకు ఒకదానికొకటి అడ్డుతగులుతూ వుండేందుకు ట్రయిన్సును కొన్ని కొన్ని స్టేషన్లవద్ద గంటలమీద గంటలు డిటైనుచేసి వుంచవలసి వస్తున్నది. ప్రధానస్టేషన్ కేంద్రాలలోని

కామ్రేడ్ పోలేపెద్ది నరసింహమూర్తి

షంటింగుయార్డులు విశాలంగా తగినన్ని రైల్వేలైన్లతో లేకపోవటంవల్ల, అటునుంచీ యిటునుంచీ వచ్చి షంటింగుచేస్తున్న ట్రయిన్సుతో యార్డంతా కిక్కిరిసివుండడం, ఇంకా బండ్లువచ్చి విల్చుటకు స్థలంలేక, యార్డు ఖాళీఅయేంతవరకు మిగతాబండ్లుఅన్నీ పక్క స్టేషన్లలో డిటైన్‌చేయబడి వుండటం జరుగుతున్నది

వాటరు కాలములు యెక్కువగా లేకపోవటంవల్లకూడాడిటెన్షన్లుజరుగుతున్నాయి. అటునుంచివచ్చు బండ్లకు ఒకవాటరుకాలం, యిటునుంచి వచ్చుబండ్లకు ఒక వాటరుకాలం మాత్రమే వుంటటంవల్ల, నీళ్ళుపట్టుకునే బండి ఎప్పుడు పూర్తిచేసుకొని వెళ్ళిపోతుందాఅని యార్డులోకి వచ్చివున్నబండ్లు ఆగివుండాలి. పెద్దస్టేషన్ల యార్డులలో మరిరెండు వాటరు కాలములుంటే, బండ్లు త్వరత్వరగా నీళ్ళు పట్టుకొని పోతుండవచ్చు.

ట్రాన్సుపోర్టు విధానంలోని యీ నికృష్ట పరిస్థితులను. డిటెన్షన్లను అల్లాగేవుంచి బండ్లను ఎక్కువచేస్తే, పెద్దస్టేషన్ల యార్డులు షంటింగుచేస్తున్న. ఫారమ్‌అవుతున్న కొద్దిపాటి బండ్లతో క్రిక్కిరిసివుంటే, రాబోవు బండ్లు యెక్కడికక్కడ పక్కస్టేషన్లలో నిలబడివుండటం జరుగుతుంది. ఈవిధంగా డిటెన్షన్లు మరింత యెక్కువకావటం జరుగుతుంది. కాబట్టి బండ్లసంఖ్యను యెక్కువచేయటంతోపాటు డిటెన్షన్లనుకూడా పోగొట్టాలి.

డిటెన్షన్ల నిర్మూలనకు అధికార్లు పూనుకోవటం లేదు

రైల్వే అధికార్లు ఈ డిటెన్షన్లను పోగొట్టుటకు పూనుకోదల్చుకోలేదు. అసలు కార్యాన్ని అలాగేవుంచి, లేనికార్యానికి మందు వేస్తున్నారు. ఎందుకూ కొరగాని ఈ స్కీమును రనింగు స్టాపులో ప్రచారం చేసుకొనుటకు చీఫ్ అపరేటింగు సూపరింటెండెంటు అధికారి అన్ని కేంద్రాలలో రనింగు స్టాఫుకు మీటింగులు పెట్టే నిమిత్తం బయలుదేరాడు. బిట్రగుంట కేంద్రంలో పెట్టిన రనింగు స్టాఫ్ మీటింగుకు బిట్రగుంటబ్రాంచి కార్యదర్శి ట్రైవరు అయిన కామ్రేడ్ సుందరమూర్తి కూడా హాజరయి. అధికార్ల స్కీమును గట్టిగాయెదుర్కొన్నారు. స్కీమ్ అంతా పచ్చి బూటకమని, రనింగు స్టాపుయొక్క చాకిరిని యేమాత్రం తగ్గించదని డిటెన్షన్లను తొలగించేదేమీకాదని రుజువు చేశాడు. డిటెన్షన్లను పోగొట్టుటకు యూనియన్ తరఫున యీసూచనలను అమలుజరుపమన్నాడు.

1. చిన్న స్టేషన్లలో 3 వ రైల్వేలైనును నిర్మించాలి.

2. జంట రైల్వే లైన్లను నిర్మించాలి.

3. తెనాలి, ఒంగోలు, బిట్రగుంట, వెల్లూరు, గూడూరు, సూళ్ళూరుపేట స్టేషన్లలో లైన్లు ఎక్కువవేసి యార్డులను పెంచాలి. ఈ కేంద్రాలు ప్రధానంగా వ్యాపార కేంద్రాలయియున్నాయి. సరుకుల యెగుమతి దిగుమతులు జోరుగా జరుగుతుంటాయి. ఇందువల్ల గూడ్సుబండ్లు కొన్నివ్యాగన్లను యీ కేంద్రాలలో వదిలివేయటం, కొత్తవాగన్లను తగిలించుకోటం జరుగుతుంటుంది. ఈ ట్రైన్సు షంటింగు పూర్తిఅయేంతవరకు, కొత్తట్రైన్లు పక్కస్టేషన్లలో నిలబడిపోతాయి. ఈమన్నిటి తొలగిపోవాలంటే యార్డులను పెంచాలి.

4. ఈకేంద్రాలలో వాటరు కాలములను యెక్కువచేయాలి. ప్రస్తుతం వచ్చేబండికి ఒకవాటర్ కాలమ్, పోయేబండికి ఒకవాటరు కాలమ్ రెండే వుంటున్నాయి. మరి రెండు వాటరుకాలములను యేర్పాటు చేస్తే ఇంజన్లు వెంటవెంటనే నీళ్ళుతీసుకొనుటకు వీలుంటుంది.

5. రనింగు స్టాఫ్‌కు 8 గంటలపని ప్రవేశపెట్టాలి.

యూనియన్ చేసిన యీ సూచనలను అధికార్లు అమలుజరిపితే డిటెన్షన్లను అపుచేయవచ్చు. ట్రైన్లను త్వరత్వరగా వాటి గమ్యస్థానాలకు చేర్చవచ్చు. రనింగుస్టాఫ్ ఇప్పుడు పడుతున్న అవస్థలు పడనక్కరల్లేదు. ఈ డిటెన్షన్లవల్ల యెన్నోటన్నులబొగ్గు వృధాగా తగులబడి పోతున్నది. ఒక్కొక్క ఇంజనుకు ప్రతిట్రిప్పుకు (బెజవాడనుంచి బిట్రగుంటకుపోయి బెజవాడ వచ్చేందుకు) 2 టన్నులబొగ్గు అదనంగా ఖర్చుఅవుతున్నది. ఈవిధంగా నెలకు లెక్కకట్టుకుంటే ప్రతి ఇంజనుకు 25 టన్నుల బొగ్గు వృధాగా ఖర్చు అవుతున్నది. ఈదుబారాను ఆపవచ్చు. డిటెన్షన్లను అపుచేయకుండా, అనవసరంగా బొగ్గును తగలబెడుతున్నారనే సాకుమీద రనింగుస్టాఫ్‌కు యెన్నివార్నింగు స్లిప్పులిచ్చి ఎంతమందిని డిస్మిస్ చేసినా, వారిని రెచ్చగొట్టుట మవుతుందేగాని, యీ దుబారాను అపనేలేరు. ఇప్పుడున్న పరిస్థితుల్లో, దారి మధ్యలో బండ్లు పట్టాలు తొలగిపడటంగాని ఢీకొని పడిపోవటంగాని జరిగితే బెజవాడ నుంచి మద్రాసుకు 48 గంటల్లో చేరుతుంటున్న గూడ్సుబండ్లు దాదాపు రెండువారాలకు చేరుకుంటాయి. దీనిని అరికట్టవచ్చు. యూనియన్ సూచనలను అధికార్లుఅనుసరిస్తే, వీటన్నిటిని సాధించవచ్చు. కాని యీసూచనలు అధికార్లచెవుల్లోకెక్కటంలేదు. ప్రజలడబ్బును ప్రజల సౌకర్యాలకై ఖర్చుపెట్టుటం యిష్టంలేకపోవటమే దీనికికారణం. కనుక రైల్వేకార్మికులు ఆందోళనసాగించి అధికార్లచేత యూనియన్ సూచనలను అంగీకరింపచేసి అమలుజరిపించవలెను.

చేనేత మహాసభ

(15వ పేజీ తరువాయి) ఇంతవరకు రిజిష్టరు చేయకపోవటాన్ని యీ సభవారు ఖండిస్తూ వెంటనే రిజిష్టరు చేయమని కోరటమైనది.

15. గుంటూరుజిల్లా అడ్‌హక్ కమిటీకి అనుబంధంగా ఏర్పరుస్తూన్న జిల్లాల సూలు సబ్‌కమిటీలోనికి చేనేతవారి ప్రతినిధులుగా శ్రీ దొంతు నాగయ్య, కస్తూరి కుటుంబరావు, బండ్ల గరటయ్యగార్లను చేర్చుకొనవలసినదిగా జిల్లాకలెక్టరును కోరటమైనది

నూతన కార్యవర్గం

జిల్లాసంఘానికి క్రిందివారు నూతన కార్యవర్గంగా ఎన్నుకోబడ్డారు:

దొంతు నాగయ్యగారు అధ్యక్షులు, పృథివి సూర్యబాలానందంగారు ఉపాధ్యక్షులు, కస్తూరి కుటుంబరావు, బండ్ల గరటయ్యగార్లు కార్యదర్శులు, దుర్గా కృష్ణమూర్తి, కె. వి. శర్మగార్లు జిల్లాసంఘ ఆర్గనైజర్లు. వజ్జా భావన్నారావుగారు కార్యాలయ కార్యదర్శి, ఎం. కె. సుబ్బారావు, వి. వి. ఆర్. స్వామి, భట్టు సుబ్రహ్మణ్యం, వంగర వెంకటేశ్వర్లు. బొడ్డు వెంకటస్వామి. తిరుపతి జ్ఞానసుందరము, గోలి ఆదిశేషయ్య, దండా నారాయణస్వామి, కిట్టా ప్రకాశంగార్లు కార్యవర్గ సభ్యులు.

కామ్రేడ్ గోపాలం పాటలు, నాటకదళం బుర్రకథ, మహాసభకు ఎంతో వన్నె తెచ్చాయి. బుర్రకథకు 15 వేల ప్రజలు వచ్చారు.

మహాసభకు ఏర్పాట్లు

సత్తెనపల్లి తాలూకాలో 5 ప్రచారక దళాలు, 2 బుర్రకథ దళాలు 60 గ్రామాల ప్రజల్లో ఈ మహాసభను గూర్చి ప్రచారం చేశాయి.

సత్తెనపల్లిలోని 200 కుటుంబాల చేనేతవారు, తమ యింట్లో పెండ్లిలాగా భావించి పది దినాలు పనిమాని, మహాసభ ప్రయత్నాలు అత్యుత్సాహంగా చేశారు. సత్తెనపల్లి మహిళాసంఘంవారు భోజన ఏర్పాట్లలో మిక్కిలి తోడ్పడ్డారు. తాలూకాలోని రైతు సోదరులు కూరలు, పాలు, పెరుగు విరివిగా సప్లయిచేసి రైతు - కార్మిక సామరస్యాన్ని ప్రకటించారు.

సభ ఏర్పాట్లు చూచేటప్పటికి చేనేత కాంగ్రెసువారికి గంగెర్లు పుట్టాయి. కాంగ్రెసు ఎం. ఎల్. ఏ. అరుణరావు అధ్యక్షతను అదేరోజున పోటీసభను సత్తెనపల్లిలో ఏర్పాటుచేశారు. చేనేత కాంగ్రెసుకు సంబంధించిన కోటయ్య వగైరాలు, కమ్యూనిస్టులు శాశనులనీ, చీకపురుగులనీ, శాము దేవతలమనీ. కమ్యూనిస్టులను నాశనం చేయాలనీ, వుపన్యసించారు. ప్రజలు వారి కుటిల యత్నాలకు, దుర్భాషలకు అసహ్యించుకున్నారు.

సత్తెనపల్లితాలూకాయున్నూ, పరిసరాల్లో యున్న నరసరావుపేట,పల్నాడు,గుంటూరు తాలూకాలున్నూ పత్తిని పండించే మెట్ట తాలూకాలు. అద్దరు వడకడం, అద్దరు వస్త్రాన్ని నేయడంకూడ వున్న తాలూకాలు అలాంటి తాలూకాలమధ్య సత్తెనపల్లిలో జరిగిన గుంటూరుజిల్లా చేనేత మహాసభలో, మద్రాసు మంత్రివర్గంయొక్క ఖాదీస్కీము ఖండించబడింది. ఈ మహాసభకు 15 వేలమంది ప్రజలు వచ్చారు. దీనికి పోటీగా ప్రకాశంగారి ఖాదీస్కీమును బలపరచేదిగాను, అరుణరావుగారి అధ్యక్షతను పెట్టిన చేనేత కాంగ్రెసువారి సభకు వెయ్యిమంది ప్రజలు వచ్చారు.

మిత్రరాజ్య సమావేశంలో జరుగుతున్నది

అభ్యుదయ, అభివృద్ధినిరోధకశక్తుల మధ్య సంఘర్షణ

మనకు మిత్రులెవరో, శత్రులెవరో బైటపడ్డారు

ఇప్పుడు జరుగుతూన్న మిత్రరాజ్య సమితి సమావేశం మనకూ, ప్రపంచానికీ అమూల్యమయిన పాఠాలను ప్రసాదించింది.

దీనిలో చర్చకు వచ్చిన సమస్యల్లో మన దేశానికి ముఖ్యంగా సంబంధించినవి దక్షిణాఫ్రికా, నైరుతి ఆఫ్రికా సమస్యలు. ఈ రెండు సమస్యల విషయంలోనూ మన దేశములో భేదాభిప్రాయాలేవీ లేవు.

కాని, మిత్రరాజ్యసమితి ఎదుటికి ఇంకా ప్రధాన సమస్యలు చాలా వచ్చాయి. విదేశాల్లో పరాయి సేనలను గురించి, మిలిటరీ బలాల తగ్గింపునుగురించీ సోవియటు చెప్పిన తీర్మానాలు, వీటో సూత్రంపై దాడిచేస్తూ ఆస్ట్రేలియా పెట్టిన ప్రతిపాదన. వీటిలో ముఖ్యమైనవి.

ఈ పై అంశాలపై ఇండియాలో వివిధాభిప్రాయాలున్నాయి. వీటో అధికారం ప్రజాతంత్ర సూత్రాలకువిరుద్ధమని కొందరివాదన. అలాంటి వారంతా ఆస్ట్రేలియా వైఖరిని మెచ్చుకొంటున్నారు. మిగిలిన రెండు అంశాల విషయంలో కూడా, సోవియటు ఏదో ఎత్తువేస్తూన్నదని అనుమానిస్తున్నారు మరికొందరు.

ఇండియా ప్రతినిధుల పాత్ర గర్వకారణం

ఈ సమావేశంలో ముఖ్యంగా గమనించవలసింది ఇండియాప్రతినిధివర్గంనిర్వహించిన ఉజ్వలపాత్ర. భారతీయుల హక్కులకోసమూ, వలసదేశ ప్రజలహక్కులకోసంపోరాడడమే కాదు ఆ ప్రతినిధివర్గం చేసినపని, సమావేశం ప్రారంభమయి నప్పటినుంచీ. ప్రతిముఖ్య సమస్యమీదా ఇండియాప్రతినిధులు అభివృద్ధికరమైనవైఖరి నవలంబించారు. సామ్రాజ్యవాదుల మాయమాటలకు లొంగిపోలేదు. నిజమయిన భారతదేశ ప్రతినిధులు మిత్రరాజ్యసమితిలో పాల్గొనడం ఇదేమొదటిసారి. అక్కడ వారు నిర్వహించిన పాత్ర యావద్భారతదేశానికీ గర్వకారణం.

ఈ సమావేశంలో ప్రజాతంత్రవాదుల మని చెప్పుకొనే కొన్నిదేశాల నిజస్వరూపాలు బాగా బయటపడ్డాయి.

ఇండియాకు అభివృద్ధికర శక్తుల అండ

ఉదాహరణకు బ్రిటన్‌ను తీసుకోండి. దక్షిణాఫ్రికా సమస్య అంతరంగిక సమస్య అనీ, దానిని చర్చించడానికి మిత్రరాజ్యసమితికి అధికారం వుందోలేదో ఒక న్యాయస్థానంలో తేలాలనే వాదన మొట్టమొదట లేవదీసింది బ్రిటిష్ ప్రతినిధే. ఆవిధంగా దీనిని మిత్రరాజ్యసమితి ఎదుటినుండి తప్పించజూచాడు. మహాసభలో ఇండియా ప్రతినిధులు ఈ వాదనను ఓడించారు. ఇందులో సోవియటు ప్రతినిధులు వీరికి చాలా తోడ్పడ్డారు.

తరువాత రాజకీయ, న్యాయశాస్త్ర ఉపసంఘంలో చర్చసాగినకొద్దీ ఈ వాదనపై అభివృద్ధి నిరోధకులంతా ఏకమయ్యారన్నది స్పష్టమయింది.

దీనిని ఓడించడానికి ఇండియా, సోవియటు, నూతన ప్రజాస్వామిక యూరప్ దేశాలూ, కొన్ని దక్షిణ అమెరికాదేశాలూ ఏకమయ్యాయి. ఈ దేశాలు కురిపించిన ఖండనవరంపరతో దక్షిణాఫ్రికా ప్రతినిధి పై వాదనను పూర్తిగా వదులుకోవలసి వచ్చింది. ఇక ఈసమస్య నంతటనీ అంతర్జాతీయ న్యాయస్థానంయొక్క పరిష్కారానికి వదిలి పెట్టాలని వాదించసాగాడు. దీనిని బ్రిటన్, న్యూజిలాండు, ఆస్ట్రేలియా, కెనడా, అమెరికాదేశాలూ, బ్రిటన్ అమెరికాల కీలుబొమ్మ అయిన బెల్జియం, హాలెండ్ దేశాలూ, సోషల్ డెమాక్రటిక్‌పార్టీ ప్రభుత్వాల(బ్రిటిష్ లేబరు పార్టీ ప్రభుత్వంలాంటివి) కింద వున్న నార్వే, స్వీడన్ దేశాలూ ఈవాదనను బలపరిచాయి.

ఇండియా, సోవియటు, యుక్రైన్, పోలెండు, చిలీ (దక్షిణ అమెరికాలో కమ్యూనిస్టుపార్టీ మొదలైన ప్రజాపక్షం కొయలిషన్ ప్రభుత్వం కింద ఉన్న దేశం) దేశాలు దీనిని తీవ్రంగా ఎదుర్కొన్నాయి.

చివరకు, రాజకీయ, న్యాయశాస్త్ర సంయుక్తకమిటీలోనూ, తరువాత మహాసభలోనూ స్మట్సు ప్రభుత్వ విధానంపై నిరసన తీర్మానానికి అనుకూలంగా ఇండియా, సోవియటు, నూతన ప్రజాస్వామిక యూరప్ దేశాలూ, అభివృద్ధికరమైన ప్రభుత్వాలకింద ఉన్న దక్షిణ అమెరికా దేశాలూ, ఫ్రాన్సు, చైనా మొదలైనదేశాలూ, వోటు చేశాయి. బ్రిటిష్‌సామ్రాజ్యదేశాలూ, ఫాసిస్టు గ్రీకు ప్రభుత్వం, హాలెండు (డచ్చి), బెల్జియం, అమెరికా మొదలైనవి ప్రతికూలంగా వోటుచేశాయి.

మిత్రరాజ్యసమితిలో ఇండియాకుఅఖండ విజయంచేకూరింది. ఈవిజయానికి తోడ్పడినదెవరో, దానిని మనకు దక్కనివ్వకుండా చేయడానికి ప్రయత్నించినదెవరో తెలుసుకోవడం చాల ప్రధానం.

నైరుతిఆఫ్రికా సమస్యపై

నైరుతిఆఫ్రికాను కలుపుకోవాలని స్మట్సు పెట్టిన ప్రతిపాదన విషయంలోకూడా అనుకూల, ప్రతికూలపక్షాలు ఇంచుమించు ఇదే విధంగావున్నాయి. ధర్మకర్తృత్వకమిటీ ఉపసంఘంలో ఆంగ్లో-అమెరికన్ కూటమి సోవియటు, ఇండియా తీర్మానాలను ఓడించింది. నైరుతి ఆఫ్రికానుకలుపుకోవాలనే స్మట్సు ప్రతిపాదనను పూర్తిగా నిరాకరించాలని ఈరెండూ కోరాయి. స్మట్సుకోరికను అంగీకరించడానికి తగిన ఆధారాలులేవని అమెరికా, డెన్మార్కు ప్రతినిధులు పెట్టిన మితవాదతీర్మానాన్ని గెలిపించుకున్నారు.

కాని ధర్మకర్తృత్వకమిటీలో ఇండియా ప్రతినిధి తన తీర్మానాన్ని తిరిగి ప్రతిపాదించాడు. సామ్రాజ్యవాదదేశాలన్నీ దానిని వ్యతిరేకించాయి. సోవియటు మొదలయిన అభివృద్ధికరదేశాలన్నీ బలపరచాయి. స్వల్ప మెజారిటీతో ఈసారి తీర్మానంనెగ్గింది.

వీటోసమస్యపై సోవియటుకు ఇండియా సహకారం

ఇక వీటో సమస్య విషయం చూద్దాం. చిన్న రాజ్యాల హక్కుల రక్షణకోసం అంటూ ఆస్ట్రేలియా ప్రతినిధి వీటో సూత్రంపై దాడి ప్రారంభించాడు. వీటో సూత్రాన్ని తొలగిస్తూ మిత్రరాజ్య ప్రణాళికను సవరించాలన్నాడు. బ్రిటన్, అమెరికా కూటమి యీ ప్రతిపాదనను వ్యతిరేకిస్తున్నట్లు పైకి నటించాన్నారు. కాని, వీటో అధికారాన్ని ప్రయోగించడంలో మార్పులు జరగాలంటూ, ఆస్ట్రేలియా ప్రతిపాదననే వేరేమాటల్లో పెట్టారు.

ఈ సామ్రాజ్యవాద ప్రతిపాదనలను సోవియటు ఎదుర్కొంది. ఇండియా, పోలెండు, యుగోస్లావియా మొదలైన దేశాలు సోవియటుకు అండగా నిలిచాయి. అంటే సామ్రాజ్యవాద దేశాలు కూటమి ఒకవైపు, వాటిని ఎదుర్కొంటూ సోవియటూ నూతన ప్రజాస్వామిక యూరప్‌దేశాలూ. ఇండియా, మరొకవైపు.

విదేశాల్లో పరాయి సేనల విషయంలోకూడా

నాల్గవ ప్రధానాంశం-విదేశాల్లో పరాయి సేనలను గురించి గ్రీసు, చైనా మొదలైన విదేశాల్లో తమసేనలను ఉంచి నానా కుట్రలు సాగిస్తున్న బ్రిటన్ అమెరికాలకు ఇదొక పెద్ద బల్లెపుపోటులా తగిలింది. ఈ సమస్యను కూడా మూలద్రోయడానికి ఆంగ్లో-అమెరికన్ కూటమి కుట్రలు పన్నింది. అదృష్టంతో మిలిటరీ బలాల తగ్గింపు సమస్య దీనికి ముడి పెట్టజూచారు, ఇతరదేశ స్వాతంత్ర్యాన్ని తామెలా హరిస్తున్నదీ ఈ విధంగా కప్పిపుచ్చుకోవాలనుకున్నారు.

మిత్రరాజ్య సమితి సమావేశంలో అభ్యుదయకాముకులకూ, అభివృద్ధి నిరోధకులకూ సంఘర్షణ ఈ విధంగా సాగుతూంది. ప్రజాతంత్రమనీ, చిన్న రాజ్యాల హక్కులనీ గొంతు చించుకున్న వారంతా, అదరణలో అరెంటికి గర్భశత్రువులని ఈ సమావేశంలో స్పష్టంగా తేలిపోయింది. 'వలసదేశ ప్రజల అభివృద్ధికి వారుపూర్తి వ్యతిరేకులని దక్షిణాఫ్రికా సమస్యపై చర్చలు రుజువుచేశాయి.

సమావేశం నేర్పుతూన్న పాఠాలు

దీనినిబట్టి మనం అనేక విషయాలను నేర్చుకోవాలి. మరొకప్పుడు, ఏ సమస్య మీదనయినా ఆస్ట్రేలియాప్రతినిధి ప్రజాతంత్ర పదజాలం ఉపయోగిస్తే, దక్షిణాఫ్రికా సమస్యపై ఆస్ట్రేలియా ఏవిధంగా వోటు చేసిందో గుర్తుంచుకోవాలి. రాయిటర్ వార్తా సంస్థ పంపే అబద్ధాలను జాగ్రత్తగా పరిశీలించాలి.

ఆస్ట్రేలియా మొదలైన సామ్రాజ్యవాద కూటమి కోరుతూన్నది ప్రజాతంత్ర అభివృద్ధి కాదనీ, 'సామ్రాజ్యవాద పెత్తనమేఅనీ గ్రహించాలి.

ఈసమావేశం కొన్నిప్రభుత్వాలు తొడుగుతున్న ప్రజాతంత్ర ముసుగును చీల్చిపారవేసింది. ప్రజాతంత్రానికీ, చిన్నరాజ్యాలకూ నిజమైన మిత్రులెవరో,శత్రువులెవరో స్పష్టం చేసింది. ఈసమావేశం సాధించిన మహత్తర విషయాల్లో ఇదిముఖ్యమైనది.

(పీపుల్సువార్ నుండి.)

దక్షిణాఫ్రికా సమస్యపై

అభివృద్ధికరశక్తులకు అఖండవిజయం



శ్రీమతి విజయలక్ష్మి పండిట్

"దక్షిణాఫ్రికా ప్రభుత్వం అక్కడి భారతీయులపట్ల తన వైఖరిని మిత్రరాజ్య ప్రణాళికకు అనుగుణంగా మార్చుకోవాలి. ఇలాంటి మార్పులు జరిగిందీ, లేనిదీ ఇండియా, దక్షిణాఫ్రికాలు వచ్చే మిత్రరాజ్యసమితి మహాసభలో నివేదించాలి" అని ఫ్రాన్సు, మెక్సికో ప్రతినిధులు కలిపి పెట్టిన తీర్మానాన్ని రాజకీయ, న్యాయశాస్త్రకమిటీలో ఇండియా, సోవియట్ ప్రతినిధులుకూడా బలపరిచారు. కమిటీలో నెగ్గిన తరువాత ఈ తీర్మానం జనరల్ అసెంబ్లీలో చర్చకు వచ్చింది.

చర్చలో స్మట్సు తన పాత వాదనను తిరిగి ఏకరువు పెట్టాడు. దక్షిణాఫ్రికా భారతీయులను గురించి ఇండియా, దక్షిణాఫ్రికా ప్రభుత్వాల మధ్య ఒడంబడికలు జరగనేలేదని బుకాయించాడు. ఒక్క అంతర్జాతీయ న్యాయస్థానానికి తప్ప ఈవిషయంపై నిర్ణయం చేయగలఅధికారం మిత్రరాజ్యసమితి కమిటీలకు లేదన్నాడు. పైతీర్మానం తన ప్రభుత్వం పట్ల నిరసన తీర్మానమన్నాడు.

అమెరికా, బ్రిటన్ ప్రతినిధులు ఇతని వాదనను బలపరిచారు. బ్రిటిష్ ప్రతినిధి షాక్రాస్ ఇండియాలోని జాతి విభేదాలను పేర్కొని అపహాస్యం చేయబోయాడు. "సమావేశంలో స్వల్ప మెజారిటీతో నెగ్గే తీర్మానాలకు సభ్యులందరూ విధిగా బద్ధులై ఉండాలని చెప్పలేము" అని సమితిపట్ల తన చులకన భావాన్ని వెళ్ళగక్కాడు.

విజయలక్ష్మి జవాబు

శ్రీమతి విజయలక్ష్మి పండిట్, గంభీర వచనాల్లో, చర్చకు యిలాజవాబు చెప్పింది:

"దక్షిణాఫ్రికాలో భారతీయులపట్ల కేటాయింపువిధానాన్ని అవలంబిస్తున్నానవిస్మట్సే ఒప్పుకున్నారు. ఈవిధంగా దక్షిణాఫ్రికాలో వివిధ జాతులమధ్య శాంతి నెలకొల్పుతున్నానని వాదించారు. దక్షిణాఫ్రికా ప్రభుత్వం మిత్రరాజ్య సమితి ప్రణాళికకు భంగకరంగా ప్రవర్తిస్తున్నదనే నేరాన్ని స్మట్సు మాటలే రుజువుచేస్తున్నాయి. ఇండియా ప్రభుత్వం దానిస్వభావం ఎలాంటిదయినప్పటికీ, ఎన్నో సంవత్సరాలనుండి ఈ విషయాన్ని ఖండిస్తూ వచ్చింది. ఒడంబడికలద్వారా ఈవిషయాన్ని పరిష్కరించుకో ప్రయత్నించింది. లాభంలేక ఈసమస్యను ఈ సమావేశం ఎదుట పెట్టింది.

"స్మట్సు సామాన్యుడుకాడు. పవిత్రమైన మిత్రరాజ్య ప్రణాళికకు ఉపోద్ఘాతం రాసిందివారే. అటాంటి (మిగతా 18వ పేజీ)

దక్షిణాఫ్రికా సమస్య

ఇండియాలోని విభేదాలకు కారణం బ్రిటనే

(17 వ పేజీ తరువాయి) వారూ, వారి నాయకత్వం క్రిందవున్న దక్షిణాఫ్రికా ప్రభుత్వమూ మిత్రరాజ్య ప్రణాళికను ఉల్లంఘించారనడం న్యాయం.

"ఈసమస్యపై నిర్ణయంచేయగల అధికారం మిత్రరాజ్యసమితికి లేదని వాదించడం మిత్రరాజ్యప్రణాళిక ప్రాధాన్యతనే తృణీకరించడం అన్నమాట. ఈసంస్థపట్ల మాటల్లో వెలిబుచ్చుతున్న విధేయత వట్టిమాటలని ఋజువుచేయడమన్నమాట. భయం, పీడ, దారిద్ర్య బాధలూలేని ప్రపంచాన్ని నిర్మిస్తామని ప్రకటించిన ఆశయాలన్నీ వట్టి గాలిమాటలని చెప్పుకోవడమన్నమాట. ఈవాదనను నిరాకరించాలి. అంతర్జాతీయ నీతిని కాపాడవలసిన బాధ్యత ఈసంస్థపై వుంది సభ్యులమైన మనమందరం దాని నంగీకరించాలి.

"రంగు వేరవడంవల్లనో, మతంమరొకటి కావడంచేతనో కొన్ని దేశాల్లో కోటానుకోట్ల ప్రజలను అయాప్రభుత్వాలు నీచావస్థల పాల్జేస్తున్నాయి. న్యాయంకోసం, విముక్తికోసం వారంతా మనవంక చూస్తున్నారు. మనం నిర్మించాలనుకుంటున్న నూతన ప్రపంచానికి ధర్మమే పునాదులు కావాలి.

"ఈ సంస్థకు దక్షిణాఫ్రికా సమస్య ఒక పరీక్ష. ఈ సంస్థపై ప్రపంచ ప్రజలు పెట్టుకున్న ఆశలు నెరవేరుతాయో, లేక మట్టిపాలవుతాయో మీ నిర్ణయంపై ఆధారపడి వుంది.

"నేనుచేస్తున్నది ప్రపంచంమొక్క అంతరాత్మకు విజ్ఞప్తి. ఆ అంతరాత్మ ఈ సంస్థలో మూర్తీభవించి వుంది.

ఇండియాలోని విభేదాలకు కారణం బ్రిటనే

బ్రిటిష్ ప్రతినిధి విమర్శలకు విజయలక్ష్మి ఇలా జవాబు చెప్పింది.

1927 లో ఇండియా దక్షిణాఫ్రికాలమధ్య జరిగిన ఒడంబడికను ఉదహరించి, "ఈవిధంగా ఒడంబడికలు జరిగిన తరువాత కూడా ఈ సమస్య ఒక్క దక్షిణాఫ్రికాకే చెందిన అంతరంగిక సమస్య అంటే ఎలా నమ్మగలం?" అని విమర్శించింది.

భారతీయులకు వ్యతిరేకంగా పక్షపాతం చూపడంలేదని స్మట్సు చేసిన వాదనకు జవాబుగా 1904–1908 లో దక్షిణాఫ్రికా ప్రభుత్వము చేసిన చట్టాలను ఉదహరించింది.

"ఈ చట్టాలు భారతీయుల ప్రత్యేక గూడాల్లోనే నివసించాలని శాసించా" యన్నది.

"ఈ వివాదంలో బ్రిటన్ అవలంబించిన తటస్థంగా ఉండటం అనే విధానాన్ని అనుచితమైనదిగా విమర్శించింది.

"ఈ సమావేశంలో మెజారిటీ వోటుతో జరిగే నిర్ణయాలకు సభ్యులు బద్ధులై ఉండవలసిన అవసరం లేదన్నాడు బ్రిటిష్ ప్రతినిధి. అలాంటప్పుడు అంతర్జాతీయ న్యాయస్థానం నిర్ణయాలకు బద్ధులై ఉంటారనే నమ్మకం ఎక్కడిది? మిత్రరాజ్య సమితి నిర్ణయాలపట్ల సభ్యులు చూపవలసిన మర్యాద ఇదేనా?

"బ్రిటిష్ ప్రతినిధి ఇండియాలోని విభేదాలను పేర్కొన్నారు. వాటినిగురించి అమెరికా పత్రికలు కూడా ఈనాడు విపరీతంగా ప్రచారం చేస్తున్నాయి.

"విభజించి పాలించాలనే విధానాన్ననుసరించి బ్రిటిష్ ప్రభుత్వం సాగించిన పన్నాగాల ఫలితమే ఈ విభేదాలన్న విషయం ఆయనకు తెలియనిది కాదు. ఈనాడు ఇండియా బ్రిటిష్ సంకెళ్ళనుండి స్వాతంత్ర్యం కోసమే కాదు పోరాడుతున్నది; బ్రిటిష్ ప్రభుత్వం తెచ్చిపెట్టిన ఈ విభేదాలను తుడిచిపెట్టడానికి కూడా కృషిచేస్తూంది" అని చెప్పి ముగించింది.

సోవియటు సహకారము

దక్షిణాఫ్రికా, బ్రిటిష్ ప్రభుత్వ వాదనలను ఖండిస్తూ సోవియటు ప్రతినిధి విషిన్‌స్కీ ఇలా అన్నాడు.

"భారతీయులు యూరోపియన్లను పెండ్లి చేసుకోవడాన్నిగూడా నిషేధిస్తూ, ఒక శాసనం జరిగింది. భారతీయస్త్రీలకు వోటింగుహక్కు లేకుండా శాసనం జరిగింది.

"ఇంతచేసినదోషి దక్షిణాఫ్రికాప్రభుత్వం. తప్పించుకుపోవడానికిప్పుడు మార్గాలు వెతుకుతూంది. రాజకీయ ప్రాధాన్యతగల ఈ సమస్యను, వట్టి న్యాయశాస్త్రానికి చెందిన దానిగా మార్చివేయాలని ప్రయత్నిస్తూంది. ఈవిషయంలో బ్రిటిష్ ప్రతినిధి స్మట్సు తరపున చక్కని వకీలుగా పనిచేస్తున్నాడు.

"ఈ సమస్యపై నిర్ణయం చెప్పగల అంతర్జాతీయ న్యాయస్థానం ఈ జనరల్ అసెంబ్లీయే" అని విషిన్‌స్కీ అన్నారు.

స్మట్సు ప్రభుత్వంపై నిరసన తీర్మానం మహాసభలో 32-15 ఓట్లతో, అంటే మూడింట రెండువంతుల మెజారిటీతో నెగ్గింది.

మిత్రరాజ్య సమితిపై విశ్వాసం స్థిరమయిందని విజయలక్ష్మి

శ్రీమతి విజయలక్ష్మి పండిట్ న్యూయార్కు నుండి లండను బయలుదేరుతూ యీ దిగువ ప్రకటన చేశారు:

"మిత్రరాజ్య సమితిపట్ల మా విశ్వాసం పార్థకమయింది. మా భారతదేశ ప్రతిష్ఠ పెరిగింది. అంతేకాదు, మిత్రరాజ్యసమితి మానవ హక్కులను కాపాడగల సంస్థ అని కూడా ఋజువయింది. ఈ సంస్థయొక్క భవిష్యత్తుకే కాకుండా, మానవ నాగరికతాభివృద్ధికి ఇది చాల ప్రధానమైన విషయం. ఈసందర్భంలో ఇండియా ఉచిత పాత్రను నిర్వహించగలిగినందుకు చాల సంతోషిస్తున్నాము."

"ఈ సమస్యపై సహకారం చేసిన ఇతర ప్రతినిధులందరికీ మా కృతజ్ఞత. ప్రపంచాన్నెదుర్కొంటున్న ఇతర ప్రధానసమస్యలపై కూడా ఆ దేశాలు, ఇండియా ఈవిధంగానే పరస్పరం తోడ్పడి శాంతి, స్వాతంత్ర్యాలను పెంపొందించగలవని ఆశిస్తున్నా" నని నెహ్రూ అన్నారు.

దక్షిణాఫ్రికా సమస్యపై తోడ్పడినవారికి నెహ్రూ కృతజ్ఞతాభివందనాలు

దక్షిణాఫ్రికా భారతీయుల సమస్యపై సాధించిన విజయానికి ఇండియా ప్రతినిధి వర్గాన్ని అభినందిస్తూ తాత్కాలిక ప్రభుత్వం తరఫున పండిత నెహ్రూ ఒక సందేశం పంపారు.

దక్షిణాఫ్రికా భారతీయుల సంతోషం

"మిత్రరాజ్య సమితిలో అఖండవిజయం సాధించినందుకు భారతమాతకు 2½ లక్షల దక్షిణాఫ్రికా భారతీయులం కృతజ్ఞులం" అని దక్షిణాఫ్రికా భారతీయ సత్యాగ్రహ సంఘం పండిత నెహ్రూకు సందేశం పంపింది.

ఇండోచీనాలో ఫ్రెంచి సైన్యాధికారుల ధూర్తత

మోహన్ కుమారమంగళం

నవంబరు 23 వ తేదీన ఫ్రెంచిసేనలకు, వియట్నాం సేనలకు ఇండో-చీనాలో పోరాటం ప్రారంభమైంది. టాంకింగ్ రాష్ట్రంలోని హైఫాంగ్‌లో చీనావారిపేటలలో కల్లోలాలు జరిగినాయని, దానివలననే ఈకొత్తపోరాటం వచ్చిందని ఫ్రెంచిపత్రికలు, సామ్రాజ్యవాదుల పత్రికలు సాగవేయటో మనాయి.

ఫ్రెంచి సేనలలో ఇంకా ప్రధానస్థానాలలోవున్న ఫ్రెంచి సైన్యాధికారులు, వియట్నాం ఉద్యోగులు ఇంతకాలంగా సాగిస్తూన్న తలబిరుసుపనులకు ఫలితం ఈకొట్లాటలు.

ఎనిమిది నెలలక్రితం మార్చి 6 వ తేదీన ఫ్రెంచిప్రభుత్వం వియట్నాంయొక్క స్వాతంత్ర్యాన్ని అంగీకరిస్తూ సంధి చేసుకుంది. వియట్నాంప్రజల ఐక్యప్రతిఘటన, ఫ్రాన్సులో అతివాదుల, కమ్యూనిస్టుల తీవ్రవిమర్శనల ఫలితంగా ఇండోచీనాను తిరిగి స్వాధీనపరచుకోవాలనే అభిప్రాయాన్ని ఆపవలసి వచ్చింది.

సైన్యాధికారుల వ్యతిరేకత

కాని "ఫ్రెంచి మిలిటరీ ఉద్యోగులు, వలస శాఖ ఉద్యోగులు ఈసంధికిపూర్తిగా వ్యతిరేకమనేది బహిరంగ రహస్యం." (హిందూస్థాన్ టైమ్సు, పారిస్ విలేఖరి, నవంబరు 27)

ఈసంధి అమలు జరగకుండా మార్చి నుంచీ కూడా ప్రయత్నిస్తూనేవున్నారు. వియట్నాంగొరిల్లాలను సైనికదళాల హోదాతో అంగీకరించము అని అన్నిచెప్పారు. ఇండోచీనాలో దాలాత్ కాన్ఫరెన్సు అంటూపెట్టి, ఆసలలో వియట్నాంకి స్వతంత్రం యిచ్చిన మాట పచ్చిఅబద్ధం అని ప్రకటించారు. కొచిన్‌చీనాను వియట్నాంలో కలియకుండా చేసారు. కొచిన్‌చీనా చాలా సారవంతమైన భాగం. ఇక్కడి ప్రజలలో మెజారిటీ తీసుకుని, వారియిష్టాను సారం చేయాలన్నారు. కాని ఆమెజారిటీ పరిగణించుకున్నది లేనిదేఎందుకు ప్రభుత్వాలూ గమనించాలన్నారు. ఫ్రెంచి ప్రభుత్వంకూడా పరిశీలనలో వుండడంమాట ఎప్పుడు వచ్చిందో వియట్నాంతో కొచిన్‌చీనా కలవడం సాధ్యపడదని తేలిపోయింది. అలాగే జరిగిందికూడా.

టాంకింగు పోరాటం వారు ఇంతకాలమూ సాగిస్తున్న యుద్ధప్రయత్నాలలో ఒకభాగం అనిచెప్పాలి. దానికి తగిన కాలంవేయడానికి ఫ్రాన్సులోని అభివృద్ధినిరోధకులు అప్పుడే ప్రారంభించారు.

'ఫిగారో' అనే కన్సర్వేటివు పత్రిక (ఫాసిస్టుల అనుకూలమైన 'లిబర్టీ' పార్టీవారిది), క్రిస్టియన్ డెమాక్రట్లలో మితవాదులు ఈహైఫాంగ్ కల్లోలానికి "వియట్నాం ప్రభుత్వంలోని కొందరు నాయకులే కారణం" అని ప్రచారం ప్రారంభించినాయి.

"మనం ఏమాత్రం మెత్తదనంచూపినా చాలా ప్రమాదాల నెదుర్కోవలసివస్తుంది. ఇండోచీనా చేయిజారిందంటే మన సామ్రాజ్యం పోయినట్లే. భవిష్యత్తులో ఫ్రాన్సు పెద్ద రాజ్యంగా వుండడమో, పూడడమో ఇండోచీనాలో తేలిపోతుంది."

ఫ్రెంచి ప్రభుత్వంలో ఇండోచీనా కమిటీ క్రిస్టియన్ డెమాక్రట్ల నాయకత్వాన (ఇందులో కమ్యూనిస్టులులేరు) 'కఠినచర్యలు' తీసుకోవాలని నిర్ణయించింది.

అతివాదులు అడ్డుకున్నారు

సామ్రాజ్యవాదుల పోగయబోతునవాన్ని ఫ్రాన్సులోని అతివాదులు తీవ్రంగా ప్రతిఘటించారు.

వియట్నాం ప్రభుత్వంతో వెంటనే రాజీపడాలని ట్రేడ్‌యూనియన్ కాంగ్రెస్ (సి. జి. టి.) ప్రభుత్వాన్ని కోరింది. కమ్యూనిస్టులుకూడ అదే కోరారు.

ఇంతవరకు మౌనంగా వున్న సోషలిస్టుల పత్రిక లాపాప్యులేర్ ఇప్పుడు ప్రభుత్వచర్యను తీవ్రంగా ఖండించింది. "స్వాతంత్ర్యం, శాంతి, రబ్బరు వర్తకాలలో కోట్లు గడిస్తున్న వర్తకులు, పాపం, ఆదేశీయుల్ని ఇంకా నమిలేందుకు చేస్తున్న పన్నాగం ఇదంతా"—అంది.

నూతన ప్రభుత్వం ఏర్పరచ బోయేది ఫ్రాన్సులో ఇప్పుడుజరుగుతూన్న చర్చలలో ఏ పార్టీలు ఎందుకు తాపత్రయ పడుతున్నాయో పైసంగతులనుబట్టి పూహించుకోవచ్చు.

ప్రభుత్వంలో క్రిస్టియన్ డెమాక్రట్లకు ప్రాధాన్యత వచ్చిందా ఇండోచీనాలో సామ్రాజ్యవాదనీతి అమలు జరుగుతుంది. కమ్యూనిస్టులు సోషలిస్టులు కలిసి ప్రభుత్వం ఏర్పరచేదా—దౌర్జన్యకరమైన వలసపద్ధతిని (కమ్యూనిస్టు-సోషలిస్టు ప్రభుత్వం ఏర్పడితే అనుసరించవలసిననీతి ఇల్లా వుండాలని కమ్యూనిస్టులు ప్రతిపాదించారు) అంతరింపచేస్తారు. వియట్నాం స్వాతంత్ర్యాన్ని గుర్తిస్తూ మార్చి 6 న చేసుకున్న ఒడంబడికను గౌరవిస్తారు.

సామ్రాజ్యవాదుల ఆశలు అజర్‌బైజాన్‌లో ఫలించాయి

ఇరాన్‌లో ఖవాం సుల్తానే మంత్రివర్గం అదివరకు సామ్రాజ్యవాదుల కుట్రలకులొంగుతూ వచ్చింది. గతవారం ఈలొంగుబాటు తుది దశకు వెళ్ళింది. అజెర్‌బైజాన్‌పై సైనిక దండయాత్ర, సుల్తానే లొంగుబాటుకుఅంతిమ దశ.

సుల్తానే ప్రభుత్వం, కొన్నివారాలక్రితం అతివాద పక్షమైన టూడే పార్టీతోను, కార్మికోద్యమంతోను తెగతెంపులు చేసుకొంది. దక్షిణ ఇరాన్‌లో బ్రిటిష్ సామ్రాజ్యవాదుల ప్రోత్సాహంతో లేచిన కొండజాతుల తిరుగుబాటుకు సుల్తానే లొంగిపోయిన నాటినుంచీ, సుల్తానే ఈధోరణిని వహించాడు. తనమంత్రి వర్గంనుండి టూడేపార్టీకి చెందిన మంత్రులను తొలగించివేశాడు.

ఆనాటినుంచీ, ముఖ్యంగా ఎన్నికలు జరుగుతాయని ప్రకటించినవాటినుంచీ (డిసెంబరు 7 వ తేదీన ఎన్నికలు జరుగుతాయని మొదట ఒక ప్రకటన జరిగింది. తర్వాత వాయిదా వేయబడినాయి.) సుల్తానే అతివాదులపై దండయాత్ర సాగించాడు. తీవ్ర నిర్బంధవిధానం కొనసాగించాడు. అతివాదుల కార్యాలయాలపై పోలీసుల దాడి చేయడం, కార్మిక నాయకులను అరెస్టుచేసి శిక్షించడం మొదలు పెట్టాడు.

బ్రిటిష్ పెట్టుబడిదారులే దాదాపు పరిపాలనదగిన ఖుజిస్తాన్‌లో 60 కార్మిక సంఘాలు మూసివేయబడినాయి. 40 మందిచంపివేయబడ్డారు. 170మందికిగాయాలు తగిలాయి. 70 మంది ధిట్టమైన కార్మిక నాయకులను రాష్ట్రం బయటికి పంపివేశారు. 6000 మంది కార్మికులను-కార్మికోద్యమంలో భాగా పాల్గొంటున్నందుకుగాను—పనినుండి తొలగించబడ్డారు.

ఇలాగే, టూడే పార్టీ బలంగావున్న తక్కిన ప్రాంతాల్లోగూడ సుల్తానే ప్రభుత్వం ఇలాంటి పైశాచిక నిర్బంధ విధానాన్నే కొనసాగించింది.

అజెర్‌బైజాన్‌కు ఆనుకొని దక్షిణంగా మజెందెరాన్‌లో సుల్తానే మార్షల్‌లా ప్రకటించాడు.

ఈవిధంగా టూడే పార్టీని, కార్మికోద్యమాన్ని అణచి, ఎన్నికలలో అభివృద్ధినిరోధకులను తీసుకోవాలని సుల్తానే ప్రయత్నం.

అజెర్‌బైజాన్, కుర్దిస్తాన్‌లలో అభివృద్ధి నిరోధకులను తొలగించి ప్రజాతంత్ర ప్రభుత్వాన్ని ఈ సంవత్సర ప్రారంభంలో ఏర్పరచుకొన్నారు. ఈ ఉద్యమాలను అణచడానికి సుల్తానే కుట్రపన్నాడు.

ఎన్నికలను పరిశీలించడానికంటూ తన సైన్యాలను పంపి, అచ్చటి ఉద్యమాలను అణచివేయడానికి సుల్తానే నిశ్చయించాడు.

ఎన్నికలను తాము సక్రమంగా నడుపుకోగలమనీ, కేంద్రప్రభుత్వ సైన్యాలవసరం లేదనీ, అజెర్‌బైజాన్, కుర్దుప్రజానాయకులు జవాబిచ్చారు. సైన్యాలను పంపితే ఎదిరించుతామని చెప్పారు. అయినా వినక సుల్తానే తన సైన్యాలను పంపాడు. అజర్‌బైజాన్ ఎదుర్కొనక నిశ్చయించింది.

అజర్‌బైజాన్ నాయకుడు పిషేవరి చేసిన ప్రకటనలలో, ఈ జరిగే పోరాటం కేంద్ర ప్రభుత్వానికీ అజెర్‌బైజాన్‌కూ కాదనీ, అభివృద్ధి నిరోధకులకూ అభ్యుదయ కాముకులకూ జరిగే మర్దనలనీ నొక్కిచెప్పారు. ఇరాన్‌నుండి విడిపోవడం తమ ఆశయం కాదనీ, మొత్తం ఇరాన్ అంతటి క్షేమాన్ని తాము దృష్టిలో వుంచుకొంటున్నామని చెప్పారు.

ఇంతేగాక, అమెరికా ధన సహాయంతోను, విమానాల సహాయంతోను సుల్తానే ఈ ఘాతుక చర్యలకు పూనుకుంటున్నాడని హెచ్చరించాడు.

సుల్తానే బ్రిటన్ ప్రోత్సాహంతోను, అమెరికా విమానాల ఆయుధ సహాయంతోను తన సైన్యాలను అజెర్‌బైజాన్‌పైకి పంపాడు. గ్రామాలను తగులబెట్టడం చేసి, స్త్రీలను, పిల్లలను చిత్రవధ చేయించాడు, అమెరికా విమానాలు, అజెర్‌బైజాన్‌లోకి సుల్తానే సేనలు జొరబడ్డాయి.

తర్వాత వార్తలు చాలా గందరగోళంగా వున్నాయి. అజెర్‌బైజాన్ గవర్నరూ, అజెర్‌బైజాన్ డెమాక్రెటిక్‌పార్టీ, అజెర్‌బైజాన్ రాష్ట్రశాసనసభ, కేంద్ర ప్రభుత్వ సేనలకు లొంగినట్లు ఒకప్రకటన చేశాయి. పిషేవరిని గురించి జాడతెలియలేదు. దానిని బట్టి అజెర్‌బైజాన్ ప్రజాతంత్ర శక్తులలోనికి కుట్రదారులనుపంపి, వారితో చీలికలు పెట్టి, సామ్రాజ్యవాదులు జయించగల్గారని స్పష్టమౌతోంది.

అజెర్‌బైజాన్ రాజధానిలో సుల్తానే సేనలు ప్రవేశించాయి. అప్పుడే నిర్బంధ విధానం ప్రారంభమయింది.

టాబ్రిజ్‌లో (అజర్‌బైజాన్ ముఖ్య పట్టణం) ప్రజాతంత్రవాదులను "ప్రజలు చంపుతున్నారు"అని వంకపెట్టి చంపివేస్తున్నారు. టెహరాన్‌లో టూడేపార్టీ కార్యాలయంపైన, సుల్తానే అనుచరులగుంపు దాడిచేసి ఆ భవనాన్ని కూల్చివేశారు. టాబ్రిజ్‌లో మార్షల్‌లా ప్రకటించబడింది. కుర్దిస్తాన్‌లోని రెండుముఖ్యపట్టణాలు సుల్తానే సేనలకు వశమయ్యాయి. అజెర్‌బైజాన్ ప్రజాతంత్ర నాయకులకోసం టాబ్రిజ్‌లో సోదాచేస్తున్నారు. ఒకప్రక్క తీవ్రంగా అజెర్‌బైజాన్ ప్రజోద్యమాన్ని అణచివేయడానికి పూనుకొన్న సుల్తానే చర్యలను, "ప్రజలే" చేస్తున్నారని దుష్ప్రచారం సాగిస్తున్నాడు రాయిటర్.

ఎట్టకేలకు బ్రిటిష్ అమెరికన్ సామ్రాజ్యవాదుల కుట్రలు ఇరాన్‌లో ఫలించాయి. అజెర్‌బైజాన్ కుర్దిస్తాన్‌లలో, భూములను ప్రజలకుపంచి, ప్రజాసౌకర్యాల చట్టాలను గావించి మేలుచేసిన ప్రజా ప్రభుత్వం లొంగిపోవలసివచ్చింది. ఇరాన్ ప్రజలు తిరిగి మరో అగ్నిపరీక్షకు నిలబడవలసి వచ్చింది.

ఇండోనీషియా ట్రాట్స్కీవాదులకు శిక్షలు

రాయిటర్ అబద్ధ ప్రచారం

డిసెంబరు 2 వ తేదీన రాయిటర్ ఒక వార్తను పంపాడు. అందులో ఇండోనీషియా రిపబ్లిక్ ప్రభుత్వ వ్యతిరేక చర్యలకుగాను, ఇండోనీషియా కమ్యూనిస్టుపార్టీ అధ్యక్ష, కార్యదర్శులకు శిక్ష ఏండ్లు కఠిన శిక్షకు గురి అయ్యారని ఆ వార్త. శిక్షింపబడ్డ వ్యక్తులు కమ్యూనిస్టులనడం విజ్ఞతగాదు. వాస్తవమేమిటి?

ఇండోనీషియానుండి అపాసను తరిమి వేసేరోజులలో, ఇంకా పరిస్థితులు చక్కబడక గందరగోళంగావున్న రోజులలో, పార్టీవ్యతిరేకులు, ట్రాట్స్కీవాదులు పార్టీలో మెల్లగాచూరారు. డాక్టర్ జోసఫ్, డాక్టర్ సోయాప్రాసోలను (వీరిద్దరికే శిక్షవిధించబడ్డాయి) ఈసంవత్సరం ప్రారంభంలోనే కమ్యూనిస్టుపార్టీనుండి వెళ్ళగొట్టారు. కారణం వారు రిపబ్లికన్ ప్రభుత్వాన్ని తగినంత విప్లవయుతంగా లేదనే వంకతో ఎదిరించాలన్నారు. ఈవినాశపంథాను కమ్యూనిస్టులంగీకరించక వారిని పార్టీనుండి వెళ్ళగొట్టారు. చెరిబాన్‌లో, రిపబ్లిక్ సైన్యాలకు, జోసఫ్ అనుచరులకూ మధ్య సాయుధ సంఘర్షణలు జరిగాయి.

ట్రాట్స్కీవాదులు ఎంతగానో విప్లవ పదజాలాన్ని వాడుతున్నా, ఆచరణలో ఇలాంటి కార్యక్రమం అవలంబించడంవల్ల వారి రంగు బయటపడింది. డచ్చిసామ్రాజ్యవాదులను బలపరచడానికి వీరిపంథా ఉపయోగించుతుంది. అందుచే పార్టీనుండి వీరిని వెళ్ళగొట్టవలసి వచ్చింది.

ప్రస్తుతం కమ్యూనిస్టుపార్టీకి అధ్యక్షుడు విప్లవవీరుడు సార్డజోనో, ఈయన 1926లో పార్టీకి అధ్యక్షుడు. (తర్వాత పార్టీ నిషేధించబడింది.) ఇండోనీషియా రిపబ్లిక్‌ను పూర్తిగా బలపరుస్తున్నామనీ, ఇండోనీషియా స్వాతంత్ర్యవిషయంలో రాజీపడకుండా చూడటమే తమకర్తవ్యమనీ, కమ్యూనిస్టులు తమ వైఖరిని స్పష్టపరిచారు.

పార్లమెంటులో భారత సమస్య

(1వ పేజీ తరువాయి) ప్రభుత్వసభ్యులు సంస్థానాధికారాలుగల మంత్రులవలె వ్యవహరిస్తున్నారు. వైస్రాయికి వారు బాధ్యతవహించడములేదు. తాత్కాలిక ప్రభుత్వంలో ఎవరుండాలి అనే విషయం నెహ్రూకు పూర్తిగా విడిచిపెట్టబడింది. తమకుతాము నామినేటు చేసుకున్న సభ్యులకు అధికారం కట్టబెట్టడం జరిగింది.

3 హిందూ-ముస్లిం కొట్లాటలలో శాంతి స్థాపన రాష్ట్రప్రభుత్వం బాధ్యత. కాని నెహ్రూ మొదలైన తాత్కాలిక ప్రభుత్వ సభ్యులు ఆబాధ్యతను తామేతీసుకొని వ్యవహరించారు.

4. భారతదేశ సమస్య పరిష్కరింపబడేవరకూ బ్రిటిష్‌సేనలు, సివిలియన్ ఉద్యోగులు కట్టుదిట్టంగా, నిష్పక్షపాతంగా వ్యవహరించాలి.

5. ప్రధాన రాజకీయపార్టీలు ఏకాభిప్రాయానికి వస్తేనే, బ్రిటన్ ఏభారతరాజ్యాంగ చట్టాన్నైనా ఆమోదించాలి.

6. భారతదేశ రాజ్యాంగం రిపబ్లిక్‌గా ఉండాలంటూ, ప్రజాపరిషత్తు వరలోచేసే నిర్ణయాలు అమలుజరుగకూడదు. ఎందువల్లనంటే ముస్లింలీగ్ అందులో పాల్గొనడంలేదు.

ఫెడరల్‌కోర్టుతీర్పు వ్యతిరేకమైతే

7. గ్రూపుల సమస్యపై కాంగ్రెసుకూ, ముస్లింలీగుకూ మధ్య భేదాభిప్రాయం ఏర్పడింది. దానిపై ఫెడరల్‌కోర్టును తీర్పుయివ్వమని ఏకేతీరోగా రాజ్యాంగసభ కోరాలో ప్రభుత్వం ఉదహరించలేదు. ఒకవేళ ఫెడరల్‌కోర్టు బ్రిటిష్ ప్రణాళికకు వ్యతిరేకమైన వ్యాఖ్యానంచేస్తే, ప్రభుత్వం ఏమి చేయదలచుకున్నదో, చెప్పలేదు.

8. నిమ్నజాతి ప్రజలకు రాజ్యాంగ నిర్మాణ సభలో న్యాయమైన ప్రాతినిధ్యం లేదు. వారి తరపున కాంగ్రెసు హరిజన ప్రతినిధులద్వారా మాట్లాడే అధికారం లేదు.

సంస్థానాలలో తమరాజ్యము ండాలట

9. సంస్థానాలలో సార్వభౌమాధికారాలు శాశ్వతంగా ఉండాలి. నూతన రాజ్యాంగం అమల్లోకి వచ్చినా, బ్రిటిష్ పెత్తనం వాటిపై ఉండాలి.

కన్సర్వేటివ్ సభ్యుల పై వాదనలతో ప్రభుత్వ పాలసీని విమర్శించినప్పటికీ, బ్రిటిష్ ప్రణాళికను వారుకూడా స్తుతించారు. ఉన్నదున్నట్లు దాన్ని అమలు జరిపితేకావాలన్నారు. లేబర్ ప్రభుత్వం డిసెంబరు 6 వ తేదీ ప్రకటనలో, లీగ్ ప్రతినిధులు పాల్గొనని రాజ్యాంగ నిర్మాణసభ ఏర్పరిచే రాజ్యాంగచట్టాన్ని ఆమోదించినా అది ముస్లిం మెజారిటీ ప్రాంతాలకు వర్తింపదని అన్నట్లుగా, ఉండవలసినట్లు చెప్పి సంతృప్తి ప్రకటించారు. ఇండియాను ముస్లింలీగు కోరేవిధంగా విభజించరాదన్నారు. మైనారిటీల రక్షణ అనే సాకుతో, బ్రిటిష్ పెత్తనం చిరస్థాయిగా ఉండేటట్లు, భారతదేశం అంతా ఏకరూపంగానే ఉండాలన్నారు.

కోల్. విలియమ్స్, మిస్టర్ బట్లర్ మొదలయిన లేబరుపార్టీ సభ్యులు, కన్సర్వేటివ్ ఉపన్యాసాలను తీవ్రంగా ఖండించారు. మైనారిటీలనువారు రెచ్చగొట్టుతున్నారని విమర్శించారు. కాని, పరిష్కారమార్గం మాత్రం సూచించలేక పోయారు. ఇండియాలో అంతర్యుద్ధం చెలరేగినందుకు వారు ఆందోళన తెలియజేశారు. కాంగ్రెసు - లీగు వివాదం మధ్య ప్రభుత్వం ఏమార్గం అవలంబించినా, పరిస్థితులు క్లిష్టరూపం దాల్చుతాయేమోనని వారు భయపడ్డారు.

ప్రభుత్వసభ్యుని జవాబు


చర్చకు ప్రభుత్వసభ్యుడు అలెగ్జాండర్ జవాబుచెబుతూ క్రిందివిధంగా సెలవిచ్చాడు:


(1) తాత్కాలిక ప్రభుత్వం కేంద్ర శాసనసభకు కాదు బాధ్యత వహించేది; వైస్రాయికే. 1935 రాజ్యాంగచట్టము మార్పు చెందలేదు. (2) భారత రాజకీయ పార్టీలమధ్య సామరస్యం కుదర్చడంలో ప్రధానబాధ్యత ప్రభుత్వానిదే. (3) నిమ్నజాతులుకూడా డాక్టరు అంబేద్కరు కోరేటట్లు ఒక ప్రత్యేక రాజకీయవర్గమేనని ప్రభుత్వం భావిస్తోంది. (4) మైనారిటీలకు తగిన రక్షణ ఉంటేగాని, పార్లమెంటు భారత రాజ్యాంగ చట్టాన్ని ఆమోదించదు. (5) ముస్లింలీగు పాల్గొనని రాజ్యాంగసభ నిర్ణయాలు ముస్లిం మెజారిటీ ప్రాంతాలకు వర్తించవు. (6) ఇండియానుండి బ్రిటిష్ సేనలు విజయవంతంగా కాంతి నెలకొల్పతుంటినే భారత రాజకీయ సమస్యా పరిష్కారం ఆధారపడివుంటుంది. (7) ముస్లింలీగ్‌పాల్గొనని రాజ్యాంగ నిర్మాణసభ ఎట్టినిర్ణయాలు చేయకముందే, ప్రభుత్వ వైఖరి ఎలా ఉంటుందో ముందుగా చెప్పలేము. (8) రాజ్యాంగ నిర్మాణసభలో ముస్లింలీగ్ కాంగ్రెసుతోబాటు కలిసి పాల్గొనాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

అలెగ్జాండర్ ఉపన్యాసానంతరం ప్రభుత్వ ప్రతిపాదన వోటింగు లేకుండానే ఆమోదింపబడింది.

కర్నూలు జిల్లా ఉపాధ్యాయుల మహాసభ

ఈ నెల 18, 19 వ తేదీలలో కర్నూలు జిల్లా ఉపాధ్యాయ మహాసభ నంద్యాలలో జరుగుతుందని శ్రీ ఆర్. [illegible] (అధ్యక్షులు) తెలియజేస్తున్నారు.





గుంటూరు జిల్లా చేనేత పారిశ్రామిక మహాసభకు హాజరైన 10 వేలమంది ప్రేక్షకులలో ఒక దృశ్యం



గుంటూరుజిల్లా చేనేత మహాసభాధ్యక్షులు
కామ్రేడ్ పుత్సల సత్యనారాయణ

Edited, Printed & Published by Kattagadda Rajagopala rao at the Prajasakti Press, Moghalrajapuram, Bezwada.
Consulting Editor: M. Chandrasekhara Rao

END OF ISSUE